
అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 7-7-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 187 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు వెల : 6.50

చట్టాలు రాజ్యాంగ విరుద్ధంగా ఉంటే ఉపసంహరించుకోవాల్సిందే : బాంబే హైకోర్టు



ముంబయి: చట్ట సభలు రూపొందించిన చట్టాలు రాజ్యాంగ విరుద్ధంగా వుంటే వాటిని ఉపసంహరించుకోవాల్సిందేనని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. నకిలీ, తప్పుడు సమాచార వ్యాప్తిని నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఐటీ నిబంధనలపై విచారణలో బాంబే హైకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టంలోని నిబంధనలు రూపొందించేప్పుడు మన ఉద్దేశాలు ఎంత ఉన్నతంగా ఉన్నా సరే.. వాటి ప్రభావం రాజ్యాంగ విరుద్ధంగా ఉంటే వాటిని మానుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. ఐటీ నిబంధనలకు వ్యతిరేకంగా దాఖలపై పిటిషన్లను హైకోర్టు గురువారం విచారించింది. ఆన్‌లైన్ కంటెంట్‌లో...5లో

తెలంగాణ హైకోర్టు సీజేగా అలోక్ అరదే

ఏపీ హైకోర్టు సీజేగా ధీరజ్ సింగ్ ఠాకూర్



- మరో ఐదు హైకోర్టులకు సీజేలు.. సుప్రీం కోర్టు కొలీజియం సిఫారసు

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

తెలుగు రాష్ట్రాల హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తుల పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. తెలంగాణ హైకోర్టుకు జస్టిస్ అలోక్ అరదే , ఏపీ హైకోర్టుకు జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ను కొలీజియం సిఫారసు చేసింది. సుప్రీంకోర్టు కొలీజియం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో సహా కేరళ, ఒడిశా, బాంబే, గుజరాత్, మణిపూర్ ఏడు రాష్ట్రాల హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులను సిఫారసు చేసింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని..11లో

జల్.. జంగల్.. జమీన్ కల సాకారం

ఐటీ, మున్సిపల్, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్



- 6శాతం రిజర్వేషన్లు 10శాతానికి పెంపు
- గడపగడపకూ సంక్షేమ ఫలాలు :మంత్రి కొప్పుల ఈశ్వర్

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోడు హక్కు పత్రాల పంపిణీ

నవతెలంగాణ - సిరిసిల్ల

జల్ జంగల్ జమీన్.. గిరిజన హక్కుల కోసం పోరాడిన కొమురం భీమ్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి కేసీఆర్ గిరిజనుల కల సాకారం చేశారని ఐటీ, పరిశ్రమల, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి గిరిజన రైతులకు పోడు భూముల పట్టాలు పంపిణీ చేశారు. సందర్భంగా సభలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ముందు చూపుతో రాష్ట్ర ప్రభుత్వం ..11లో

త్వరలో ధరణి ఫైల్స్

ఆధారాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్

- ధరణిలో పెట్టుబడిదారులెవరో కేంద్రం నిగ్గు తేల్చాలి :రేవంత్ రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ధరణి పోర్టల్ అక్రమాలపై త్వరలో 'ధరణి ఫైల్స్' విడుదల చేస్తామని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ధరణికి సంబంధించి టెర్రాసిస్ కంపెనీ మాత్రమే బయటకు కనిపిస్తున్నదని, కానీ దీని వెనక పెద్ద మాఫియా దాగుందని ఆరోపించారు.దీనికి సంబంధించిన ఆధారాలను సీరియల్‌గా బయటపెడతామనీ, దోపిడీలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని చెప్పారు. ధరణిలో పెట్టుబడిదారులెవరో కేంద్ర ప్రభుత్వం నిగ్గు తేల్చాలని బీజేపీ అధ్యక్షులు కిషన్‌రెడ్డికి సవాల్ విసిరారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి 'కాంగ్రెస్ భూమి డిక్లరేషన్' పత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ ధరణి రూపేణా ప్రజల ఆస్తులు, భూములు, వ్యక్తిగత వివరాలు విదేశీయుల చేతుల్లోకి వెళ్తున్నాయని ఆరోపించారు. ధరణి పోర్టల్‌లో బ్రిటిష్ ఐల్యాండ్‌కు సంబంధించిన పెట్టుబడులు ఉన్నాయన్నారు. ధరణి మొత్తం యువరాజు మిత్రుడు గాదె శ్రీధర్‌రాజు చేతుల్లో ఉందని తెలిపారు. దారి దోపిడీ దొంగలకంటే భయంకరమైన దోపిడీ జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు మాయవుతున్నాయని తెలిపారు. ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న సంస్థలో పెట్టుబడి పెట్టిన వారంతా ఆర్థిక నేరగాళ్లు అని ఆరోపించారు. ధరణిలోని అనేక లోటుపాట్లను ఆసరాగా చేసుకుని నిషేధిత జాబితాలోని భూములను అనుచరులకు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వ భూములను అనుచరులకు రిజిస్ట్రేషన్ చేసి వెంటనే ప్రొహిబిషన్ లాక్ చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వ భూములకు యజమానులను సష్టించడం, అనంతరం ఆ భూములను బదలాయించడం, ఆ తర్వాత వాటిని లేఅవుట్లు వేసి అమ్ముకోవడం వంటి తతంగం నడుస్తోందని విమర్శించారు. దేవాదాయ భూములను అక్రమంగా ఫార్మా కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. దాన్ని రద్దు చేయాలంటే కేసీఆర్ భయపడుతున్నారని చెప్పారు. ఈ విషయంలో సీఎం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. అందులో జరిగిన అక్రమాలను జులై..11లో

వితండ వాదం..

లింగ సమానత్వానికే యూసీసీ : బీజేపీ



ఎవరెన్ని అభ్యంతరాలు, సందేహాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)పై ముందుకే వెళ్లాలని బీజేపీ భావిస్తోంది. 'ఒకే దేశం...ఒకే రాజ్యాంగం' అని ప్రవచిస్తున్న ఆ పార్టీ లింగ సమానత్వం సాధించాలంటే యూసీసీ అవసరమని వితండవాదం చేస్తోంది. తద్వారా ఈ రెండింటికీ లంకె పెట్టాలని చూస్తోంది. మహిళలపై కొనసాగుతున్న వివక్షను అంతం చేయాలంటే దేశంలో ప్రస్తుతం అమలులో ఉన్న వ్యక్తిగత చట్టాలను (పర్సనల్ లా) సవరించాలని 21వ లా కమిషన్ నివేదిక సూచించింది. అయితే 22వ లా కమిషన్ గత నెలలో ఇచ్చిన నివేదికలో తాజా అంశాలను చేర్చింది.

- వ్యక్తిగత చట్టాలను సవరిస్తే సరిపోతుందంటున్న నిపుణులు

న్యూఢిల్లీ : భోపాల్‌లో జరిగిన సభలో ప్రధాని నరేంద్ర మోడీ యూసీసీ అంశాన్ని లేవనెత్తి ఈ తేనెతుట్టెను కదిల్చారు. ఎన్నికలలో లబ్ది పొందేందుకు వీలుగా హిందూ శక్తులను ఏకం చేయడానికి యూసీసీని తెర పైకి తెస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. అయితే బీజేపీ 1996లో తన ఎన్నికల ప్రణాళికలోనే లింగ సమానత్వం సాధించాలంటే యూసీసీ అవసరమని అభిప్రాయపడింది. యూసీసీ అంటే లింగ సమానత్వమే అని బీజేపీ జాతీయ ప్రతినిధి ఆర్‌పీ సింగ్ చెబుతున్నారు. కులాలు, మతాలు, జాతులకు అతీతంగా మహిళలందరికీ సమాన హక్కులు ఉండాలని ఆయన తెలిపారు. 'దేశంలోని అన్ని మతాల బాలికలకు వివాహ వయసు 18 సంవత్సరాలు కాకుండా 15 సంవత్సరాలు ఎందుకు ఉండాలి? దేశంలోని మహిళలందరికీ దత్తత చట్టాలు ఒకేలా ఎందుకు ఉండకూడదు? బహుభార్యత్వంతో మహిళలు ఎందుకు బాధపడాలి? ఇవన్నీ ఆందోళన కలిగించే విషయాలు' అని ఆయన వివరించారు. ఆ విధంగా ఆయన లింగ సమానత్వానికి, యూసీసీకి ముడిపెట్టారు.

బీజేపీ ఏం చెబుతోంది?

బీజేపీ ఎన్నికల ప్రణాళికలను పరిశీలిస్తే 1996 ప్రణాళికలో 'మహిళా శక్తి : సాధికారత దిశగా' అనే శీర్షిక కింద యూసీసీ ప్రస్తావన ఉంది. 1998 ప్రణాళికలో 'మహిళా శక్తి : మహిళల సాధికారత' అనే శీర్షిక కింద మరోసారి యూసీసీ ప్రస్తావన తెచ్చారు. 2004 ప్రణాళికలో 'మా కర్తవ్యం-కట్టుబాట్లు' అనే శీర్షిక కింద యూసీసీపై ఏకాభిప్రాయం సాధిస్తామని తెలిపారు. లింగ సమానత్వం కోసం యూసీసీని తీసుకొస్తామని, తిరోగమన వ్యక్తిగత చట్టాల రాజ్యాంగ బద్ధతకు చెల్లుచీటీ ఇస్తామని ప్రకటించారు. యూసీసీని రూపొందించేందుకు కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని 2009 ప్రణాళికలో తెలిపారు. 2014 ప్రణాళికలో ,2019 ఎన్నికల ప్రణాళికలో కూడా ఇవే పదాలను చేర్చారు.

వ్యక్తిగత చట్టాలను సంస్కరిస్తే చాలు

లింగ సమానత్వం కోసం చట్టపరమైన సంస్కరణలు తేవాలంటే యూసీసీ అవసరమే లేదని న్యాయ నిపుణులు, హక్కుల కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. లింగ సమానత్వం కోసం నిబంధనలు రూపొందించడానికి వ్యక్తిగత చట్టాలను సంస్కరించాలంటూ 21వ లా కమిషన్ చేసిన సూచన అనుసరణీయమని ...5లో

తొందరపాటు తగదు

యూసీసీపై అమర్త్యసేన్



శాంతినికేతన్ : ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)కి, హిందూ రాష్ట్ర భావనకు సంబంధం ఉన్నదని నోబెల్ బహుమతి గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్ చెప్పారు. భారతదేశ అభివృద్ధికి హిందూ రాష్ట్రం సరైన దారి కాదని వ్యాఖ్యానించారు. పైగా అది కొన్ని అభివృద్ధి కట్టడాలను కూల్చివేస్తుందని తెలిపారు. కష్టమైన విషయాలను సులభతరం చేయడానికి యూసీసీ రూపంలో నిరూపితం కాని ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. మన సమాజంలో మతాలు, చట్టాలు, విధేయతలు వంటి వైవిధ్యాలు ఉన్నాయని, విభేదాలను ...5లో

జీపీ కార్మికుల వల్లే అవార్డులు

వారి పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు



- కనీస వేతనం అమలు చేయాలి
- మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలి : తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మిక, ఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మెన్ పాలడుగు భాస్కర్
- రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలోకెళ్లిన జీపీ కార్మికులు

నవతెలంగాణ- విలేకరులు

"కార్మికుల కష్టం వల్లే గ్రామ పంచాయతీలకు ఎన్నో ఉత్తమ అవార్డులు వస్తున్నాయి.. దేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ట పెరిగింది. అలాంటి కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది.. కనీస వేతనం లేదు.. ఏండ్ల తరబడి పనిచేస్తున్నా పర్మినెంట్ లేదు.. మల్టీపర్పస్ పని విధానంతో శ్రమ దోపిడీకి గురవుతున్నారు.." అని తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మిక, ఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మెన్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్..11లో



19న అఖిలపక్ష సమావేశం


20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశాల్లో ఉమ్మడి పౌర స్మృతి బిల్లును ప్రవేశపెట్టబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేను రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓడించేందుకు కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ఏకమవుతుండటంతో ఈ సమావేశాలు వాడివేడిగా..11లో

కమ్యూనిస్టులతో కయ్యం వద్దు

మీరో మేమో తేల్చుకుంటాం




- 'స్లమ్స్' అనడానికి సిగ్గు అనిపించడం లేదా?
- కబ్జాకోరులను వదిలిపెట్టి..పేదలపై కేసులా?
- ఇండ్లులేని వారికి గూడు కల్పించే బాధ్యత సర్కారుదే : సీపీఐ ధర్నాలో కూనంనేని

వివరాలు 11లో

అందరూ థెరపిస్టులే

సామాజిక మాధ్యమాలే వేదిక

భారత్‌లో సామాజిక మాధ్యమాల వాడకం తీవ్రంగా పెరిగింది. పిల్లల నుంచి పెద్దల వరకు.. సోషల్ మీడియాను అధికంగా వాడుతున్నారు. అలాగే, ఇటు సోషల్ మీడియా ద్వారా తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ ఎందరో అనామకులు సైతం ప్రభావశీలురుగా మారుతున్నారు. ప్రజలు ఇప్పుడు సోషల్ మీడియా మాయలో పడిపోయారు. ముఖ్యంగా, కరోనా, తదనంతర పరిస్థితులు ఈ మార్పునకు కారణమవుతున్నాయి. పేరు కోసమో, సంపాదన కోసమో, ప్రభావితం చేయాలన్న లక్ష్యమో.. ఏదైనప్పటికీ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉండాలని పలు సోషల్ మీడియా ఖాతాల నిర్వాహకులు తహతహలాడుతున్నారు.

- ఆన్‌లైన్ కౌన్సిలింగ్‌లతో ప్రజల జీవితాలతో ఆటలు
- హెచ్చరిస్తున్న ఆరోగ్య,వైద్య నిపుణులు

న్యూఢిల్లీ : సామాజిక మాధ్యమాలే వేదికగా థెరపిస్టుల అవతారమెత్తుతున్నారు. నిపుణులు కాకపోయినప్పటికీ, విషయంపై అవగాహన లేకున్నా.. ఆన్‌లైన్‌లో సలహాలు, కౌన్సిలింగ్‌లు ఇస్తున్నారు. ఇలాంటి వీడియోలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్నాయి. బయటకు వెళ్లి వైద్యులను కలిసి డబ్బు వృథా చేసుకోవడం ఎందుకని ఆలోచిస్తున్న కొందరు.. ఈ ఆన్‌లైన్ థెరపిస్టులు ఇస్తున్న సలహాలను, సూచనలను పాటిస్తూ కష్టాలను కొనితెచ్చుకుంటున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అసోం రాజధాని గువహతికి చెందిన 36 ఏండ్ల ఆస్పత్రి నిర్వాహకురాలు ఇలాగే ఆన్‌లైన్‌లో ఎదురైన తన అనుభవాన్ని పంచుకున్నది. నెల రోజుల ముందు పెండ్లిని రద్దు చేసుకున్న ఆమె.. తీవ్రంగా డిప్రెషన్‌లోకి వెళ్లిపోయింది. ఈ సమయంలో ఆమె ఒక మొబైల్ యాప్ ద్వారా అజ్ఞాత 'థెరపిస్టు'ను సంప్రదించింది. ఉచిత చాట్ సెషన్ ద్వారా కౌన్సెలర్‌గా పిలవబడే ఒక వ్యక్తి కొన్ని కథలను ఆ మహిళకు చెప్పటం ప్రారంభించాడు. అయితే, వారు ఇచ్చిన సలహాలు, సూచనలు భరించలేక వెంటనే సెషన్‌ను ముగించినట్టు చెప్పింది. ఆన్‌లైన్‌లో ఇలాంటి వ్యక్తులపై నియంత్రణ, వారి అర్హతలు, శిక్షణ, ప్రమాణాల పూర్తి భయంకరమైన లోపాన్ని హైలైట్ చేస్తున్నదని నిపుణులు హెచ్చరించారు. రెండు రోజుల తర్వాత కౌన్సెలర్‌గా మారాలనుకుంటున్నారా అని యాప్ నుంచి..11లో



అమలు కాని చట్టాలు

2021లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ రంగాన్ని నియంత్రించేందుకు నేషనల్ కమిషన్ ఫర్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ యాక్ట్‌ను ఆమోదించింది. కౌన్సెలింగ్ సైకాలజీలో విద్యా ప్రమాణాలను ఏర్పాటు చేయడం, సంస్థలను అంచనా వేయడం, వారి నైపుణ్యం , సామర్థ్యాలను అంచనా వేసిన తర్వాత నిపుణుల యొక్క సెంట్రల్ రిజిస్టర్‌ను నిర్వహించడం ఈ చట్టం ఉద్దేశ్యం. అయితే ఈ చట్టం ఇంకా అమలుకు నోచుకోలేదు. ఈ సమయంలో, పర్యవేక్షణ లేకపోవడంతో ప్రస్తుత పరిస్థితులు ఏర్పడ్డాయని నిపుణులు తెలిపారు. ఇది మరింత హాని కలిగించవచ్చని హెచ్చరించారు. ఈ ట్రెండ్ ఈ రంగాన్ని చాలా ఏండ్లు వెనక్కి తీసుకెళ్తున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పర్యవేక్షణాధికారులు, సర్వీసు పర్సన్ల

పోస్టులను మంజూరు చేయాలి

బదిలీలు, పదోన్నతులు, నియామకాలకు చొరవ తీసుకోవాలి

- విద్యాశాఖ మంత్రివర్గ ఉపసంఘానికి యూఎస్‌పీసీ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పాఠశాల విద్యాశాఖలో పర్యవేక్షణాధికారులు, సర్వీసు పర్సన్ల పోస్టులను మంజూరు చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) డిమాండ్ చేసింది. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, నియామకాలకు సంబంధించి చొరవ తీసుకోవాలని కోరింది. శుక్రవారం విద్యాశాఖపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమవుతున్నందున విద్యారంగానికి సంబంధించిన సమస్యలపై చర్చించి పరిష్కారానికి సిఫారసు చేయాలని సూచించింది. ఈ మేరకు రాష్ట్ర విద్యా, ఆర్థిక శాఖల మంత్రులు పి సబితా ఇంద్రారెడ్డి, టి హరీశ్‌రావుకు యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు కె జంగయ్య, చావ రవి, వై అశోక్ కుమార్, పి నాగిరెడ్డి, ఎం సోమయ్య, టి లింగారెడ్డి, యు పోచయ్య, డి సైదులు, షౌకత్ అలీ, కె రమేష్, బి కొండయ్య, ఎస్ హరికిషన్, వై విజయకుమార్, జాడి రాజన్న, జాదవ్ వెంకట్రావు, శాగ కైలాసం గురువారం వినతిపత్రం అందజేశారు. నూతనంగా ఏర్పడిన 21 జిల్లాలకు డీఈవో పోస్టులు, నియోజకవర్గానికి ఒక డిప్యూటీ ఈవో పోస్టు, ప్రతి నూతన మండలానికి ఒక ఎంఈఓ పోస్టును మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ కోసం సర్వీసు పర్సన్లను నియమించాలని కోరారు. ఉపాధ్యాయ ఖాళీల్లో విద్యావాలంటీర్ల నియామకానికి, ఉపాధ్యాయుల బదిలీలు సాధ్యం కాకపోతే పదోన్నతులు, నియామకాల ప్రక్రియ నిర్వహణకు మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకోవాలని సూచించారు. మన ఊరు-మన బడి మొదటి దశ 9,123 పాఠశాలల్లో ఇంకా 30 శాతం కూడా పనులు పూర్తి కాలేదని తెలిపారు. మొదటి దశ పాఠశాలలను పూర్తి చేయటంతోపాటు రెండోదశ పనులను ప్రారంభించాలని, అందుకఅవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్ణయం తీసుకోవాలి

- విద్యావాలంటీర్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు శివానందస్వామి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించబోయే విద్యాశాఖ మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్ణయం తీసుకోవాలని విద్యావాలంటీర్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, టీఆర్టీ అభ్యర్థుల సంఘం ప్రధాన కార్యదర్శి మఠం శివానందస్వామి డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉపాధ్యాయుల నియమకాలు పూర్తయ్యే వరకూ గతంలో పని చేసిన విద్యా వాలంటీర్లను రెన్యువల్ చేయాలని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల నమోదుకు బడిబాట సరిపోదనీ, ప్రభుత్వం ఉపాధ్యాయుల నియామక బాట పడితేనే ఫలితాలొస్తాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయకుండా, విద్యా వాలంటీర్లను నియమించ కుండా బడిబాట నిర్వహిస్తే ఫలితముండబోదని వివరించారు. బడుల్లో ఉపాధ్యాయుల కొరత ఉంటే విద్యార్థులు ఎలా చేరుతారని ప్రశ్నించారు. తాజా ఖాళీలతో భవిష్యత్‌లో జరగబోయే ఉపాధ్యా యుల పదోన్నతుల ద్వారా ఏర్పడే ఖాళీలతో కలిపి సత్వరమే నోటిఫికేషన్ విడుదలకు విద్యాశాఖ మంత్రివర్గ ఉపసంఘం భేటీలో నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

- మంత్రి సబితకు ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలని ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని గురువారం హైదరాబాద్‌లో ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. పీఈటీలు, పండితుల సమస్యను పరిష్కరించాలని తెలిపారు. జీవోనెంబర్ 317 ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఆర్థిక భారం లేని ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరావు, నవాత్ సురేష్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీల సిబ్బందిని క్రమబద్ధీకరించండి

- మంత్రి హరీశ్‌రావుకు సీఐటీయూ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న టైమ్ స్కేల్, డైలీవేజ్, ఎన్ఎంఆర్, కంటింజెంట్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.వెంకటేశ్, అధ్యక్షులు వి.నారాయణ, ఉపాధ్యక్షులు మహేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దృష్టికి వర్సిటీ సిబ్బంది డిమాండ్లను తీసుకెళ్లారు. వారికి ఇస్తున్న మూల వేతనాన్ని కనీస వేతనంగా చెల్లించాలని కోరారు. అప్పటిలోగా రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల జీఓ 63 ప్రకారం కనీస వేతనాలు అన్ని యూనివర్సిటీల్లో తప్పనిసరిగా అమలు చేయాలని విన్నవించారు. జీఓ నెం.16 ప్రకారం యూనివర్సిటీల్లోని ఖాళీల ఆధారంగా టైమ్ స్కేల్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. పదేండ్ల సర్వీస్ దాటిన వారిని టైం స్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కాంట్రాక్టర్ మారితే సిబ్బందిని తొలగించే అన్‌ఫెయిర్ లేబర్ ప్రాక్టీసెస్ మానుకోవాలని డిమాండ్ చేశారు. రిటైర్డయిన సిబ్బందికి రూ.5 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని కోరారు. ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలన్నారు. గుర్తింపు, హెల్త్ కార్డులివ్వాలనీ, బస్సుపాస్ సౌకర్యం కల్పించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు ఆరు నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు అమలు చేయాలని కోరారు.

రాష్ట్రానికి ఏ నైతికతతో వస్తున్నారు?

పునర్విభజన హామీల అమలుపై సమాధానమివ్వాలి

- హామీల అమలుకు సీఎం ఒత్తిడి పెంచాలి
- నేడు, రేపు ప్రభావిత ప్రాంతాల్లో నిరసనలు : కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీలను అమలుపై పీఎం నరేంద్రమోదీ సమాధానమివ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ నెల 8న ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనకు వస్తున్న నేపథ్యంలో గురువారం హైదరాబాద్ మఖ్దూంభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాష్ట్రానికి ఏ నైతికతతో ప్రధాని వస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఆయన రాక సందర్భంగా విభజన హామీల ప్రభావిత ప్రాంతాలైన బయ్యారం, వరంగల్ తదితర ప్రాంతాల్లో జులై 7, 8 తేదీల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆ హామీల అమలు కోసం అన్ని పార్టీలను కలుపుకుని పీఎంపై, కేంద్రంపై ఒత్తిడి పెంచాలని సీఎం కేసీఆర్ ను కోరారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి నిధులివ్వాలని డిమాండ్ చేశారు. దక్షిణాది రాష్ట్రాల కల్పతరువు సింగరేణిని ప్రయివేటుకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

బీజేపీని నిలువరించే క్రమంలో తుదమట్టుకు నిలబడాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. మనుగోడులో వామపక్షాలు లేకుంటే బీజేపీకి పూలబాటే అయ్యేదని గుర్తుచేశారు. అప్పటికే బీఆర్ఎస్ నుంచి అనేక మంది బీజేపీలోకి వెళ్లేందుకు సిద్ధపడ్డారనీ, రాజగోపాల్ రెడ్డి ఓటమితో అది ఆగిపోయిందని చెప్పారు. అప్పుడు గెలిచి ఉంటే తెలంగాణలో మరోలా ఉండేదనీ, ఆ ప్రభావం కర్నాటకపైన పడి ఉండేదన్నారు. కానీ అది రివర్స్ చేయడంలో వామపక్షాలు కీలకపాత్ర పోషించాయని తెలిపారు. బీజేపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రాష్ట్రంలో స్థానం లేదని తేల్చిచెప్పారు.


58 జీవో ప్రకారం ఇండ్లస్థలాలకు వెంటనే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. దళిత బంధును పారదర్శకంగా ఇవ్వాలని కోరారు. కనీసం 10 నుంచి 15 లక్షల డబుల్ బెడ్ రూం ఇండ్లను ఇవ్వాలనీ, ఇందుకు కేంద్రం కూడా సహకరించాలని కోరారు. మిగిలిన కాంట్రాక్టు ఉద్యోగులందరిని పర్మినెంట్ చేయాలనీ, ఖాళీలన్నింటిని భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ, కాజీపేటలో భూములు అందుబాటులో ఉన్నప్పటికీ ఏర్పాటు చేయకుండా రైల్వే కోచ్ ఫ్యాక్టరీని గుజరాత్, ఇంకో చోట ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, బాల నర్సింహా పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీ వర్గాల విద్యార్థులను ప్రధాన స్రవంతిలో ఎలా ఇమిడి ఉంచగలమో ప్రతిపాదించాలి. భవిష్యత్తులో అలా జరగకుండా కనీస జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ పిటిషన్‌కు అభ్యంతరాల రూపంలో సమాధానం ఇవ్వకుండా, పిటిషన్‌లో లేవనెత్తిన ఆందోళనలను యూజీసీ ఎలా పరిష్కరిస్తుందో, సరిదిద్దుతుందో తెలపాలి'
- న్యాయమూర్తులు

విద్యా సంస్థల్లో కుల వివక్ష అంతానికి తీసుకున్న చర్యలేంటి?

యూజీసీకి సుప్రీంకోర్టు ఆదేశం

పిటిషన్ దాఖలు చేసిన రోహిత్ వేముల, పాయల్ తాడ్వి తల్లులు



న్యూఢిల్లీ : ఉన్నత విద్యా సంస్థల్లో కుల వివక్షను అంతం చేయడానికి తీసుకున్న చర్యలేమిటో తెలపాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)ని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించేందుకు మార్గదర్శకాలు ఇవ్వాలని కోరుతూ రోహిత్ వేముల, పాయల్ తాడ్వి తల్లులు రాధిక వేముల, అబేద తాడ్వి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎఎస్ బోపన్న, జస్టిస్ ఎంఎం సుందరేష్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం విచారించింది. దీనిపై యూజీసీ స్పందనను ధర్మాసనం కోరింది. అంతిమంగా ఇది ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల తల్లిదండ్రుల ప్రయోజనాలకు సంబంధించినది. భవిష్యత్తులో అలా జరగకుండా కనీస జాగ్రత్తలు తీసుకోవాలని యూజీసీకి జస్టిస్ బోపన్న సూచించారు. ఈ పిటిషన్ వ్యతిరేకత లేనిదని, కాబట్టి అభ్యంతరాల రూపంలో సమాధానం ఇవ్వకుండా, పిటిషన్‌లో లేవనెత్తిన ఆందోళనలను యూజీసీ ఎలా పరిష్కరిస్తుందో, సరిదిద్దుతుందో తెలపాలని యూజీసీకి జస్టిస్ బోపన్న తెలిపారు.

యూజీసీ ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు చేపట్టిందో, ఏం చేయాలని ప్రతిపాదించారో తెలపాలని యూజీసీని జస్టిస్ ఎంఎం సుందరేష్ కోరారు. ఇది సున్నితమైన అంశమని యూజీసీకి తెలపాలని, ఇది విరుద్ధమైనది కాదు కాబట్టి మీరు సూచనల కోసం పిటిషనర్ తరపు న్యాయవాదితో కూడా చర్చించవచ్చని యూజీసీ తరపు న్యాయవాదికి జస్టిస్ బోపన్న సూచించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల విద్యార్థులను ప్రధాన స్రవంతిలో ఎలా ఇమిడి ఉంచగలమో ప్రతిపాదించాలని యూజీసీకి జస్టిస్ ఎంఎం సుందరేష్ సూచించారు.

పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్, న్యాయవాది దిశా వాడేకర్ వాదనలు వినిపించారు. విద్యా సంస్థల్లో కుల వివక్షకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించడానికి 2012లో యూజీసీ రూపొందించిన ఈక్విటీ నిబంధనలు సరిపోవని స్పష్టం చేశారు. ఈ నిబంధనలకు కట్టుబడి ఉండే స్వభావం లేకపోవడం దురదృష్టకరమనీ, ఎందుకంటే నిబంధనలను ఉల్లంఘించినందుకు వాటిపై చర్యలేమీ లేవని అన్నారు. ఈ నిబంధనలు కూడా యాంటీ ర్యాగింగ్ నిబంధనలు వంటి వాటివేనని, అవి ఎప్పుడూ అమలు కావటంలేదని ఇందిరా జైసింగ్ అభిప్రాయపడ్డారు.

2019 సెప్టెంబర్ నాటికే ఈ విషయంలో కేంద్రానికి నోటీసులు జారీ చేశామని, ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. 2023లో ఇప్పటికే మరో ముగ్గురు విద్యార్థుల ఆత్మహత్యలు జరగడం దురదృష్టకరమనీ, వారిలో ఒకరు నేషనల్ లా స్కూల్‌లో, ఒకరు మెడికల్ కాలేజీలో, ఒకరు ఐఐటీలో ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. అందువల్ల ఈ పిటిషన్ చాలా ముఖ్యమైనదని, అన్ని ఉన్నత విద్యా సంస్థలకు మార్గదర్శకాలను రూపొందించాలని కోరారు.

రాధిక వేముల కుమారుడు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల 2016 జనవరి 17న ఆత్మహత్య చేసుకోగా, ముంబాయిలోని టిఎన్ టోపివాలా నేషనల్ మెడికల్ కాజేలీలో ఆదివాసీ విద్యార్థిని, అబేదా తాడ్వీ కుమార్తె పాయల్ తాడ్వీ 2019 మే 22న ఆత్మహత్య చేసుకున్నారు. ఈ రెండు ఆత్మహత్యలకు గల ప్రధాన కారణం విద్యా సంస్థల్లో జరిగిన కుల వివక్షేనని స్పష్టమైంది.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్



నవతెలంగాణ - ధూల్‌పేట్

ల్యాబ్స్, పబ్లిక్ సెక్టార్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ డిమాండ్ చేశారు. కనీస వేతనాల క్యాంపెయిన్‌లో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీపుజాత గురువారం హైదరాబాద్ కంచన్‌బాగ్ పరిశ్రమకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్నదన్నారు. వారికి చట్టపరంగా వచ్చే హక్కులు మాత్రం కాంట్రాక్టర్లు, మేనేజ్‌మెంట్ అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. రక్షణ పరికరాలు, నాణ్యమైన యూనిఫామ్, 30 రోజుల వేతనంతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్ అయిన కార్మికులకు కచ్చితంగా గ్రాట్యూటీ అమలు చేయాలని, పీఎఫ్ ఈఎస్‌ఐ, సెలవులు, బోనస్ సక్రమంగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని, లేని పక్షాన కార్మికులతో కలిసి పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కన్వీనర్ ఎస్ కిషన్, సత్తన్న బాబురావు, శంకరన్న, మీన, గౌస్, స్వామి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఈ నెల 10,11,12 తేదీల్లో టోకెన్ సమ్మె : ఎస్వీ రమ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ.రమ డిమాండ్ చేశారు. మిడ్‌డేమీల్స్ కార్మికుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 10,11,12 తేదీల్లో టోకెన్ సమ్మె నిర్వహించబోతున్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో టోకెన్ సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.2 వేల వేతన పెంపును అమలు చేయాలని కోరారు. అప్పటినుండి జీఓ నెం.8 ప్రకారం ఎరియర్స్‌తో సహా చెల్లించాలని విన్నవించారు. కేటాయించిన బడ్జెట్ ప్రస్తుత మెనూకే సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.. కొత్త మెనూ (రాగి జావ, అన్ని కూరగాయలతో కూర, వెజిటేబుల్ బిర్యానీ, ఆకు కూర పప్పు)ను పెట్టాలని ఒత్తిడి చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు.. తక్షణమే కొత్త మెనూను సవరించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకు అప్పజెప్పే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పోస్టరావిష్కరణలో ఆ యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఉన్ని కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్. ప్రవీణ్‌కుమార్, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. సునీత, భారతి పాల్గొన్నారు.

వేతనాలు పెంచకుండా.. శ్రమ దోపిడీ



- వేతనాలు పెంచకుంటే.. కార్మిక శక్తి ఏంటో చూపిస్తం
- వలస కార్మికులతో వెట్టి చేయిస్తున్న యాజమాన్యాలు : సంగారెడ్డి జీపుజాతాలో భూపాల్, మల్లిఖార్జున్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కార్మికులకు వేతనాలు పెంచకుండా కంపెనీల యాజమాన్యాలు శ్రమదోపిడీకి పాల్పడుతున్నాయని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, మల్లికార్జున్ అన్నారు. షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో కనీస వేతనాలను సవరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రాష్ట్రవ్యాప్త జీపుజాతా గురువారం సంగారెడ్డి జిల్లాలోని పారిశ్రామిక వాడల్లో పర్యటించింది. కంది, సంగారెడ్డి, హత్నూర, కొండాపూర్, సదాశివపేట, జహీరాబాద్‌లోని వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల్ని కలిసి వారి కష్టనష్టాలను అడిగి తెలుసుకున్నారు. వలస కార్మికుల్ని కలిసి అదనపు పని గంటలు, తక్కువ వేతనాలు, నివాస ప్రాంతంలో కనీస సదుపాయాల లేమీ వంటి అంశాల గురించి మాట్లాడారు. అనంతరం సాయంత్రం సంగారెడ్డిలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదేండ్లుగా కనీస వేతనాలు సవరించాలని అనేక రూపాల్లో పోరాటాలు చేసినప్పటికీ వేతనాల సవరణకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడంలేదని విమర్శించారు.

80 శాతం మంది హిందీ ప్రాంతం నుంచి వలసొచ్చిన కార్మికులున్నారని, వీరందరితో తక్కువ వేతనాలతోనే 12 గంటల పాటు పనిచేయించుకుంటున్నారన్నారు. నివాస ప్రాంతాల్లో బానిసల్ని పెట్టినట్టు పెట్టి పనిచేయించుకోవడం దారుణమన్నారు. సంగారెడ్డి జిల్లాలో 1375 భారీ, మధ్యతరహా పరిశ్రమలున్నాయని, వీటిల్లో లక్షా 80 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వీరిలో కేవలం 60 వేల మంది మాత్రమే యూనియన్ల పోరాటం వల్ల పర్మినెంట్ కార్మికులుగా పనిచేస్తున్నారని తెలిపారు.

మిగతా లక్షా 20 వేల మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారని, వీరికి తక్కువ వేతనాలిచ్చి 12 గంటల పాటు పనిచేయిస్తూ శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. లక్షల కోట్ల విలువ చేసే భూముల్ని ధారాదత్తం చేస్తున్న పాలకులు శ్రమ శక్తితో సంపదను సృష్టిస్తున్న కార్మికులకు వేతనాలు పెంచడానికి ఎందుకు మనసొప్పట్లేదని ప్రశ్నించారు. వేతనాలు పెంచకపోవడమంటే శ్రమను దోచుకోవడమేనన్నారు. కనీస వేతనాల సమస్య అనేది వర్గ పోరాటమని, కనీస వేతనాలను సవరించే వరకూ సీఐటీయూ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. శ్రమదోపిడికి వ్యతిరేకంగా సమరశీలంగా ఉద్యమించి, కార్మిక శక్తి ఏమిటో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చూపిస్తామని హెచ్చరించారు. సభలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బీ.మల్లేశం, జిల్లా కార్యదర్శి జి.సాయిలు, ఉపాధ్యక్షులు బాగారెడ్డి, సహాయ కార్యదర్శి యాదగిరి, నాయకులు ప్రసన్న బాలరాజు, కొండల్‌రెడ్డి, ప్రవీణ్, శ్రీధర్, నాగభూషణం, జెమినా పాల్గొన్నారు.



'దళారుల నొక్కుడుపై కదిలిన యంత్రాంగం'

- నవతెలంగాణ కథనానికి విశేష స్పందన
- పలువురిపై కేసు నమోదు

నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం సర్వే నెంబరు 62లో దళిత గిరిజనుల భూమిలో జరిగిన ల్యాండ్ పూలింగ్ అంశంపై "దళితుల భూమిలో దళారుల నొక్కుడు" అనే శీర్షికన నవతెలంగాణలో గురువారం ప్రచురితమైన కథనంతో పోలీసు యంత్రాంగం కదిలింది. ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చిన కుటుంబాల నుంచి బలవంతంగా అగ్రిమెంట్ చేసుకున్న వారిపై కేసులు నమోదు చేశామని మేడిపల్లి సీఐ గోవర్ధనగిరి తెలిపారు. గురువారం సీఐ మాట్లాడుతూ.. ల్యాండ్ పూలింగ్‌లో భూములు కోల్పోయిన దళిత గిరిజన రైతులకు ప్రభుత్వం ఎకరానికి 600 గజాల చొప్పున ఇచ్చిందని తెలిపారు. కానీ కొంత మంది పైరవీకారులు అధికారులు, లాయర్లు, ప్రజాప్రతినిధులకు డబ్బులు ఇవ్వాలంటూ ఒక్కో రైతు కుటుంబం నుంచి 100 గజాలు బలవంతంగా అగ్రిమెంట్ చేసుకున్నాట్టు ఫిర్యాదు అందిందన్నారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నామన్నారు. మల్కాజిగిరి ఏసీపీ నరేష్ రెడ్డి నేతృత్వంలో ఇప్పటికే కొన్ని ఆధారాలు సేకరించి లోతుగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఎంత మంది నుంచి అగ్రిమెంట్లు చేసుకున్నారు, నగదు రూపంలో ఎంతమంది దగ్గర వసూలు చేశారనే కోణంలో విచారణ జరుగుతుందని చెప్పారు. త్వరలోనే పూర్తి వివరాలు మీడియా ముందుకు వస్తాయన్నారు.

నీట మునిగిన పేదల భూపోరాట కేంద్రం

- సందర్శించిన సీపీఐ(ఎం) నేతలు



నవతెలంగాణ-కంఠేశ్వర్

బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నిజామాబాద్ నగరంలోని దుబ్బా ప్రాంతంలో నిరుపేదలు వేసుకున్న గుడిసెలు నీట మునిగాయి. ఈ భూపోరాట కేంద్రాన్ని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్యాల గోవర్ధన్, జిల్లా కమిటీ సభ్యులు బెజగం సుజాత గురువారం సందర్శించారు. నీటిని తొలగించేందుకు సహాయక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇండ్ల బాధితులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. నీరు వచ్చిందని.. ఈ స్థలాలను విడిచేది లేదని, పోరాటాన్ని రెట్టింపు ఉత్సాహంతో ఉధృతం చేస్తామని పేదలు స్పష్టం చేశారు. అధికారులు స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని, తాగునీరు కరెంటు తదితర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. వారి వెంట ఇండ్ల స్థలాల సాధన పోరాట కమిటీ నాయకులు కళావతి, భాస్కర్, రాజు, అంజయ్య తదితరులు ఉన్నారు.

టీఎస్పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించిన పీఈటీ అభ్యర్థులు

- 2017లో ఎంపికైన వారికి పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్
- టీఎస్‌పీఎస్సీ స్పందించకపోవడంపై ఆగ్రహం



నవతెలంగాణ -సుల్తాన్‌బజార్

గురుకులాల్లో 2017లో విడుదల చేసిన పీఈటీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాన్ని గురువారం ముట్టడించారు. పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర తోపులాట జరిగింది. అభ్యర్థులను అరెస్టు చేసి అబిడ్స్, నాంపల్లి పోలీసు స్టేషన్‌లకు తరలించారు. ఈ క్రమంలో గాంధీ భవన్‌లో బైటాయించిన కొంతమంది అభ్యర్థులు మాట్లాడుతూ.. తమకు వెంటనే పోస్టింగ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2017 సంవత్సరంలో విడుదల చేసిన గురుకుల పీఈటీ పోస్టులు ఇప్పటి వరకు భర్తీ చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2017లో 616 పోస్టులతో విడుదలైన నోటిఫికేషన్‌కు సంబంధించిన పరీక్ష రాసిన 1232 మందిని ఎంపిక చేశారని తెలిపారు. మధ్యలో కోర్టు కేసులతో వాయిదా వేస్తూ ఆరు సంవత్సరాలు కాలయాపన చేశారన్నారు. ఇటీవల కోర్టు కేసు పూర్తి అయినప్పటికీ టీఎస్‌పీఎస్సీ స్పందించటం లేదని వాపోయారు. వెంటనే 616 పోస్టులను భర్తీ చేయాలని, లేదంటే ఇక్కడే ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

మహిళా కాంగ్రెస్ నిరసన

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ...మహిళా కాంగ్రెస్ నిరసన తెలిపింది. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ వద్ద మహిళలు కూరగాయలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సునీతారావు మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు పెంచిన కూరగాయల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. పక్క రాష్ట్రాల నుంచి కూరగాయలు, నిత్యావసర వస్తువులు తీసుకొచ్చి వినియోగదారులకు సబ్సిడీతో సరఫరా చేయాలని కోరారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు పేద, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. టమాట, పచ్చిమిర్చి, బీన్స్ ధరలు ఆకాశానంటుతున్నాయని చెప్పారు. ప్రభుత్వాలు వెంటనే దిగొచ్చి పేదలకు ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గం సమావేశమైంది. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు కృషి చేయాలని నిర్ణయించారు.



గాంధీభవన్‌లో బోనాలు

మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆషాఢ మాసం బోనమెత్తారు. మహిళలు బోనమెత్తి ఉత్సాహంగా నృత్యం చేశారు. డప్పు వాయిద్యాలతో అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా సునీతారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రజలందరూ సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, ఆయూ ఆరోగ్యాలతో ఉండాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ఇంటర్ వరకు 38 కేజీబీవీల అప్‌గ్రేడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని 38 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ)ను ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాటిలో ప్రస్తుత విద్యాసంవత్సరం (2023-24)లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం, 2024-25 విద్యాసంవత్సరంలో ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వంపై ఏటా రూ.7.60 కోట్ల భారం పడుతుందని వివరించారు. రాష్ట్రంలో 475 కేజీబీవీలున్నాయనీ, వాటిలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 245 విద్యాలయాలను ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేసిందని పేర్కొన్నారు. వాటిలో ప్రస్తుతం 26,027 మంది బాలికలు ఇంటర్మీడియట్ చదువుతున్నారని తెలిపారు. ప్రస్తుతం 38 కేజీబీవీలను అప్ గేడ్ చేయడం వల్ల ఈ సంవత్సరం అదనంగా 3,040 మంది బాలికలకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఉన్న 475 కేజీబీవీల్లో మొత్తం 1,33,879 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. నూతనంగా అప్‌గ్రేడ్ చేసిన కేజీబీవీల్లో ఎంపీసీ, బైపీసీ రెండు గ్రూపులను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రకు పలు ఉద్యోగ సంఘాల మద్దతు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి నిర్వహించబోయే పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రకు పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు సంపూర్ణ మద్దతును ప్రకటించాయి. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల గుండా సీపీఎస్ రద్దు కోసం పాత పెన్షన్‌ను పునరుద్ధరించడానికి ఈ రథయాత్రను చేపడుతున్నది. సీపీఎస్ ఉద్యోగుల సామాజిక భద్రత కోసం చేపట్టే ఈ రథయాత్రతోపాటు ఆగస్టు 12న చలో హైదరాబాద్ కార్యక్రమాలకు ఈ రథయాత్రకు టీజీవో కేంద్ర సంఘం అధ్యక్షురాలు వి మమత, ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జి సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం పర్వత్‌రెడ్డి, అగ్రి కల్చర్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి తిరుపతి నాయక్, క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్‌తో కలిసి గురువారం హైదరాబాద్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దర్శన్ గౌడ్, కోటకొండ పవన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నరేందర్‌రావు, నాయకులు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్, బీడీఎస్ కన్వీనర్ కోటా సీట్ల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వైద్య, దంత ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం అయింది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాలకు గాను ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదుకు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల్లో కన్వీనర్ కోటా సీట్లను భర్తీ చేయనున్నారు. జాతీయ స్థాయి అర్హత పరీక్ష నీట్ 2023లో అర్హత సాధించిన అభ్యర్థులు నమోదు చేసుకోవాలని కోరారు. జులై 7 వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 14వ తేదీ సాయింత్రం 6 గంటల వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాలకు సంబంధించి అర్హత, ఇతర సమాచారం కోసం యూనివర్సిటీ వెబ్ సైట్ www.knruhs.telangana.gov.inలో సంద్రించొచ్చు.

హైదరాబాద్‌లో చిన్నారుల కిడ్నాప్

- ఘట్కేసర్‌లో ఒకరు.. సికింద్రాబాద్‌లో మరొకరు..
- ఒకరిని రక్షించిన పోలీసులు.. మరొకరి కోసం గాలింపు



నవతెలంగాణ-ఘట్కేసర్

హైదరాబాద్‌లో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు చిన్నారుల కిడ్నాప్‌లు కలకలం సృష్టించాయి. ఒకరిని పోలీసులు గంటల వ్యవధిలోనే రక్షించగా.. మరో చిన్నారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వివరాల్లోకెళ్తే.. ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధి ఘట్కేసర్ ఈడబ్ల్యుఎస్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో భరత్- రాజేశ్వరి కుటుంబం నివాసముంటోంది. వారి కుమార్తె కృష్ణవేణి బుధవారం రాత్రి చాక్లెట్‌లు కొనుక్కోవడానికి బయటకు రాగా.. సురేష్ అనే యువకుడు కిడ్నాప్ చేశాడు. చిన్నారి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చిన్నారితో ఉన్న నిందితున్ని రైల్వే పోలీసులు అనుమానించి విచారించగా కిడ్నాప్ విషయం బయటపడింది. అతన్ని అదుపులోకి తీసుకుని గురువారం మధ్యాహ్నం ఘట్కేసర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహన్, మల్కాజిగిరి డీసీపీ జానకి, ఏసీపీ నరేష్ రెడ్డి, సీఐ మహేందర్ రెడ్డి చిన్నారిని తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఫిర్యాదు అందిన వెంటనే ప్రత్యేక పోలీసు బలగాలు 24 గంటల్లోపు కిడ్నాపర్‌ను పట్టుకున్నారని, వారిని అభినందించారు. కొందరు యువకుల సహకారంతో నిందితున్ని త్వరగా పట్టుకోగలిగామని చెప్పారు.

ఇదిలా ఉండగా, సికింద్రాబాద్ గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడు నెలల చిన్నారి అపహరణకు గురయ్యాడు. సీఐ మురళీధర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పింకీదేవి- అజయ్ దంపతులు పటాన్‌చెరులోని ఇస్నాపూర్‌లో నివసిస్తూ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన వారు ఈనెల 4న తమ స్వగ్రామానికి వెళ్లేందుకు ముగ్గురు పిల్లలతో కలిసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో దంపతులిద్దరూ మద్యం మత్తులో ఉండి గొడవ పడ్డారు. ఈ క్రమంలో వారి ఏడు నెలల కొడుకు కన్నయ్య కనిపించకుండా పోయాడు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో వారు వెతికినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో.. గోపాలపురం పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు రెండు టీంలుగా ఏర్పడి బాలుడి కోసం గాలిస్తున్నారు. ఓ మహిళ బాలున్ని తీసుకెళ్లినట్టు గుర్తించిన పోలీసులు ఆమె చెన్నయ్‌కి చేరుకున్నట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రియల్ ఎస్టేట్ ఇబ్బందుల్లో ఉంది..సీఎస్‌కు వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రియల్ ఎస్టేట్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు రాష్ట్ర స్థాయి సమన్వయ సమావేశం గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయములో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధ్యక్షతన జరిగింది. క్రెడాయ్, నారెడ్కో, తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్, తెలంగాణ డెవలపర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, కమర్షియల్ ట్యాక్స్, కార్మిక శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు రియల్ ఎస్టేట్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై సభ్యులు సీఎస్‌కు విన్నవించారు. వాటిని త్వర్వగా పరిష్కరించడానికి ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. ప్రస్తుత మాస్టర్‌ప్లాన్‌లోని కొన్ని అంశాలు రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ఆటంకంగా ఉన్నాయనీ, కొత్త మాస్టర్‌ప్లాన్ రూపొందించే వరకు మున్సిపల్ శాఖలో కమిటీ వేసి ప్రస్తుత మాస్టర్ ప్లాన్‌లోని అంశాలను మార్చాలనీ, ఇతర పరిశ్రమల మాదిరిగానే నిర్మాణ స్థలంలో తాత్కాలిక వాటర్ కనెక్షన్ కూడా ఇవ్వాలని ప్రతినిధులు సూచించారు. భవన నిర్మాణ అనుమతితో పాటు టీఎస్‌బీపాస్ కింద బోర్‌వెల్‌కు అనుమతి ఇవ్వాలని కోరారు.


సంపాదకీయం

పశ్చిమ దేశాలకు ఓ హెచ్చరిక!

"మీరు మమ్మల్ని ముట్టుకోనంతవరకు, మేము ఎవరి మీదా అణ్వాయుధ దాడికి దిగే ఆలోచన లేదు, కనుక దాని గురించి మరచిపోండి. అలాగాక దాడికి దిగారో తక్షణ ప్రతిస్పందన ఉంటుంది, దేన్ని దెబ్బతీయాలో తెలుసు" అని గురువారం నాడు రష్యా మిత్రదేశమైన

> చైనాను దెబ్బతీయాలని చూస్తున్న జపాన్, దక్షిణ కొరియా,ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల నేతలు కూడా విలినస్ శిఖరాగ్ర సభకు హాజరౌతున్నారు. ప్రస్తుతం తూర్పు, దక్షిణ చైనా సముద్రాల్లో పరిస్థితి ప్రశాంతంగానే ఉంది. కనుక విలినస్ సమావేశంలో చైనా అంశాలను లేవనెత్తకుండా ఐరోపా, ప్రపంచ భద్రత, శాంతికి నిర్మాణాత్మక చర్చలు జరిపితే అందరికీ మంచిదని చైనా సున్నితంగా హెచ్చరించింది. సామ్రాజ్యవాదులు, యుద్ధోన్మాదులతో ఉన్న నాటో కూటమికి ఈ హితవచనాలు చెవికెక్కుతాయా?

బెలారస్ అధినేత అలెగ్జాండర్ లుకషెంకో పశ్చిమ దేశాలను హెచ్చరించాడు. దీన్ని వాస్తవానికి పుతిన్ హెచ్చరికగానే పరిగణించాలి. గతేడాది మార్చినెల నుంచి రష్యన్ దళాల ఆధీనంలో ఉన్న ఉక్రెయిన్ జపోరిఝియా అణువిద్యుత్ కేంద్రాన్ని పేల్చివేసేందుకు చూస్తున్నారని జెలెన్స్కీ గత కొద్ది రోజులుగా చేస్తున్న ఆరోపణల పూర్వరంగంలో ఈ హెచ్చరిక వెలువడిందని చెప్పవచ్చు. తప్పుడు ప్రచారం చేసి వారే పేల్చివేసి తమ మీద నెట్టేందుకు చూస్తున్నారని రష్యా ప్రకటించింది. మరోవైపున ఏదో ఒక మిషతో జెలెన్స్కీ దళాలకు ఆధునిక ఆయుధాలు అందచేసేందుకు నాటో, పశ్చిమ దేశాలు చూస్తున్న తరుణంలో లుకషెంకో హెచ్చరికను తేలికగా తీసుకోలేము. క్రిమియా వంతెన పేల్చివేతకు, ఐరోపాకు గాస్, చమురును సరఫరా చేసే పైప్‌లైన్ల ధ్వంసానికి ఉక్రెయిన్ దాడులు చేసిన సంగతి తెలిసిందే. కఖోవ్ఖా రిజర్వాయర్ ఆనకట్టకు గండికొట్టి దిగువన ఉన్న ప్రాంతాలను ముంచివేసిన కుట్ర గురించి చెప్పనవసరం లేదు. ఆత్మరక్షణకు ఎదురుదాడులు అని చెప్పిన జెలెన్స్కీ నాటో అండ చూసుకొని ఏకంగా మాస్కో మీద దాడులకు డ్రోన్లను పంపటాన్ని కూడా ప్రపంచం చూసింది.



ఈనెల 11-12 తేదీల్లో లిథువేనియా రాజధాని విలినస్ నగరంలో నాటో వార్షిక శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఆ లోపుగా సంచలనం కలిగించే విధంగా జపోరిఝియా అణువిద్యుత్ కేంద్రం మీద ఉక్రెయిన్ కిరాయి దళాలు దాడులకు దిగవచ్చని మాస్కో అనుమానిస్తున్నది. జెలెన్స్కీ ఆరోపణల పూర్వరంగంలో అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ ప్రతినిధులు ఆ కేంద్రాన్ని తనిఖీ చేసి ఎలాంటి అనుమానిత పేలుడు, ఇతర పదార్థాలు లేవని చెబుతూనే, పూర్తిగా తనిఖీకి అనుమతించలేదని ముక్తాయింపునిచ్చారు. ఆ కేంద్రంలోని రెండు చోట్ల పేలుడు పదార్థాల మాదిరి ఉన్న వాటిని అమర్చినట్లు జెలెన్స్కీ ఆరోపించాడు. వాటి కొనసాగింపుగా ఆ కేంద్రంలోని సిబ్బందిని, రష్యన్ మిలిటరీని ఖాళీ చేయించినట్లు కూడా ప్రచారం చేశారు. ఆ కేంద్రాన్ని కవచంగా చేసుకొని తమ ప్రాంతాలపై రష్యా దళాలు దాడి చేస్తున్నట్లు, తాము ప్రతిదాడి జరిపితే అణు విద్యుత్ కేంద్రానికి హాని జరిగే అవకాశం ఉన్నందున ఆ వైపు వెళ్లటం లేదని ఉక్రెయిన్, పశ్చిమ దేశాల మీడియా కూడా ప్రచారం చేస్తున్నది.

తమను వెంటనే నాటోలో చేర్చుకోవాలని, ఆధునిక అస్త్రాలను పెద్ద ఎత్తున సరఫరా చేయాలని ఉక్రెయిన్ డిమాండ్ చేస్తున్నది. గత నెల రోజులుగా ఎదురుదాడుల పేరుతో జరుపుతున్న ప్రచారంలో పసలేకపోగా మిలిటరీ, ఆయుధాలు కూడా పెద్ద ఎత్తున పోగొట్టుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ పూర్వరంగంలో నిబంధనలను సడలించి తక్షణమే నాటోలో చేర్చుకొనేందుకు విలినస్ శిఖరాగ్ర సభ పూనుకోవచ్చని చెబుతున్నారు. అదే గనుక జరిగితే ఉక్రెయిన్ సంక్షోభ స్వభావమే మారిపోతుంది. పుతిన్ మీద నేరుగా ఆ కూటమి సేనలు యుద్ధానికి దిగవచ్చు. రష్యా దాడులకు దిగకముందు ఉన్న పరిస్థితి వేరు. తరువాత తమ ప్రాంతాలను ఆక్రమించుకున్నందున నాటో సభ్యత్వం ఇవ్వాలని గతేడాది సెప్టెంబరులో జెలెన్స్కీ దరఖాస్తు చేశాడు. అనేక దేశాలు అందుకు మద్దతు తెలిపినా అమెరికా, జర్మనీ సిద్ధం కాలేదు. కొన్ని ప్రాంతాలు ఉక్రెయిన్నుంచి వేరుపడి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాయి. క్రిమియా ద్వీపం తమదే అంటూ 2014లోనే రష్యా స్వాధీనం చేసుకుంది. మరికొన్ని ప్రాంతాలు ఇప్పుడు దాని ఆధీనంలో ఉన్నాయి, పోరు జరుగుతున్నది.అటువంటప్పుడు మధ్యలో సభ్యత్వం ఇవ్వటం, గతం నుంచి వర్తింపచేసి ఎదురుదాడులకు పూనుకోవటం నాటో ఐదవ ఆర్టికల్ నిబంధన పరిధిలోకి రాదని చెబుతున్నారు. సవరించి ఆ పని చేయటమంటే రష్యాతో నేరుగా తలపడేందుకు నాటో సిద్ధమైనట్లే? మాడ్రిడ్‌లో గతేడాది జరిగిన శిఖరాగ్ర సమావేశంలో తొలిసారిగా నాటో కూటమి భద్రతకు చైనా ఒక సవాలుగా ఉందని ప్రకటించారు. ఉక్రెయిన్ సంక్షోభంలో చైనా తటస్థంగా ఉన్నప్పటికీ రాజకీయంగా రష్యాతో ఉన్న పటిష్టమైన సంబంధాలు కలిగి ఉన్న సంగతి తెలిసిందే. చైనాను దెబ్బతీయాలని చూస్తున్న జపాన్, దక్షిణ కొరియా,ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల నేతలు కూడా విలినస్ శిఖరాగ్ర సభకు హాజరౌతున్నారు. ప్రస్తుతం తూర్పు, దక్షిణ చైనా సముద్రాల్లో పరిస్థితి ప్రశాంతంగానే ఉంది. కనుక విలినస్ సమావేశంలో చైనా అంశాలను లేవనెత్తకుండా ఐరోపా, ప్రపంచ భద్రత, శాంతికి నిర్మాణాత్మక చర్చలు జరిపితే అందరికీ మంచిదని చైనా సున్నితంగా హెచ్చరించింది. సామ్రాజ్యవాదులు, యుద్ధోన్మాదులతో ఉన్న నాటో కూటమికి ఈ హితవచనాలు చెవికెక్కుతాయా?

అవార్డులు కాదు, ఏకంగా విజ్ఞాన శాస్త్రాన్నే నిషేధించండి!

భారత ప్రభుత్వం వారి డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మూడు ముఖ్యమైన సైన్స్ అకాడెమీలకు నిధులు సమకూరుస్తుంది. అవి

1. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడెమీ (INSA)
2. నేషనల్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్, ఇండియా (NASI)
3. ఇండియన్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ (ఐఎఎస్) (IAS)

ఈ మూడూ స్వయం ప్రతిపత్తి గల సంస్థలు. ఈ దేశ ప్రజలకు ఉపయోగకరమైన పరిశోధనలు చేయడం వీటి ధ్యేయం!అంతే కాదు, దేశంలో ఉత్తమ పరిశోధనలు చేస్తూ, సమాజానికి మేలు చేస్తున్న శాస్త్రజ్ఞుల్ని గుర్తించడం, వారికి అవార్డులు ప్రకటించి ప్రోత్సహించడం వీటి ఉద్దేశం. ఇందులో మూడవది ఇండియన్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ (IAS) అవార్డులు ప్రకటించదు. కాని, మొదటి రెండు దేశ వ్యాప్తంగా శాస్త్ర, సాంకేతిక, విద్య ఆరోగ్య రంగాలలో కొన్ని వందల సంఖ్యలో ప్రతి యేటా అవార్డులు ప్రకటిస్తోంది.



డాక్టర్ దేవరాజు మహారాజు

పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయాల సిలబస్‌లోంచి వైజ్ఞానిక విషయాలు, చారిత్రక అంశాలు తొలగించి తమ హిందూత్వ ఎజెండాను అమలు పరచాలనుకుంటున్న ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం 'విజ్ఞాన్ ప్రసార్' లాంటి గొప్ప వైజ్ఞానిక సంస్థను కూడా మూసేసింది. అంటే వైజ్ఞానిక స్పృహకు దేశంలో తలుపులు మూసేసింది. వీటన్నిటిని ప్రారంభించి, ప్రోత్సహించింది భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గనక, ఆయనపై ఉన్న వ్యక్తిగత కక్ష కారణంగానే వైజ్ఞానిక సంస్థలు మూసివేయడం, వాటికి ప్రతి యేటా ఇవ్వాల్సిన నిధులు అందివ్వకపోవడం చేస్తున్నారేమో - ఇటీవల

> అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఒక ఇంటర్వ్యూలో భారత ప్రధానిని ఉద్దేశించి సంధించిన ప్రశ్నలు వినిపించినా వినపడనట్లే నవ్వుతూ చెయ్యి ఊపుతూ ఆయనగారు అక్కడ తిరగలేదా? అంత పెద్ద స్థాయిలో ఉన్నవాడికి లేని సిగ్గు - సామాన్య మానవులం మనకు ఎందుకబ్బా? పట్టించుకోవద్దు కదా? మన ఆరోగ్యం మనం కాపాడుకోవాలి. మన చర్మాన్ని మనమే మందంగా తయారు చేసుకోవాలి! తప్పదు మరి...

జవహర్‌లాల్ నెహ్రూ మ్యూజియం పేరు మార్చి - పి.యం. మ్యూజియం అని ప్రకటించడం మనకు తెలుసు. ఎలాగైనా సరే ఎక్కడా నెహ్రూ పేరు వినిపించకుండా చేయాలని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్టుగా ఉంది. ఇంతటితో ఆగకుండా ప్రతి యేటా శాస్త్ర వేత్తలకు ఇచ్చే అవార్డులను కూడా రద్దు చేసింది. 2022లో సుమారు 300సైన్స్ అవార్డులను రద్దు చేసిన శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ, ఈ సంవత్సరం మరో ముందడుగువేసి, 92 సైన్స్ అవార్డుల్ని రద్దు చేసింది. ఇలాంటి విషయాలకు పత్రికలు, మీడియా విస్తృత ప్రచారమివ్వవు. అందువల్ల సామాన్య జనానికి విషయాలు తెలియవు.

కేంద్ర ప్రభుత్వ నిధులు అందుకుంటున్న అకాడెమీలు ఇచ్చే అవార్డులు ఇకపై కొనసాగించరాదని ఈ ఆరెస్సెస్-బీజేపీ ప్రభుత్వం భావిస్తుంది. యువ శాస్త్రవేత్తలు, సైన్సు టీచర్లు, లెక్చరర్లు, జాతీయ అంతర్జాతీయ స్థాయి కలిగిన సైంటిస్ట్‌ల కోసం వివిధ స్థాయిల్లో ఇస్తున్న పలు రకాల అవార్డులన్నీ ఇప్పుడు రద్దయిపోయాయి. తమకు దక్కాల్సిన గుర్తింపుల్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసినందుకు వివిధ పరిశోధనాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో పని చేసే శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు అందరూ ఆందోళన పడటం, పెద్దఎత్తున తమ నిరసనలు తెలియజేయడం మామూలే! అయితే ఈ కేంద్ర ప్రభుత్వానికి ఎప్పుడు ఏ విషయంలో చీమ కుట్టింది గనుకా? గతంలో పద్మశ్రీలు, పద్మభూషణ్‌లు, సాహిత్య అకాడెమీ అవార్డుల్ని (అవార్డు వాపసీ) ప్రస్తుత ప్రభుత్వానికి తిప్పికొట్టినప్పుడే ఈ ప్రభుత్వం సిగ్గుపడలేదు. ఇక ఇప్పుడు పడాలని ఎందుకు అనుకుంటుందీ?

ఇక మిగిలింది ఒక్కటే... ఈ దేశంలో విజ్ఞాన శాస్త్రం ఎవరూ చదవగూడదు.. అని చట్టం తీసుకురావడమే! ఇంత చేసిన వారు ఇక ముందు అది కూడా చేయరని నమ్మకమేమిటీ? మన కేంద్ర ప్రభుత్వంపై మనకు తప్పకుండా నమ్మకముండాలి. కాబట్టి, వారు సులభంగానే ఈ కింది చట్టాలు తేగలరు.

1. దేశంలో ప్రశ్న బతికి ఉండకూడదు.
2. దేశంలో వైజ్ఞానిక స్పృహ ఉండకూడదు.
3. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరెత్తితే ఇకపై కఠిన శిక్షలు.
4. గత జ్ఞాపకాలు ఎవరికీ ఉండకూడదు. ఎవరూ గత చరిత్రను తవ్వి తీయగూడదు.
5. ప్రభుత్వం వారి 'మన్ కి బాత్' మాత్రమే విని చెవులు ఊపుతూ ఉండాలి.
6. దేశంలో మేం ప్రజాస్వామ్యాన్ని గొప్పగా బతకనిస్తున్నాం... అని మన దేశ నాయకులు విదేశాల్లో చెప్పి వస్తుంటారు. వాటిని విని నోరుమెదపకూడదు. గమ్మున కూర్చోవాలి.
7. మైనార్టీలను స్వంత బిడ్డల్లా చూసుకుంటున్నామని అంతర్జాతీయ వేదికల మీద మన నాయకులు ప్రసంగించి వస్తారు. మనమిక్కడ చప్పట్లు చరుస్తుండాలి.
8. బేటీ బచావో బేటీ పడావో - నినాదాన్ని ప్రతి ఊర్లో సందుగొందుల్లో గొంతెత్తి నినదించాలి.
9. దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున మహిళా క్రీడాకారుల మీద దౌర్జన్యం చేశారని తెలిసినా నోరు విప్పగూడదు.
10. అమెరికా పర్యటనలో వైట్‌హౌజ్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో - భారతదేశంలో జరుగుతున్న హిందుత్వ అఘాయిత్యాల మీద, గుజరాత్ మానవ హననం మీద, జాతి వివక్ష మీద, అసమర్థ పాలన మీద విలేకరులు సంధించిన కేవలం రెండు ప్రశ్నలకు కూడా సమాధానమివ్వకుండా 'ప్రజాస్వామ్యం మా DNAలో ఉందని' మన ప్రధాన నాయకుడు పిట్టకథ చెప్పి వచ్చిన అంశాన్ని ఎక్కడా ప్రస్తావించగూడదు.
11. వాషింగ్టన్ డి.సి. ప్రధాన వీధుల్లో భారతదేశంలోని కేంద్ర ప్రభుత్వం మీద అక్కడి జనం విమర్శలు గుప్పిస్తుంటే మన ప్రధాన నాయకుడు నోరు మెదపకుండా నవ్వుతూ ఏడుపు మొహం వేసుకుని రాలేదా?
12. భారతదేశంలో ప్రస్తుత హోమ్‌మంత్రి ఒక జడ్జిని చంపించిన క్రిమినల్ అని వాషింగ్టన్ వీధుల్లో తమ అధ్యక్షుడు బైడెన్‌కు వినపడేంతగా - మైకులు పగిలేట్లు వక్తలు ఉద్రేకంతో ఉపన్యసిస్తుంటే - దేశం వెలిగిపోతోందని... మన మిక్కడ మన్నుదిన్న పాముల్లా పడి ఉండాలా? వద్దా? ఉండాల్సిందే కదా?
13. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఒక ఇంటర్వ్యూలో భారత ప్రధానిని ఉద్దేశించి సంధించిన ప్రశ్నలు వినిపించినా వినపడనట్లే నవ్వుతూ చెయ్యి ఊపుతూ ఆయనగారు అక్కడ తిరగలేదా? అంత పెద్ద స్థాయిలో ఉన్నవాడికి లేని సిగ్గు - సామాన్య మానవులం మనకు ఎందుకబ్బా? పట్టించుకోవద్దు కదా? మన ఆరోగ్యం మనం కాపాడుకోవాలి. మన చర్మాన్ని మనమే మందంగా తయారు చేసుకోవాలి! తప్పదు మరి...



భారత ప్రధాని పర్యటనపై స్పందిస్తూ ముగ్గురు ప్రతిభావంతులైన ప్రముఖ అమెరికా సెనెటర్లు చెప్పిన విషయాలు చూద్దాం. ఇందులో మొదటి ఇద్దరు మహిళలు. చాలా తీవ్రమైన పదజాలంతో నేటి భారత ప్రభుత్వం పట్ల తమ అసహనాన్ని, ఆగ్రహాన్ని వెలిబుచ్చారు.

మానవ హక్కులకు విఘాతం కలిగిస్తూ, జర్నలిస్టులను హింసిస్తూ ప్రజాస్వామ్యాన్ని అభాసుపాలు చేసిన ఘనమైన చరిత్ర ప్రస్తుత భారత ప్రధానిది.

- కోరి బుష్.

మానవ హక్కులకు తీవ్ర విఘాతం కలిగించిన వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ మనం గౌరవించకూడదు.

- ఒకసియో కోర్ట్.

ప్రధాని మోడీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను, స్వేచ్ఛాలోచనను ధ్వంసం చేసింది. ప్రతిపక్ష సభ్యుల మీద నేరాలు మోపింది. జైలు పాలు చేసింది. పౌర సంఘాల స్వేచ్ఛను హరించింది. తనను కలిసినప్పుడు అమెరికా అధ్యక్షుడు బైడెన్, తప్పక ఈ సమస్యల్ని భారత ప్రధానికి ఎత్తి చూపాలి! ప్రశ్నించాలి!!

- బెర్నీ సాండర్స్

> దేశంలో అవార్డులు రద్దు చేసి, తగుదునమ్మా అని ఈజిప్టు వారిచ్చిన అవార్డు పుచ్చుకుని రావచ్చా? అలాంటి వారికి ఆ అర్హత ఉంటుందా? ఈ దేశ ప్రజలు ఆలోచించాలి. ఇటీవలి కర్నాటక ఎన్నికల్లో ప్రజాసంఘాలు నిర్వహించినపాత్ర గుర్తుతెచ్చుకుని, మతం అన్నవాణ్ణి మట్టి కరిపించాలి - అనే ధ్యేయంతో - దేశంలో అన్ని రాష్ట్రాల్లో ప్రజా సంఘాలు ఏర్పడాలి! జనచైతన్యానికి సమాయత్తం కావాలి!!


దేశంలో ఇన్ని ఘోరాలు జరుగుతున్నా, అమెరికా అధ్యక్షుడు ఎందుకంత ఘనంగా భారత ప్రధానిని ఆహ్వానించాడూ? అందులో ఉన్న రహస్యమేమిటీ? అంటే ఇరు దేశాల మధ్య ఉన్న లావాదేవీలు ముఖ్య కారణం - అంతకు మించి అక్కడ భారత ప్రధానికి వ్యక్తిగతంగా లభించిన గౌరవమేమీ లేదు.

1. భారతదేశం మంచి కొనుగోలుదారు. ఆయుధాలు డ్రోన్లు అమ్మడంలో అమెరికాది అగ్రస్థానం. కొనుగోలు చేయడంలో ప్రపంచ దేశాల్లో భారత దేశానిది అగ్రస్థానం. మంచి కొనుగోలుదారుణ్ణి ఏ అమ్మకందారుడూ వదులుకోడు కదా?
2. భారత్‌లో జరుగుతున్న అంతర్గత విషయాలను విమర్శిస్తూ - వ్యాపార పరంగా వచ్చే లాభాల్ని చెడగొట్టుకోవడం ఎందుకూ? అది అక్కడి ప్రభుత్వానికి నచ్చదు కదా?
3. అమెరికాలో భారత సంతతి వారు ఎక్కువ. పైగా అక్కడ ముఖ్యభూమిక పోషిస్తున్నవారు కూడా ఎక్కువే. భారత ప్రధాని పట్ల బైడెన్ ప్రభుత్వం గౌరవంగా వ్యవహరించినట్లయితే భారత సంతతికి చెందిన అమెరికా పౌరుల నుండి బైడెన్ ప్రభుత్వానికి మద్దతు బలంగా ఉంటుంది కదా?
4. అమెరికా అధ్యక్షుని నివాస భవనంలో అక్కడి విలేకరులు అడిగిన రెండే రెండు ప్రశ్నలకు భారత ప్రధాని నేరుగా సమాధానం చెప్పకపోయినా కూడా అక్కడి విలేకరులు విరుచుకుపడలేదు. కారణం అధ్యక్ష భవనంలోని ప్రొటోకాల్. అయితే టెలివిజన్‌లలో ప్రత్యక్షంగా చూసిన ప్రపంచ పౌరులంతా భారత ప్రధాని మేధోసంపత్తిని బేరీజు వేసుకునే ఉంటారు.
5. దేశంలో అవార్డులు రద్దు చేసి, తగుదునమ్మా అని ఈజిప్టు వారిచ్చిన అవార్డు పుచ్చుకుని రావచ్చా? అలాంటి వారికి ఆ అర్హత ఉంటుందా? ఈ దేశ ప్రజలు ఆలోచించాలి. ఇటీవలి కర్నాటక ఎన్నికల్లో ప్రజాసంఘాలు నిర్వహించినపాత్ర గుర్తుతెచ్చుకుని, మతం అన్నవాణ్ణి మట్టి కరిపించాలి - అనే ధ్యేయంతో - దేశంలో అన్ని రాష్ట్రాల్లో ప్రజా సంఘాలు ఏర్పడాలి! జనచైతన్యానికి సమాయత్తం కావాలి!!

- వ్యాసకర్త: సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త.

సేద్యంపై కేంద్రం సమ్మెట పోటు!

ఎరువుల విధానం, చెరకు ధర విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సేద్యానికి సమ్మెట పోటుగా తయారయ్యాయి. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువుల (బయో ఫెర్టిలైజర్స్) వైపు మళ్లించడమే లక్ష్యంగా కేంద్ర మంత్రివర్గం ఇటీవల జరిగిన సమావేశంలో కొత్త విధానానికి ఆమోదముద్ర వేసింది. రసాయనిక ఎరువుల వాడకానికి బదులు సేంద్రీయ ఎరువులను వాడడం వల్ల శ్రీలంకలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పడిపోయి తీవ్ర ఆహార సంక్షోభంలో ఎలా చిక్కుకున్నదీ అందరికీ తెలిసిందే. విఫలమైన ఆ విధానాన్నే మోడీ ప్రభుత్వం దేశంలో అమలు చేయడానికి ఆతత ప్రదర్శించడం ప్రమాదకరం. భూమాతను రసాయనిక కాలుష్యం బారి నుండి కాపాడవచ్చని, పంటల్లో పోషక విలువలు పెరుగుతాయని సర్కారు సెలవిస్తోంది కానీ ఆహార భద్రతకు ఏర్పడే ముప్పును గమనించడం లేదు. పాలకుల అసలు లక్ష్యం ఎరువుల సబ్సిడీని తగ్గించుకోవాలన్నదే! రైతుల కోసం మూడేళ్లలో రూ.3,70,128 కోట్లతో ప్రత్యేక ప్యాకేజీని ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిఇఎ) ఆమోదించిందని మంత్రులు ప్రకటించారు. భారీగా చెప్పిన ఈ మొత్తంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేసిన మొత్తాన్ని కూడా కలిపి చెప్పారంటే రైతాంగాన్ని, దేశ ప్రజలను సర్కారు ఎంతలా బురిడీ కొట్టిస్తోందో అర్థం చేసుకోవచ్చు.



కేంద్ర ప్రభుత్వం టన్ను చెరకుకు ఫెయిర్ రెమ్యూనరేటివ్ ప్రైస్ (ఎఫ్ఆర్‌పి) కేవలం రూ.3150గా ప్రకటించడం చెరకు రైతుకు మళ్లీ మొండిచెయ్యి చూపడమే. చెరకు పంటకు అవసరమైన అన్ని ఇన్‌పుట్స్ ధరలు పెరిగిన నేపథ్యంలో ఈ ఏడాది టన్నుకు రూ.100 మాత్రమే పెంచడం రైతులను వంచించడమే అవుతుంది. దేశవ్యాప్తంగా ఐదు కోట్ల మంది చెరకు రైతులు, మరింతమంది వ్యవసాయ కార్మికులు, కౌలుదార్లు ఈ నిర్ణయం వల్ల తీవ్రంగా నష్టపోతారు. బేసిక్ రికవరీ రేటు 10.25 శాతంగా నిర్ణయించడమూ దారుణం. సరళీకరణ విధానాలు రాకముందు కనీస రికవరీ 8.5 శాతంగా ఉన్నదాన్ని తొలుత 9.5శాతానికి, 2018-19లో 10శాతానికి, గత ఏడాది 10.25శాతానికీ పెంచారు. కనీస రికవరీని పెంచడం ద్వారా కూడా రైతుకు చెల్లించవలసిన సొమ్ముకు కోత పడుతోంది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంట ఉత్పత్తికి అయ్యే మొత్తం ఖర్చు (సి2)కు మరో 50శాతం అదనంగా వచ్చే విధంగా మద్దతు ధరల్ని ప్రకటిస్తామని చెప్పిన కేంద్రం చెరకు రైతును నిలువునా మోస గించింది. మరోవైపున చక్కెర పరిశ్రమాధిపతులకు మాత్రం ప్రోత్సాహకాల పేరిట సర్కారు ఖజానాను దోచిపెడుతోంది. ఆధునీకరణకు వడ్డీలేని రుణం మొదలు ఇథనాల్ తయారీ అమ్మకాల్లో భారీ రాయితీ లిస్తోంది. చక్కెర విధానం కూడా దేశ విదేశీ కార్పొరేట్లకు అనుకూలంగానే ఉంటోంది. కాకుల్ని కొట్టి గద్దలకు వేయడమంటే ఇదే కదా !

మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాల మూలంగా ఏడాదికేడాది చెరకు సాగు తగ్గిపోతూ వస్తోంది. చక్కెర ఉత్పత్తి కూడా తగ్గి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రైతుకు గిట్టుబాటయ్యేలా ధర నిర్ణయించడం తొలి చర్యగా ఉండాలి. అతిగా రసాయనిక ఎరువుల వాడకంవల్ల కలిగే నష్టాలను రైతాంగానికి వివరించి, ఆయా భూముల స్వభావం, పంటల సరళికి అనుగుణంగా ఎరువుల వినియోగం, మరోవైపు భూసారాన్ని కాపాడేందుకు పచ్చిరొట్ట ఎరువులు, పంటల మార్పిడి వంటివాటిని శాస్త్రీయ పద్ధతుల్లో అమలు చేసేలా రైతులను విజ్ఞాన వంతుల్ని చేయాలి. సమగ్రమైన ప్రణాళికాబద్ధమైన వ్యవసాయ విధానం, పంటల సరళి, సస్యరక్షణ, మార్కెటింగ్ వంటివాటిని సన్న చిన్నకారు రైతాంగాన్ని దృష్టిలో ఉంచుకొని రూపొందించాలి. కానీ కేంద్రానికి అదానీ, అంబానీ ల్లాంటి కార్పొరేట్లు, వాణిజ్య పంటల్లో సాగించే కాంట్రాక్టు వ్యవసాయాన్ని లక్ష్యంగా చేసుకొని సేద్య విధానాలు రూపొందించడం నష్టదాయకం. ఒకవైపు ఆత్మనిర్భర్ భారత్ అని గొప్పలు చెబుతూ ఇంకోవైపున వ్యవసాయ రంగాన్ని కునారిల్లజేయడం మోడీ సర్కారుకే చెల్లింది. చారిత్రాత్మక సుదీర్ఘ పోరాటంతో నల్ల వ్యవసాయ చట్టాలను తిప్పికొట్టిన రైతాంగం మోడీ సర్కారు వ్యవసాయ విధానాల్ని గట్టిగా ప్రతిఘటించాలి. మరిన్ని ఐక్య పోరాటాలకు సిద్ధపడాలి.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

మణిపూర్ మంటలు ఆరవెందుకు?

మణిపూర్ 67రోజులుగా మండుతోంది. ఇప్పటికే నూట ఇరవైకి మందికి పైగా చనిపోయినట్టు వార్తలు. నాలుగు రోజుల కిందట కూడా ఈ గొడవల్లో ముగ్గురు మరణించారు. ప్రధాని మౌనం వహించారని ప్రతిపక్షాల, సామాజిక ఉద్యమ కారుల విమర్శ. మణిపూర్ గురించి ప్రధాని రోజూ చర్చిస్తున్నారని కేంద్ర గృహమంత్రి అమిత్ షా, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేంద్ర సింగ్ అన్నారు. జర్మన్ నియంత హిట్లర్ కూడా మౌనమునే. గృహమంత్రి హీన్రిచ్ హిమ్లర్, చైతన్య ప్రచార మంత్రి జోసెఫ్ గోబెల్స్, ఆర్మీ ఛీఫ్ ఫీల్డ్ మార్షల్ ఎర్విన్ రోమెల్, శాఖారహిత మంత్రి జర్మన్ వాయుసేన అధిపతి హెర్మన్ గోరింగ్‌లతో మాత్రమే మంతనాలాడేవారు. కశ్మీర్, లక్షద్వీప్ ఘటనలతో మణిపూర్ మంటలకు సారూప్య ముంది. రాజ్యాంగ అధికరణలు 370, 35ఎ కశ్మీర్ ప్రజలకు భూమిపై హక్కులనిచ్చాయి. వీటి రద్దుతో కశ్మీర్ భూములను ఆశ్రిత కార్పొరేట్ సంస్థలకు అప్ప జెప్పారు. లక్షద్వీప్‌లో కేంద్ర అడ్మినిస్ట్రేటర్ రాజ్యాంగ పరిమితిని దాటి చట్టాలు చేశారు. ప్రకృతి వనరులను, సుందర సముద్ర తీరాలను, జనులు లేని ద్వీపాలను కార్పొరేట్లకు పంచారు. నేటి మణిపూర్ అల్లర్లకు పాలక వర్గాల ఇలాంటి చర్యలే కారణం.



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

2017లో బీజేపీ 21 సీట్లతో మణిపూర్‌లో ఎత్తుగడలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. వైదిక మతవాద అధిక సంఖ్యాక మేతేయిలను, సనమహిలను సంఘ్ సంస్థలు సంఘటితపర్చి గిరిజన కుకిలపై దాడిచేశాయి. కుకిలతో ఆస్తులు, ఆవాసాలు, పొరుగు పంచుకోవద్దని గతేడాది ఎన్నికల్లో బీరేన్‌సింగ్ మేతేయిలకు చెప్పారు. ఈ గుజరాత్ హిందూత్వ నమూనాను మేతేయిలు పాటించారు. క్రైస్తవులుగా మారిన మేతేయిలనూ తరిమేశారు. కుకిలు, నాగాలు మణిపూర్ లోయలో పిల్లలను చదివించుకుంటారు. చిన్న పనులతో అద్దెఇళ్లలో బతుకుతారు. మేతేయిల చర్యలతో పిల్లల చదువు, పెద్దల బతుకుదెరువు ఆగమయ్యాయి. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే, శాంతిభద్రతలు, జీవన ప్రమాణాలు పెంచుతామని ప్రధాని ప్రచారం చేశారు. 36వేర్పాటువాద సంస్థల్లో ప్రభుత్వంలో భాగస్వాములైన మేతేయిల తీవ్రవాద సంస్థల నిర్వహణ ఆంక్షలను 2022 ఏప్రిల్‌లో ఎత్తేశారు. అవి విజృంభించాయి. మేతేయిలకు షెడ్యూల్ ట్రైబ్ హోదా ఇస్తామని ప్రధాని వాగ్దానం చేశారు. సామాజిక, ఆర్థిక వెనుకబాటుతో రాజకీయ ప్రాతినిధ్యం సాధించలేని మారుమూల ప్రాంతాల గిరిజనులకు రాజ్యాంగం షెడ్యూల్ ట్రైబ్ హోదాను ఇచ్చింది. ఈ అర్హతలేని మేతేయిలకు ఈ హోదా ఎలా ఇస్తారు? ఆ హోదా కోసం మేతేయిలు ఉద్యమించారు. మేతేయి తీవ్రవాద సంస్థలు, సంఘ్ వత్తాసు పలికాయి. దీనికి గిరిజనులు నిరసన తెలిపారు. దీన్ని అడ్డుకునేందుకు మేతేయిలు హింసకు పాల్పడ్డారు.

రాష్ట్రంలో మయన్మార్ వలసదార్లు చొరబడ్డారని సంఘ్ ప్రచారం. మణిపూర్‌లో విదేశీయుల ప్రవేశానికి నియంత్రిత ప్రాంత అనుమతి కావాలి. ఇది 10రోజులకే ఇస్తారు. అక్రమ వలసదారులు రాలేరు. మయన్మార్ చిన్ తెగ వలసదార్లు, అధికారుల నిర్లిప్తతతో మణిపూర్‌లో చొరబడ్డారు. మయన్మార్ రోహింగ్య ముస్లింలను అడ్డుకున్న కేంద్రం వీరిని ఆపలేదు. 2013లో బీజేపీ ప్రభుత్వాలు గుజరాత్, రాజస్థాన్, హరియాణాలకు వైదిక మతస్తులను రానిచ్చాయి. వారికి పౌరసత్వం, ఓటు హక్కు ఇచ్చాయి. సాధారణ ఎన్నికల్లో సీట్లు పొందారు. ఇదే ప్రయోజనాన్ని ఆశించి కేంద్ర రాష్ట్ర పాలకులే మణిపూర్‌లోకి బర్మీయులను రానిచ్చారని అనుమానం. కుకిలు నివసించే మణిపూర్ పర్వత ప్రాంతాల్లో బొగ్గు నిలువలున్నాయి. ఇటీవల పెట్రోలియం నిక్షేపాలు బయటపడ్డాయి. వాటిని తమ కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టాలని బీజేపీ పాలకుల పన్నాగం. రక్షిత, వన్యప్రాణ అభయారణ్య అడవుల సాకుతో కుకిల భూములను ఆక్రమించారు. పారిని అక్కడి నుండి తరిమేశారు. కుకిలలో మాదకద్రవ్యాల అలవాటు, ఎయిడ్స్ వ్యాధి ఎక్కువ. యువత నిర్వీర్యమైంది. కుకిలు నల్లమందు పండిస్తున్నారని నేరాలు మోపారు. నల్లమందు తోటలను ధ్వంసం చేశారు. నల్లమందు పండించడం నేరం కాదు. మత్తు పదార్థాల, మాదక ద్రవ్యాల తయారీ నేరం. మేతేయి వాణిజ్యవేత్తలే ఈ పని



> జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంస్థ, 550మంది పౌరసమాజ ప్రతినిధులు, కేంద్ర పాలకులు జోక్యం చేసుకోవాలని, హత్యలను, హింసను, దమనకాండను ఆపాలని ఉత్తరాలు రాశారు. అయినా ప్రధాని, రాష్ట్రపతి పట్టించుకోలేదు. సుత్తి చేతిలో ఉన్నవాడికి ప్రపంచమంతా మేకే. బీజేపీ పాలకుల వద్ద మతోన్మాద, అధికార, ధనబల, ప్రభుత్వ విభాగాల సుత్తులు ఉన్నాయి. సామాన్య ప్రజానీకం, గిరిజనులు, ముస్లింలు, క్రైస్తవులు వారికి మేకుల్లాగా కనిపిస్తున్నారు. అగ్ని ప్రమాదాన్ని ఆర్పచ్చు. రక్షకులే కాల్చితే ఆర్పేదెవరు?

చేస్తారు. పాలకవర్గ మేతేయిల డ్రగ్ సిండికేట్‌లు కుకిల నుండి నల్లమందు పంటను నామమాత్రపు ధరకు కొంటారు. పంటతో సహా నల్లమందు వ్యాపారాన్ని సొంతం చేసుకోవాలని డ్రగ్ సిండికేట్‌ల పథకం. ఇటీవల పోలీసులు నల్లమందు ముఠాలను అరెస్టు చేశారు. వారిలో ముఖ్యమంత్రి బంధువులున్నారు. ఆర్థిక అసమానతలు, పేదరికం, నిరుద్యోగం, జాతుల వైషమ్యాలు కుకిలను నల్లమందు వంటవైపునకు, గిరిజన స్త్రీలను వ్యభిచారం వైపునకు నెట్టాయి.

మణిపూర్‌లో క్రైస్తవ జనాభా పెరిగిందని, వారు మేతేయిలను దాటిపోతారని సంఘ్ ప్రచారం. దేశంలో ముస్లింలు పెరిగి హిందువులను అపాయంలో ముంచుతారన్న ప్రచారం లాంటిది. 1961-2011 మధ్య 50ఏండ్లలో క్రైస్తవులు 5లక్షలు పెరిగారు. వైదికమతస్తులూ పెరిగారు. కాలక్రమంలో పెరిగిన జనాభా, ఓట్ల కోసం పాలకులు అనుమతించిన వలసలు, వైదికమత వివక్షను భరించలేక క్రైస్తవం పుచ్చుకున్నవారు ఈ పెరుగుదలకు కారణం. శాతాలతో మోసం చేస్తున్నారు. రూపాయికి రూపాయి కలిపితే 100శాతం పెరుగుదల. 1,000కి వంద కలిపితే పెరిగేది 10శాతం. 100 కంటే రూపాయి తక్కువ. క్రైస్తవమత పెరుగుదలను అరికట్టడానికి జాతీయ పౌరసత్వ, జాతీయ జనాభా జాబితాలను తయారుచేయమని, 1951 జనాభా ప్రకారం పౌరసత్వాన్ని సవరించమని సంఘ్ గొడవచేసింది. 1961 జనాభా ప్రకారం పౌరసత్వాన్ని సవరిస్తే 80శాతం కుకిలు పౌరసత్వం కోల్పోతారు. 1951 ఆధారంగా సవరిస్తే 95శాతం కుకిలు, నాగాలు పౌరసత్వం కోల్పోయి రాష్ట్రాన్ని వదలాలి. ఈ అల్లర్లలో ఆరువేలు ఆయుధాలు భాండాగారాల నుండి చోరీ అయ్యాయి. ఒక్కటీ పట్టుబడలేదు. వెయ్యి ఆయుధాలే పోయాయని, 200 రికవరీ చేశామని ముఖ్యమంత్రి చెప్పారు. అల్లర్లు జరిగిన చురాచందపూర్ ప్రాంతంలోనే కాక రాష్ట్రమంతా చోరీలు జరిగాయి. చిన్న కారణాలకే సామాన్యులను చంపే పోలీసులు వీరిని ఎందుకు కాల్చలేదు? అన్ని స్టేషన్లలో భద్రతారాహిత్యం, నిర్లిప్తత ఎలా వచ్చాయి? కేంద్ర, సైనిక, ప్రత్యేక దళాల భాండాగారాల జోలికి పోకుండా రాష్ట్ర రక్షణదళాల భాండాగారాల నుంచే చోరీ జరిగింది. పాలకుల, అధికారుల మద్దతు లేనిదే ఇలా జరుగుతుందా? దోపిడీ ఆయుధాలు సంఘ్ సంస్థలకు చేరాయని అనుమానం.

రాష్ట్రం కాలుతున్నప్పటి నుండి మణిపూర్ పాలక వర్గాలు 45 ట్వీట్లు చేశాయి. వాటిలో 13 మాత్రమే మణిపూర్‌కు సంబంధించినవి. మిగిలినవి కేంద్ర పాలకుల ట్వీట్ల రిట్వీట్లే. రాహుల్ గాంధీని ఎగతాళిచేసేవి, ఇందిర ఎమర్జెన్సీ, 1984 సిక్కుల ఊచకోత, 1985 షా బానో కేసు లింగవివక్షతల గురించిన విమర్శలే. రోమ్ కాలుతుంటే ఫిడేల్ వాయిస్తూ నీరో చక్రవర్తే వినోదించారు. నేటి ఇండియాలో సామంతులూ నీరోలే. చనిపోయినవారిలో 98శాతం, పారిపోయినవారిలో 70శాతం కుకిలు. 120మంది చనిపోగా, 500మంది గాయపడ్డారు. 20వేల ఇళ్ళు కూలాయి. 6,500 మంది పారి పోయారు. కుకిల ఆస్తులు, వాహనాలే బూడిదయ్యాయి. కుకిలను తీవ్రవాదులుగా చిత్రించి పాలకవర్గ అధికారులే చంపారు. 200చర్చిలు, 17గుళ్లు, 124గిరిజన గ్రామాలు, 1700 కుకిల ఇండ్లు నేలమట్టమయ్యాయి. వీరు తిరిగి రావడానికి సైన్యం సహాయం కోరుతున్నారు. గిరిజనులు ప్రత్యేక రాష్ట్రం కావాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకొని మయన్మార్ సైనిక ఝుంటా మణిపూర్‌లో చొరబడగలదు.

రెండు నెలలుగా ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మహిళలు, క్రీడాకారులు, కళాకారులు, మేధావులు నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంస్థ, 550మంది పౌరసమాజ ప్రతినిధులు, కేంద్ర పాలకులు జోక్యం చేసుకోవాలని, హత్యలను, హింసను, దమనకాండను ఆపాలని ఉత్తరాలు రాశారు. అయినా ప్రధాని, రాష్ట్రపతి పట్టించుకోలేదు. సుత్తి చేతిలో ఉన్నవాడికి ప్రపంచమంతా మేకే. బీజేపీ పాలకుల వద్ద మతోన్మాద, అధికార, ధనబల, ప్రభుత్వ విభాగాల సుత్తులు ఉన్నాయి. సామాన్య ప్రజానీకం, గిరిజనులు, ముస్లింలు, క్రైస్తవులు వారికి మేకుల్లాగా కనిపిస్తున్నారు. అగ్ని ప్రమాదాన్ని ఆర్పచ్చు. రక్షకులే కాల్చితే ఆర్పేదెవరు?

సెల్: 9490204545

శరద్‌ను కలిసిన రాహుల్

న్యూఢిల్లీ : ఢిల్లీలోని శరద్‌పవార్ నివాసంలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్సీపీలో అంతర్గత వివాదాలు నెల కొన్న సమయంలో రాహుల్ భేటీ కావటం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు కాంగ్రెస్ మీ వెంటే ఉందని చెప్పారని ఎన్సీపీ అధినేత్రి సోనియా దుహన్ అన్నారు. సోనియా గాంధీ కూడా శరద్ పవార్‌తో ఫోన్‌లో మాట్లాడారు.ఎన్సీపీ కార్యవర్గ సమావేశం అనంతరం శరద్ పవార్ మాట్లాడుతూ రాహుల్ వచ్చి కలవటంతో.. మాలో నూతన ఉత్సాహాన్ని నింపిందని అన్నారు. ఎన్సీపీ కార్యవర్గ సమావేశం అనంతరం ఎన్సీపీ నేత పిసి చాకో మాట్లాడుతూ తమ పార్టీ కార్యవర్గ సమావేశంలో నాయకులు శరద్ పవార్‌పై విశ్వాసం ఉంచారని అన్నారు.

27 రాష్ట్ర యూనిట్లు శరద్ పవార్ వర్గంతో ఉన్నాయి. సమావేశంలో 8 తీర్మానాలను ఆమోదించారు. ప్రభుత్వంలో చేరిన 9 మంది ఎమ్మెల్యేలను పార్టీ నుంచి బహిష్కరించారు. మరోవైపు అజిత్ పవార్ ఈ సమావేశాన్ని చట్ట విరుద్ధమన్నారు. ఎన్సీపీపై ఎవరికి అధికారం ఉందో నిర్ణయించే అధికారం ఎన్నికల కమిషన్ పరిధిలో ఉందని ఆయన అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జాతీయ కార్యవర్గ సమావేశాన్ని పిలిచే హక్కు పార్టీకి చెందిన ఏ నాయకుడికి లేదు. 40 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల మద్దతుతో ఎన్సీపీ పేరు, గుర్తును అజిత్ పవార్ గురువారం ప్రకటించారు. ఎమ్మెల్యేలందరి సంతకాలతో కూడిన అఫిడవిట్లను ఆయన ఎన్నికల సంఘానికి అందజేశారు.

పార్టీ ఎన్నికల గుర్తుపై అజిత్ పవార్ చేస్తున్న వాదనపై తనకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని శరద్ పవార్ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు.ముంబై ఎన్సీపీ అధ్యక్షుడిగా నరేంద్ర రాణేను అజిత్ వర్గం గురువారం నియమించింది.

మా తెలంగాణ పార్టీకి సుప్రీం చురకలు

న్యూఢిల్లీ : మా తెలంగాణ పార్టీకి సుప్రీం కోర్టు చురకలంటించింది. అనవసర పిటిషన్లతో కోర్టు సమయం వృథా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా తెలంగాణ హైకోర్టులో తప్పుడు పిటిషన్ వేసినందుకు మా తెలంగాణ పార్టీకి ధర్మాసనం రూ.50 వేల జరిమానా విధించింది. హైకోర్టు తీర్పుపై సదరు పార్టీ సుప్రీంకోర్టు ను ఆశ్రయించింది. హైకోర్టు జరిమానాను మాఫీ చేయాలని కోరుతూ సర్వో న్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. మా తెలంగాణ పార్టీ పేదదని, హైకోర్టు విధించిన జరి మానా కట్టలేమని మా తెలంగా ణ పార్టీ తరపు న్యాయవాది కోర్టు ను కోరారు. దీనిపై విచారణ చేప ట్టిన సుప్రీంకోర్టు మా తెలంగాణ పార్టీపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇష్టానుసారంగా పిటిషన్‌లు దాఖ లు చేస్తే పేద పార్టీ అంటారా? అని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహ ధర్మాసన ం ప్రశ్నించింది. పేద పార్టీ అంటూ న్యాయవాదిని తప్పుపట్టిం చినందుకు పెనాల్టీ కట్టాలని మా తెలంగాణ పార్టీని ఆదేశించింది.

రామగుండం మెడికల్ కాలేజీలో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు రిజర్వేషన్

- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రామగుండం మెడికల్ కాలేజీలో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ఎంబీబీఎస్ సీట్లలో రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ కాలేజీలో మొత్తం 150 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, 23 ఆల్ ఇండియా కోటాలో భర్తీ చేస్తారు. మిగతా 127 సీట్లలో ఐదు శాతం రిజర్వేషన్ ప్రకారం7 సీట్లు సింగరేణి ఉద్యోగుల పిల్లలకు కేటాయించారు. నీట్ మెరిట్ ప్రకారం భర్తీ చేసే ఈ సీట్ల విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు పరిగణనలోకి తీసుకుంటారు.

సింగరేణి ఉద్యోగుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. వీటితో పాటు మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో 50 పడకలను సింగరేణి ఉద్యోగులకు కేటాయించింది. ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ సౌకర్యాన్ని సింగరేణి ఉద్యోగుల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు సూచించారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. పెద్దపల్లి జిల్లా రామగుండం మెడికల్ కాలేజీ పేరును సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్)గా మార్చినట్టు తెలిపారు.

విభజన హామీలను అమలు చేయకుండా

మోడీ పర్యటించడం సిగ్గుచేటు

రేపు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు :డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదనీ, ప్రధాని మోడీ తెలంగాణ పర్యటనకు రావడం సిగ్గుచేటని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ విమర్శించింది. డీవైఎఫ్ఐ రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశాన్ని గురువారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణకు బయ్యారం ఉక్కు పరిశ్రమ, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, మెడికల్ కాలేజీలు, ఐఐటీలు, ఐఐఎం, ట్రిపుల్‌ఐటీ, గిరిజన, మైనింగ్ విశ్వవిద్యాలయాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేండ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఇవ్వ కుండా మోసం చేసిందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం రాష్ట్రాల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ మత విద్వేషాలను రెచ్చగొడుతున్నదని అన్నారు.

ప్రజల మధ్య చిచ్చు పెట్టి రాజకీయాలు చేస్తున్నదని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా మోసం చేసిందన్నారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భవిష్యత్తులో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తా మని హెచ్చరించారు. ఇప్పటికైనా విభజన హామీలను



నెరవేర్చాలని డిమాం డ్ చేశారు. మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్లు బషీరుద్దీన్, తిరుపతి, జావెద్, జగన్, కార్తీక్, శివవర్మ, తిరుపతి నాయక్, క్రిష్ణ నాయక్, గడ్డం వెంకటేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



పీఎల్ఆర్ ప్రసాదరావుకు కన్నీటి వీడ్కోలు

ఒంగోలు : నవ తెలంగాణ దినపత్రిక సీజీఎం ప్రభాకర్ సోదరుడు, వ్యాపారవేత్త పంగు లూరు ప్రసాదరావు అంత్యక్రియల ను గురువారం నిర్వహించారు. బంధువులు, ఇతరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఒంగోలులోని ఆయన నివాసం చెన్నకేశవ నగర్ నుంచి ఒంగోలు బస్టాండ్ వద్ద ఉన్న మహాప్రస్థానం వరకు అంతిమయాత్ర చేపట్టారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. ముందుగా ప్రసాద్ భౌతికకాయం వద్ద ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్, సీజీఎం అచ్యుతరావు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ప్రజాశక్తి జీఎంలు తిరుపాల్‌రెడ్డి, హరికిషోర్, గడ్డన్న, నవతెలంగాణ ఇన్‌చార్జీ ఎడిటర్ ఆర్. రమేశ్, జీఎంలు అంబటి వెంకటేశ్, భరత్, రఘు, శశిధర్, ఎడిటోరియల్ బోర్డు సభ్యులు కె.ఎన్. హరి, బి. బసవపున్నయ్య, బివిఎన్ పద్మరాజు, మేనేజర్లు వీరయ్య, కిష్టారెడ్డి, గురుదీప్ తదితరులు ఉన్నారు.

వితండ వాదం..

(మొదటిపేజీ తరువాయి)

మహిళా హక్కుల న్యాయవాది ఫ్లావియా ఆగ్నేశ్ చెప్పారు. వ్యక్తిగత చట్టాలన్నింటిలోనూ మహిళలపై ఉన్న వివక్షను పరిశీలించి, ఆ చట్టాలను సవరిం చాలని లా కమిషన్ సూచిందని తెలిపారు. కాబట్టి మైనారిటీల విషయంలో వివక్షతో కూడిన యూసీసీకి బదులు చట్టాలను సవరించడమే మంచిదని తాను భావిస్తున్నానని చెప్పారు. 'గత కొన్ని సంవత్సరాలుగా లా కమిషన్ చేసిన సిఫారసులను ప్రభుత్వం అమలు చేయడం లేదు. పైగా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ చర్యగా యూసీసీని ముందుకు తెచ్చింది' అని వివరించారు.

యూసీసీ లేకుండానే లింగ సమానత్వాన్ని సాధించవచ్చునని బెంగళూరుకు చెందిన న్యాయ శాస్త్ర ప్రొఫెసర్ సరసు ఎస్తేర్ థామస్ స్పష్టం చేశారు. లింగ సమానత్వాన్ని సమర్థించే చట్టాలను రూపొందించడం చాలా సులభమని, అన్ని చట్టాలను మార్చడం ఆచరణ సాధ్యం కాదని ఆమె తెలిపారు. ఇందుకు ఉదాహరణగా ఆమె గృహహింస చట్టాన్ని ప్రస్తావించారు. వివిధ మతాల వారికి వ్యక్తిగత చట్టాలు ఉన్నప్పటికీ మహిళలందరికీ ఈ చట్టం వర్తిస్తుందని అన్నారు. చట్టాలలో చిన్న చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుందని చెప్పారు. హిందువుల కోసం ఉద్దేశించిన వేర్వేరు చట్టాలలోనే లింగ సమానత్వం లేదని ఆమె గుర్తు చేశారు. హిందూ వారసత్వ చట్టాన్నే తీసుకోండి. ఒక వ్యక్తి చనిపోయాడనుకోండి. అతని భార్య అంతకుముందే చనిపోతే, వారికి పిల్లలు ఎవరూ లేకపోతే అతని కుటుంబానికి ఆ ఆస్తి చెందుతుంది. కానీ ఓ మహిళ చనిపోతే, భర్త అంతకుముందే చనిపోతే, వారికి పిల్లలు లేకుంటే, ఆమె ఆస్తి ఆమె కుటుంబానికి చెందదు. భర్త బంధువులకు వెళుతుంది. కాబట్టి ఈ చట్టాలేవీ యూసీసీకి ప్రాతిపదిక కాజాలవు. హిందూ వివాహ చట్టం ఉన్నప్పటికీ అది ఒకేలా లేదు. అందులో లింగ సమానత్వమూ లేదు' అని వివరించారు.

లింగ సమానత్వం కోసమే యూసీసీని తెస్తే క్రోడీకరించిన వ్యక్తిగత చట్టాలు లేక ముస్లిం మహిళలు నష్టపోతారని భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ అనే హక్కుల బృందం వ్యవస్థాపక సభ్యురాలు జకియా సోమన్ అన్నారు. క్రోడీకరించిన ముస్లిం చట్టాల కోసం తాము 20 సంవత్సరాల నుండీ డిమాండ్ చేస్తున్నామని, కానీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లిం చట్టాలలో సంస్కరణలు లేవని, అందువల్ల హిందూ క్రైస్తవ మహిళలకు ఉన్న హక్కులు ముస్లిం మహిళలకు ఉండవని చెప్పారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల సంసిద్ధత

మధ్యప్రదేశ్, అస్సాం, ఉత్తరప్రదేశ్, హర్యానా సహా పలు బీజేపీ పాలిత రాష్ట్రాలు యూసీసీ అమలుకు సిద్ధపడ్డాయి. యూసీసీ ముసాయిదా సిద్ధంగా ఉన్నదని ఉత్తరాఖండ్ ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం యూసీసీ అమలులో ఉన్న ఏకైక రాష్ట్రం గోవా. యూసీసీని వ్యతిరేకించే వారు లింగ సమానత్వాన్ని, మహిళా సాధికారతను కోరుకోవడం లేదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ విమర్శించారు. అయితే క్రోడీకరించిన హిందూ చట్టం గోవాలో లేదని న్యాయవాది ఆగ్నేశ్ చెప్పారు. అందరికీ వర్తించేలా ఒకే చట్టాన్ని తీసుకొని రావడానికి ప్రయత్నించే ముందు లింగ వివక్షను అంతం చేయాల్సిన అవసరం ఉన్నదని నిపుణులు సూచిస్తున్నారు.

తొందరపాటు తగదు

(మొదటిపేజీ తరువాయి)

పక్కనపెట్టి అన్నింటినీ ఏకం చేయాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. శాంతినికేతన్‌లో ఆయన విలేకరులతో ముచ్చటిస్తూ యూసీసీపై ఇక ఎంతమాత్రం ఆలస్యం చేయకూడదని కొందరు అంటున్నారని, అయితే ఇంతకంటే తెలివి తక్కువ తనం ఏముంటుందని ప్రశ్నించారు. యూసీసీపై తొందరపాటు తగదని సూచించారు. సమస్య పరిష్కారానికి ఒకే దారి ఉన్నదని భావించడం సరికాదని చెప్పారు. 'అభిప్రాయబేధాలతో మనం వేల సంవత్సరాల నుంచి జీవిస్తూనే ఉన్నాం. మరో వెయ్యి సంవత్సరాలు జీవిస్తాం. యూసీసీని ఎలా ప్రవేశపెడతారు? ఎందుకు ప్రవేశపెడతారు? దీని అమలుతో ఎవరు ప్రయోజనం పొందుతారు? అభివృద్ధి పథంలో ఇది ఒక పెద్ద తప్పిదమని మనం గుర్తించాలి' అని ఆయన అన్నారు. ఎన్నికల సందర్భంగా ఎందుకు హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయో అర్థం కావడం లేదని చెప్పారు. ఒకే దేశంగా ఉన్నంత మాత్రాన అన్ని సమస్యలు పరిష్కారం కావని అమర్త్యసేన్ తెలిపారు.

ఎన్సీపీ తిరుగుబాటులో 'బాహుబలి' పోస్టర్లు..



ముంబయి: ఎన్సీపీపై పట్టు నిలబెట్టుకునేందుకు అటు శరద్ పవార్, ఇటు అజిత్ పవార్ వర్గాలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలో అజిత్ పవార్ తిరుగు బాటును ఉద్దేశిస్తూ కొన్ని పోస్టర్లు వెలిశాయి. వాటిలో జూనియర్ పవార్‌ను ద్రోహి అని అభివర్ణించారు. ఇలాంటి వారిని ప్రజలు ఎన్నటికీ క్షమించరని విమర్శించారు. ఢిల్లీలోని శరద్ పవార్ ఇంటి వెలుపల ఈ పోస్టర్లను ఏర్పాటుచేశారు. 'మన మధ్యలోనే ఉన్న ద్రోహులను దేశం మొత్తం చూస్తోంది. వారిని ప్రజలు ఎన్నటికీ క్షమించరు' అని సీనియర్ పవార్ వర్గం విమర్శలు గుప్పించింది. అలాగే పోస్టర్లపై తెలుగు బ్లాక్ బస్టర్ 'బాహుబలి' చిత్రంలోని ఓ సన్నివేశాన్ని ప్రచురించింది. బాహుబలిని కట్టప్ప వెనక నుంచి కత్తితో పొడిచే దశ్యమది. అయితే కట్టప్ప స్థానంలో అజిత్ పవార్, బాహుబలి స్థానంలో శరద్ పవార్ ఫొటోలను ఉంచారు. అత్యంత ఆత్మీయంగా మెలిగిన వ్యక్తే వెన్నుపోటు పొడిచారనేది దీని సారాంశంగా కనిపిస్తోంది. ఎన్సీపీ విద్యార్థి విభాగం దీనిని ఏర్పాటు చేసిందని తెలుస్తోంది. '(ద్రోహి)' అనే హ్యాష్‌ట్యాగ్‌తో దీనిని ప్రస్తావించారు.

వడ్డెర హక్కుల కోసం ఉద్యమం

- ఆగస్టు 1,2న వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభలు వడ్డెర :వృత్తిదారుల సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వడ్డెర వృత్తిదారుల హక్కుల కోసం ఉద్యమాలు నిర్వహిస్తామని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య, వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విష్ణుష్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెర వత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రథమ రాష్ట్ర మహాసభను హైదరాబాద్‌లో ఆగస్టు1,2 తేదీల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. క్వారీలపై వడ్డెరలకు పూర్తి హక్కులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. 75ఏండ్ల స్వాతంత్రంలో వడ్డెర వృత్తిదారుల బతుకులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజికంగా, ఆర్థికంగా , రాజకీయంగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో సుమారుగా నాలుగు వేల సొసైటీలు ఉన్న ఇప్పటికీ ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని తెలిపారు. వెనుకబడిన వడ్డెర కుటుంబాలకు వడ్డెర బంధును ప్రకటించాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రతి కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇడగొట్టి స్వాన, గౌరవ అధ్యక్షులు కుంచం. వెంకటకృష్ణ, రాష్ట్ర ముఖ్యసలహాదారులు రూపని లోకనాథం పాల్గొన్నారు.

చట్టాలు రాజ్యాంగ విరుద్ధంగా ఉంటే..

(మొదటిపేజీ తరువాయి)

నకిలీ, తప్పుడు సమాచారాన్ని గుర్తించేందుకుగాను ఫ్యాక్ట్‌చెక్ యూనిట్‌ను తీసుకువస్తామని కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్‌లో పేర్కొంది. ఇందుకోసం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్-2021కు సవరణలు చేసింది. అయితే, ఈ కొత్త నిబంధనలు ఏకపక్షంగా, రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఐటీ నిబంధనల చెల్లుబాటను సవాల్ చేస్తూ స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మ్యాగజైన్స్ బాంబే హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.

నేడు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదల కానున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఆన్‌లైన్ ద్వారా ఫలితాలను విడుదల చేస్తామని తెలిపారు. గతనెల 12 నుంచి 20 వరకు ఈ పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 2,70,583 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 1,41,742 మంది కలిపి మొత్తం 4,12,325 మంది హాజరయ్యారు. ఫలితాల కోసం విద్యార్థులు https://tsbie.cgg.gov.in, http://results.cgg.gov.in వెబ్‌సైట్లను సంప్రదించాలని సూచించారు.

మరింత తీవ్రస్థాయికి యుద్ధం..!

- రష్యా సరిహద్దుల్లో సైన్యం మోహరింపు
- నాటో సైనిక కూటమి సన్నహాలు



న్యూయార్క్ : ఈ నెల 11-12 తేదీల్లో లిథ్యూనియా రాజధాని విల్నియస్‌లో నాటో దేశాల శిఖరాగ్ర సమావేశం జరగనున్నది. ఈ సమావేశంలో ఉక్రెయిన్ యుద్ధాన్ని మరింత తీవ్రస్థాయికి తీసుకు రావాలని, సైనిక వ్యయాన్ని పెంచాలని, రష్యా సరిహద్దుల్లో సైన్యాన్ని మోహరించాలని నిర్ణయాలు చేసేందుకు నాటో సైనిక కూటమి సన్నహాలు చేస్తోంది. 2022 జూన్‌లో జరిగిన గత శిఖరాగ్ర సమా వేశంలో "పూర్తి స్థాయిలో రక్షణ దళాలను పంపాలి" అని నిర్ణయం చేశారు.

ఉక్రెయిన్ సైన్యం కొనసాగిస్తున్న ప్రతిదాడి ఆశించిన ఫలితాలను సాధించ టంలో విఫలమవుతున్న స్థితిలో యుద్ధంలో నాటో ప్రత్యక్షంగా పాల్గొని రష్యా 'వెన్ను విరవాలి' అన్న భావనతోవున్న వాళ్ళపై వత్తిడి ఎక్కువవుతోంది. ఇటువంటి ఉద్రిక్త వాతా వరణం నేపథ్యంలో జాపోర్జిజియా అణువిద్యుత్ కేంద్రాన్ని పేల్చాలనే లక్ష్యంతో రష్యా మందు పాతర లను పెడుతోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు, వ్లాదీమీర్ జెలెన్ స్కీ ఆరోపి స్తున్నారు. జెలెన్ స్కీ ఆరోపణలకు భిన్నంగా తమ పర్యవేక్షణలోవున్న జపోర్జిజియా అణు విద్యుత్ ప్లాంటు మీద అటువంటి మందు పాతరలుగానీ, మరే ఇతర పేలుడు పదార్థాలుగానీ లేవని అంతర్జాతీయ ఆటమిక్ ఏజెన్సీ డైరెక్టర్ జన రల్, రాఫెయిల్ మరియానో గ్రోస్సి ప్రకటించాడు.

జెలెన్ స్కీ ఆరోపణల వెనుక ఏదో ఒక సంఘటన జరిగేలా చేసి లేదా ఎలాగోలా రెచ్చగొట్టి ఉక్రెయిన్ యుద్ధంలో నాటో సైనిక దళాలు ప్రత్యక్షం గా పాల్గొనేలా చేయాలనే లక్ష్యం ఉందనేది సుస్పష్టం. అణ్వస్త్ర సంబంధిత సంఘటన ఏమి జరిగినా అది ఉక్రెయిన్ యుద్ధంలో నాటో ప్రత్యక్షంగా పాల్గొన టానికి దారితీస్తుందని, అది ఉక్రెయిన్ కోల్పోయిన ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకుని యుద్ధాన్ని వేగంగా ముగించేదాకా సాగుతుందని నాటోలో అమెరికా రాయబారిగావున్న ఇవో డాల్డర్ పొలిటికో లో రాసిన వ్యాసంలో పేర్కొన్నాడు. జర్మనీ-రష్యాల నార్డ్ స్ట్రీమ్ గ్యాస్ పైప్ లైన్‌ను పేల్చివేయటంలో అమెరికా, ఉక్రెయిన్‌లకు ప్రత్యక్ష సంబంధం ఉందని ఫిబ్రవరిలో ప్రముఖ జర్నలిస్టు సేమౌర్ హెర్ష్ రాశారు. ఏదోలా ప్రత్యక్ష జోక్యం చేసుకోవటానికి అమెరికా రెచ్చగొట్టే చర్యలకు దిగటం చారిత్రక సత్యమని అందరికీ తెలుసు: 1898లో హవానా ఒడరేవులోవున్న యూఎస్ఎస్ మైనే అనే యుద్ధ నౌకలో జరిగిన పేలుడును యుద్ధ చర్యగా ఉపయోగించటంతో స్పానిష్-అమెరికా యుద్ధం మొదలైంది. క్యూబా, ఫిలిపైన్స్‌లో అమెరికా సైన్యాన్ని దింపింది. 1964లో వియత్నాం యుద్ధం లో అమెరికా ప్రత్యక్షంగా పాల్గొనటానికి దారితీసిన గల్ఫ్ ఆఫ్ టోన్కిన్ సంఘటన ఒక బూటకం. 2001 సెప్టెంబర్ 11 సంఘటనతో ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ పైన అమెరికా చేసిన యుద్ధాలు, మొత్తం "టెర్రర్ పై యుద్ధం" బూటకాలే. యుద్ధం ఎంత తీవ్రతరమైతే బూటకం అంత పచ్చిగాను, నిస్సిగ్గుగాను ఉంటుంది. రెచ్చగొట్టటం, మీడియాలో పచ్చి అబద్ధాలను ప్రచారం చేయటం ద్వారా యుద్ధానికి ప్రజల మద్దతును కూడగట్టి దురాక్రమకు దిగటం అమెరికా అధ్యక్ష భవనానికి వెన్నతో పెట్టిన విద్య.

అటువంటి రెచ్చగొట్టే సంఘటన నాటో శిఖరాగ్ర సభ జరగటానికి ముందే సంభవించే అవ కాశం ఎంతవరకు ఉందనేది ఇంకా తేలలేదు. అయితే అమెరికా, రష్యాల సంఘర్షణ మరింత తీవ్ర తరం కావటానికి నాటో శిఖరాగ్ర సభను ఉపయో గించటం జరుగుతుందనే విషయం సుస్పష్టంగా కనపడుతున్నది. నాటో శిఖరాగ్ర సభకు ముందు ఉక్రెయిన్ తను కోల్పోయిన క్రిమియా తదితర ప్రాంతాలను తిరిగి జయించటానికి అమెరికా సైని కంగా రష్యాతో తలపడాలని పదవీ విరమణ చేసిన కొందరు సైనికాధికారుల, విదేశాంగ శాఖలో పని చేసిన అధికారుల గ్రూపు ఒక లేఖ ద్వారా అమెరికా అధ్యక్షుడిని కోరటం ఈ కుతంత్రంలో భాగమే.

అమెరికా రాకెట్లను రష్యా జామ్ చేస్తోంది!

ఉక్రెయిన్ రక్షణ మంత్రి

కీవ్: హైమార్స్ వంటి అమెరికా రాకెట్ లాంచర్ల నుంచి ప్రయోగించబడుతున్న జీపీఎస్ నిర్దేశిత రాకెట్లను, ఇతర మందు గుండ్లను తప్పుదోవ పట్టించే పద్ధతిని రష్యా ఉపయోగిస్తోందని ఉక్రెయిన్ రక్షణ మంత్రి, అలెక్సీ రెజ్నికోవ్ అన్నారు. గత సంవత్సరం ఈ రాకెట్ లాంచర్లను ఉక్రెయిన్ ప్రయోగించినప్పుడు అవి నేరుగా లక్ష్యాలను ఛేదించేవని ఆయన ఫైనాన్షియల్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. అయితే తనకు బలమైన రేడియో-ఎలక్ట్రానిక్ వ్యవస్థలు ఉండటంవల్ల జీపీఎస్ నిర్దేశిత ఆర్టిలరీ షెల్స్‌ను, హైమార్స్ రాకెట్లను జామ్ చేసే పద్ధతిని రష్యా రూపొందించిందని ఆయన చెప్పాడు.

రష్యా, పశ్చిమ దేశాల ఆయుధాల పనితీరును పరీక్షించే ప్రయోగశాలగా ఉక్రెయిన్ మారింది. 85కిలోమీటర్ల రేంజ్ గల హై మొబిలిటీ ఆర్టిలరీ రాకెట్ సిస్టెమ్స్(హైమార్స్)ను అమెరికా ఉక్రెయిన్‌కు గత సంవత్సరం జూన్ నుంచి సరఫరా చేస్తున్నది. యుద్ధం తీరునే మార్చగల సత్తా వీటికుందని పశ్చిమ దేశాలు గొప్పలు చెప్పాయి. రష్యా సైన్యం ఉపయోగిస్తున్న జామర్స్ కారణంగా ఈ బహుళ రాకెట్ వ్యవస్థ చాలావరకు నిర్వీర్యం అయిపోయిందని అమెరికా, బ్రిటన్, ఉక్రెయిన్‌లోని నిష్ణాతులు ఇచ్చిన సమాచారాన్ని సీఎన్ఎన్ రిపోర్ట్ చేసింది. యుద్ధ క్షేత్రంలో హైమార్స్ వ్యవస్థలను కామికాజీ డ్రోన్లతోను, ఫిరంగి గుండ్లతోని నాశనం చేశామని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అయితే ఈ ప్రకటనను అమెరికా, ఉక్రెయిన్ కొట్టిపారేశాయి.



అమెరికా, నాటో దేశాలు ఉక్రెయిన్‌కు అత్యంత ఆధునిక ఆయుధాలను సరఫరా చేయటంవల్ల యుద్ధం తీవ్రతరమౌతుందేగాని ఫలితంలో మార్పు ఉండదని రష్యా పదేపదే చెబుతోంది. ఆయుధాల సరఫరాతోను, ఇంటెలిజెన్స్‌ను అందించటంతోను, ఉక్రెయిన్ సైన్యానికి మిలిటరీ శిక్షణ ఇవ్వటంతోను పశ్చిమ దేశాలు ఇప్పటికే యుద్ధంలో భాగమయ్యాయని రష్యా ప్రకటించింది.

సాయిచంద్ కుటుంబానికి

కవిత పరామర్శ

కన్నీరు పెట్టుకున్న ఎమ్మెల్సీ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఇటీవల గుండెపోటుతో మరణిం చిన తెలంగాణ ఉద్యమకారుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్, ప్రముఖ గాయకుడు సాయిచంద్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ కవిత పరామర్శి ంచారు. గురువారం సాయిచంద్ నివాసానికి వెళ్లగానే ఎమ్మెల్సీ కవితను చూసి సాయిచంద్ భార్య భోరున విల పించారు. వారిని ఓదార్చే క్రమంలో కవిత సైతం భాగోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకుంది. చిన్న వయసు లోనే సాయిచంద్ మరణించడంపట్ల ఎమ్మెల్సీ కవిత విచారం వ్యక్తం చేశా రు. తెలంగాణ ఉద్యమ సమయంలో తన పాటలతో ఎంతోమందిని చైతన్య వంతం చేశారని ఆమె గుర్తుచేశారు. అందరికీ ఆత్మీయుడు చనిపోయాడనే వార్త జీర్ణించుకోలేకపోతున్నామని తెలిపారు. సాయిచంద్ మరణం తీర ని లోటన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి:కేవీపీఎస్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ, టి స్కైలాబ్‌బాబు గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.కార్మికు ల వేతనాలు పెంచాలనీ, కారోబార్లు , బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులు గా నియమించాలని కోరుతున్నారని గుర్తుచేశారు. పీఆర్సీ నిర్ణయించినట్టు జీవో నెం 60 ప్రకారం రూ. 19వేలు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 51 ప్రకారం మల్టిపర్పస్ విధానాన్ని రద్దు చేసీ, పాత కేటగిరి విధానాన్ని అమలు చే యాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదంలో మరణించిన కార్మికుడికి రూ.10 లక్ష ల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాం డ్ చేశారు.కార్మికుల నిరవధిక సమ్మెకు అన్ని పార్టీలు ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాలని కోరారు.

ఇంజినీరింగ్‌లో అదనంగా 14,565 సీట్లు

మొత్తం సీట్లు 1,00,671

- కన్వీనర్ కోటాలో 72,275 సీట్లు
- ప్రవేశాల షెడ్యూల్‌లో సవరణ
- తొలివిడత వెబ్‌ఆప్షన్ల నమోదు గడువు 12 వరకు పెంపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ విద్యలో అదనంగా 14,565 సీట్లు మంజూరయ్యాయి. అయితే ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల్లోనే సీట్లు పెరగడం గమనార్హం. దీంతో ఇంజినీరింగ్‌లో మొత్తం 1,00,671 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ గురువారం జీవోనెంబర్ 114ను విడుదల చేశారు. కొన్ని కాలేజీలు కోర్ గ్రూపుల్లోని 6,930 సీట్ల మూసివేతకు దరఖాస్తు చేసుకున్నాయని తెలిపారు. ఆయా కాలేజీలు కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) కోర్సులకు అను మతి ఇవ్వాలంటూ సాంకేతిక విద్యాశాఖకు విజ్ఞప్తి చేశాయని వివరించారు. ప్రభుత్వం వాటిని పరిశీలించి అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. దానికి ఎలాంటి ఆర్థికపరమైన భారం ప్రభుత్వం పడబోదని స్పష్టం చేశారు. కొత్తగా సీఎస్ఈ కోర్సులోనే 7,635 ఇంజినీరింగ్ సీట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. అదనంగా రూ.27.39 కోట్ల భారం ప్రభుత్వంపై పడుతుందని వివరించారు. అయితే మొత్తం 155 ఇంజినీరింగ్ కాలేజీల్లో ఉన్న 1,00,671 సీట్లలో కన్వీనర్ కోటాలో 72,275 సీట్లున్నాయి. 137 ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో యాజమాన్య కోటాలో 28,396 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు గడువు 8

ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ షెడ్యూల్‌ను ప్రభుత్వం సవరణ చేసింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ గురువారం సవరణ షెడ్యూల్ ను విడుదల చేశారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు గడువు ఈనెల ఎనిమిదో తేదీ వరకు ఉందని తెలిపారు. ఈనెల తొమ్మిది వరకు ధ్రువ పత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు.

ఈనెల 12 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు గడువుందని వివరించారు. ఈనెల 16న తొలివిడత సీట్లు కేటాయిస్తామని తెలిపారు. 22 వరకు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్‌రిపోర్టింగ్ గడువుందని పేర్కొన్నారు. ఈనెల 24 నుంచి ఇంజినీరింగ్ ప్రవేశాల రెండోవిడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. వచ్చేనెల నాలుగు నుంచి తుదివిడత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆగస్టు 10న స్పాట్ అడ్మిషన్ల మార్గదర్శకాలను విడుదల చేస్తామని వివరించారు. ఇతర వివరాల కోసం https://tseamcet.nic.in వెబ్‌సైట్ ను సంప్రదించాలని సూచించారు.

బీఆర్ఎస్‌ను పాతరేస్తాం

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది ఒక్కటే డీఎన్ఏ
- 8న వరంగల్‌లో ప్రధాని మోడీ బహిరంగ సభ : జి.కిషన్‌రెడ్డి
- సోషల్‌మీడియాలో ప్రచారాలను ఆపండి.. అప్రమత్తంగా ఉండండి : బండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజాస్వామ్య పద్ధతిలో పాతరేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ మోడల్ అంటే కుటుంబ పాలననేనా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది ఒక్కటే డీఎన్ఏ అనీ, ఆ రెండు పార్టీలూ నాణానికి బొమ్మాబొరుసు లాంటివని విమర్శించారు. ఈ నెల 8న వరంగల్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ రైల్వే వ్యాగన్ యూనిట్‌కు భూమిపూజ చేస్తారనీ, 500 కోట్ల విలువైన జాతీయ రహదారులకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. అనంతరం యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో జరిగే బహిరంగ సభలో ప్రధాని మోడీ పాల్గొంటారన్నారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ సిటీ కార్యాలయంలో బండి సంజయ్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు.

బీఆర్ఎస్‌కు ఓటేస్తే కాంగ్రెస్ వేసినట్టేనని విమర్శించారు. కుట్ర పూరితంగా తెలంగాణలో బీజేపీపై ఆ రెండు పార్టీలూ అసత్య ప్రచారం చేస్తున్నాయని ఆరోపిం చారు. టీఆర్ఎస్‌తో ఒప్పందంలో భాగంగానే బండిని మార్చారనే అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కుటుంబ పాలనపైనా, అవినీతిపైనా బీజేపీ పోరాడుతున్నదని చెప్పారు. కేసీఆర్ ఇచ్చిన హామీలన్నింటినీ విస్మమరిం చారనీ, మాటలతో ప్రజలను మభ్యపెట్టి రాజకీయ లబ్ధి పొందు తున్నారని విమర్శించారు. సైన్స్ సిటీకి 20 ఎకరాల భూమి అడిగితే కేసీఆర్ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆఫీసుకు కంటోన్మెంట్‌లో పదెకరాలు, బీఆర్ఎస్



ఆఫీసుకు 11 ఎకరాలు కేటాయించి ందని విమర్శించారు. జీపీలను, యూనివర్సిటీలను నిర్వీర్యం చేసింద న్నారు. కల్వకుంట్ల కుటుంబం, బీఆర్ఎస్ నేతలు వ్యాపారాలు చేసుకునే వారిని, బిల్డర్లను బెదిరిస్తూ వాటాలు, షేర్లు తీసుకుంటున్నారని ఆరోపించారు.

బండి సంజయ్ మాట్లాడుతూ..కిషన్‌రెడ్డికి శుభా కాంక్ష లు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్రను గుర్తుచేశారు. తమలాంటి నేతలకు ఆయన గురువు లాంటివారన్నారు. సోషల్ మీడియా లో కిషన్‌రెడ్డి, బండి, ఇతర నేతల గ్రూపుల పేరుతో చేస్తున్న ప్రచారాన్ని ఆపాలని కోరారు. పార్టీ శ్రేణులను రెచ్చగొట్టాలని చూస్తున్న వారి పోస్టులను తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ అధికార ప్రతినిధి ప్రకాశ్‌రెడ్డి, సెంట్రల్ సిటీ అధ్యక్షులు గౌతంరావు పాల్గొన్నారు.

శారదా నగర్ కాలనీలో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ- వనస్థలిపురం

హయత్ నగర్ డివిజన్‌లోని శారదా నగర్ కాలనీ వాసులు స్వచ్ ఆటోల విధుల నిర్వహణపై కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి ఆ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీల స్వచ్ ఆటో కార్మికులతో సమావేశం ఏర్పాటు చేయాలని శానిటేషన్ ఎస్ ఎస్ రవీందర్‌కు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నరసింహారావు, బీజేపీ నాయకులు అప్పారావు, శానిటేషన్ సూపర్ వైజర్ మధు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

9న లక్ష్మీ ఆయుర్వేద హాస్పిటల్‌లో వైద్య శిబిరం

నవతెలంగాణ -వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ లక్ష్మీ ఆయుర్వేద హాస్పిటల్‌లో ఈ నెల 9న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఎల్బీనగర్గ్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, రావుల వెంకటేశ్వర్లు ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ తెలిపారు. ఈ శిబిరంలో అన్ని దీర్ఘకాల వ్యాధులకు, కీళ్ల నొప్పులకు, పక్షవాతం, కిడ్నీ సమస్య లతోపాటు ఆర్థోపెటిక్ డాక్టర్ నవీన్ కుమార్ చే ఎముకలకు సంబంధించిన చికిత్స కూడా చేయిస్తున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామీణ ప్రాంత సమస్యలపై పోరాడుతాం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కాడీగాళ్ల భాస్కర్, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు జాన్ వెస్లీ



నవతెలంగాణ-హయత్‌నగర్

ప్రభుత్వంతో పొత్తులు ఉన్నా, లేకున్నా గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలపై పోరాడుతామని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి కాడీగాళ్ల భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్ వెస్లీలు అన్నారు. హయత్ నగర్‌లోని ఎస్‌వీ కన్వెన్షన్ హాల్లో గురువారం రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కాడీగాళ్ల భాస్కర్, జాన్ వెస్లీలు హాజరై మాట్లాడారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పొత్తులు ఉన్నా లేకున్నా గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలపై పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధాలపైన పోరాటాలు చేయాలని కోరారు. అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోతే ప్రభుత్వ భూమిలలో జెండాలు పాతి ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, పగడాల యాదయ్య, బొడ సామిల్, చంద్రమోహన్ రాజు ,జగదీష్, రామచందర్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే వార్డు కార్యాలయాలు

- ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ - ఎల్బీనగర్

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. గురువారం చైతన్యపూరి, గడ్డిఅన్నారం డివిజన్ పరిధిల్లో నెలకొల్పిన వార్డు ఆఫీస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. వార్డు ఆఫీసులో దాదాపు 11 విభాగాలకు సంబంధించిన అధికారులు ఉంటారని తెలిపారు. ప్రతి చిన్న సమస్య పరిష్కారం కోసం మున్సిపల్ ఆఫీసుకు పోయే అవసరం ఉండదని అన్నారు. అప్పటికప్పుడు మీ కాలనీల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు.

ప్రజారోగ్యం దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పట్టణ ప్రగతి కార్యక్రమం చేపట్టిందన్నారు. పచ్చదనం, పారిశుధ్యం, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత తదితర వాటిపై ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుగ్గరపు దయానంద్, ఎల్బీనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణయ్య, కార్పొరేటర్లు రంగ నర్సింహా గుప్తా, బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, ఎల్బీనగర్ సర్కిల్ 10ఏ వాటర్ వర్క్స్ మేనేజర్ బలరాం రాజు, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తోట మహేష్ యాదవ్, శ్రీశైలం గౌడ్, సీనియర్ నాయకులు బిచేనేపల్లి వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్ రెడ్డి, రమణారెడ్డి, గండి సన్నీ, శరత్ చంద్ర పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి



నవతెలంగాణ -ఉప్పల్

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి అన్నారు. గురువారం ఉప్పల్ కట్ట మైసమ్మ ఆలయం 20వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తానని ఆలయ కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అలువాల బాలరాజు ముదిరాజ్, అలువాల కృష్ణ ముదిరాజ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గడ్డం రవికుమార్, అరటికాయల భాస్కర్ ముదిరాజ్, వేముల సంతోష్ రెడ్డి, మస్కా సుధాకర్, లేతాకుల రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో బోనాలు నిర్వహించుకోవాలి

- కార్పొరేటర్ ఎండీ సైఫుద్దీన్ షఫీ



నవతెలంగాణ- సంతోష్ నగర్

బోనాల పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఓల్డ్ మలక్ పేట్ డివిజన్ కార్పొరేటర్ ఎండీ సైఫుద్దీన్ షఫీ అన్నారు. డివిజన్ పరిధిలోని పోచమ్మ దేవాలయం వద్ద పరిశుభ్రత, పరిరక్షణ, వీధిలైట్లు, బీటీ రోడ్డు ప్యాచ్ వర్క్, ఫుట్ పాత్, పక్కన స్టీల్ ఎత్తివేయాలని కోరుతూ గురువారం స్థానికులు కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీ అధికారులదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల ప్రారంభమైన నిరవధిక సమ్మె



నవతెలంగాణ-ఘట్కేసర్

గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్, వేతనాలు, ఇతర మౌలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం ఘట్కేసర్‌లోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ప్రారంభమైంది. ఈ సందర్భంగా మల్టీపర్పస్ విధానం రద్దు, ఫేస్కేల్ ప్రకారం కనీస వేతనం రూ.19,000, ఈఎస్ఐ, పీఎఫ్, రిటర్మెంట్ సౌకర్యం, వారంతపు, పండగ సెలవులు ఇవ్వాలని నినాదాలు చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా నాయకులు చింతల యాదయ్య, ఏఐటీయూసీ జిల్లా నాయకులు జయచంద్రలు మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులు సీఎం కేసీఆర్ పాలనలో వెట్టి చాకిరికి గురవుతున్నారని, పనికి తగ్గ వేతనం లభించడం లేదని, ఒకే కార్మికుడు మల్టీపర్పస్ విధానం వల్ల అనేక రకాల పనులు నిర్వహించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వీరి పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. పరిశుభ్రతలో మన రాష్ట్రం అనేక అవార్డులు సాధించిన ఘనత ఈ గ్రామ పంచాయతీ సిబ్బంది వలననే అని గుర్తుచేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువులకనుగుణంగా ప్రతి గ్రామ పంచాయతీ కార్మికునికి వేతనం నెలకు రూ.19వేలు పెంచాలన్నారు. ఇంకా వీరికి ప్రమాద బీమా వర్తింపచేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని, గ్రామపంచాయతీ కార్మికుల్లో అర్హత ఉన్నవారికి పదోన్నతులు కల్పించాలన్నారు. వీరి ముఖ్యమైన 17 డిమాండ్లను వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫైవన్నీ సాధించుకునేంత వరకూ ఈ సమ్మెను కొనసాగించాలని, ఎవరి బెదిరింపులకు, బుజ్జగింపులకు కార్మికులంతా తలొగ్గకుండా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఎన్ సబిత, ఏఐటీయూసీ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, నాయకులు ఆర్. జంగయ్య, ఆర్.చంద్రమోహన్, ఎల్లమ్మ శోభ, ప్రవీణ్, బి.మహేందర్, జి.సుజాత, కమల్ ప్రవీణ్, భారతమ్మ, మల్లేష, దానయ్య, రామచందర్, అంజమ్మ, సుజాత, భారతమ్మ, జానమ్మ ఎల్లమ్మ, ముత్యాలు, పరశురాములు కిష్టమ్మ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్ :

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె ప్రారంభమైన సందర్భంగా హయత్ నగర్‌లో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ, బి. కిషన్, కేవీపీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బోడ సామిల్, సీఐటీయూ జిల్లా నాయకులు రవికుమార్, మండల నాయకులు బూర ప్రభాకర్‌లు మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం దిగివచ్చి కార్మికులతో చర్చలు జరిపి, సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మె కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ నాయకులు అంజయ్య, బాలయ్య, అశోక్, లింగం ,మహంకాళి, యాదమ్మ శోభ తదితరులు పాల్గొన్నారు.



గడ్డి అన్నారం డివిజన్

మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా గులాం మహమ్మద్



నవతెలంగాణ - ఎల్బీనగర్

గడ్డి అన్నారం డివిజన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా గులాం మహమ్మద్ నియమితులయ్యారు. ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మైనార్టీ సెల్ అధ్యక్షులు మక్బూద్ అలీ ఆధ్వర్యంలో ఆ పార్టీ ఇంచార్జి మల్ రెడ్డి రాంరెడ్డి గురువారం నియామక పత్రాన్ని గులాం మొహమ్మద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని, ఆ దిశగా అందరూ తమ వంతు సహాయ, సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బద్దుల వెంకటేష్ యాదవ్, వేణు యాదవ్, శ్రీను, రవి, హుస్సేన్, జహంగీర్, నరేష్ ముత్తి, మొహమ్మద్ షాయబ్, మహమ్మద్ అతిక్ పాల్గొన్నారు.

'డ్రయినేజీ సమస్యను పరిష్కరిస్తాం'



నవతెలంగాణ-ఎల్బీనగర్

పోచమ్మ బస్తీ కాలనీలో గత కొన్ని రోజులుగా డ్రైనేజీ పొంగి రోడ్ మీద ప్రవహిస్తోంది. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు వాటర్ వర్క్స్ డీజీఎం సరిత గురువారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అతి త్వరలోనే డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ మాజీ అధ్యక్షులు లోకసాని కొండల్ రెడ్డి, గౌని శ్రీనివాస్ గౌడ్, కిల్లా మైసమ్మ దేవాలయ మెంబర్ రాగం సునీల్ యాదవ్, కడారి రాజు యాదవ్, గుండేనాగరాజు, విజయ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్



నవతెలంగాణ -వనస్థలిపురం

సాయిబాబా దేవాలయంలో చోరీకి పాల్పడ్డ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, జైలుకు తరలించారు. ఈ ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున మూడు గంటలకు ద్వారకామయి నగర్ సాయిబాబా దేవాలయంలో దొంగలు పడ్డారని సమాచారం అందడంతో వెంటనే పోలీసులు ఆ ఘటనా స్థలానికి చేరుకున్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తి సూర్యాపేటకు చెందిన షేక్ మన్సూర్. వృత్తి రీత్యా పెయింటర్. నిందితుడిని అదుపులోకి తీసుకుని జైలుకు తరలించినట్లు సీఐ జలంధర్ రెడ్డి తెలిపారు.

సంతోష్ నగర్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్



నవతెలంగాణ- సంతోష్ నగర్

సైదాబాద్ డివిజన్ డీసీపీ ఆఫీస్‌కు వచ్చే రోడ్డు చంచల్గూడ రోడ్డు కరెంట్ కార్యాలయం ముందు గురువారం సంతోష్ నగర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. సంతోష్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ సృష్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సంతోష్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ విక్రమ్ సింగ్, ఏఎస్ఐ అలివేలు హెచ్చరించారు. ఈ డ్రైవ్ లో ట్రాఫిక్ రద్దీకి ఇబ్బందులు కలిగిస్తున్న దుకాణదారులపై, గుడ్స్ ఆటోలపై కేసులను నమోదు చేసి జరిమానాలను విధించినట్లు తెలిపారు. రోడ్డుపైనే ఇరువైపుల వాహనాలను నిలిపి ట్రాఫిక్ ఇబ్బందులను సృష్టిస్తున్నారని, అదే విధంగా ఇంపీరియల్ రెస్టారెంట్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందుల ఫిర్యాదులు వస్తున్నాయని దీనిపై కూడ ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉదేశపూర్వకంగా నెంబర్ ప్లేట్ కనిపించకుండా చేసినట్లయితే వాహన యజమాని పై మోటర్ వెహికల్ యాక్ట్ 129 (2) రూ. 2వేలు వరకు జరిమానా లేదా నెల రోజులు జైలు శిక్ష పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఇటీవల గుండె పోటుతో మరణించిన ప్రముఖ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయి చంద్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించిన రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవి ప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామ్ నరసింహ గౌడ్.

నవతెలంగాణ - చైతన్యపురి

తాగునీటి సమస్యను పరిష్కరించిన కార్పొరేటర్



నవతెలంగాణ - ఉప్పల్

రామంతపూర్ భగాయత్ సత్యనగర్ కాలనీలో కొన్ని సంవత్సరాల నుంచి ఉన్న తాగు నీటి సమస్యను గురువారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి పరిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తాగునీటి సమస్య ఉందని స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. వెంటనే జలమండలి అధి కారులతో కాలనీలో పర్యటించి..కొత్త కనెక్షన్ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రవీందర్, సూపర్‌వైజర్ కిషన్, డివిజన్ అధ్యక్షులు బండారు వెంకట్రావు, నాయకులు అల్లాడి నిరంజన్ గౌడ్, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

బీజేకేఎం కార్యవర్గ సభ్యుడిగా రామిడి చంద్రశేఖర్ రెడ్డి



నవతెలంగాణ- బడంగ్ పేట్

భారతీయ జనతా కిసాన్ మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా బాలాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ బీజేపీ నాయకులు రామిడి చంద్రశేఖర్ రెడ్డి నియమితులయ్యారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు జక్క రవీందర్ రెడ్డి గురువారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేకర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడానికి రాజీ పడకుండా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం తన నియమాకానికి సహకరించిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న తెలంగాణ

- మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ -ఘట్కేసర్

అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం మండలం ఔషపూర్ అంకుషాపూర్ హైదరాబాద్ ఘనపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని లింగాపూర్, ఫకీర్ టెక్య వార్డుల్లో అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి జిల్లా, ప్రతి మండలం, ప్రతి గ్రామాల్లోని ప్రజాలకు ఎలాంటి సమస్యలు లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ మల్లిపెద్ది శరత్ చంద్రారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దయాకర్ రెడ్డి, రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు డాక్టర్ భద్ర రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రమేష్, మండల పార్టీ జర్నల్ సెక్రటరీ పన్నాల కొండల్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాయి చంద్ కుటుంబాన్ని ఆదుకుంటాం

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ- బడంగ్ పేట్

ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్, ఉద్యమ గాయకులు సాయి చంద్ కుటుంబాన్ని ఆదుకుంటామని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న గుర్రం గూడలో ఉన్న సాయి చంద్ కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్సీ కవిత, విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిలు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించిన ఉద్యమ నాయకుడని, ఆయన మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆయన కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

'పోస్టల్ సేవలను వినియోగించుకోండి'



నవతెలంగాణ-ఘట్కేసర్

పోస్టల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సికింద్రాబాద్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకన్న సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన మాటాడుతూ ఘట్కేసర్ కు చెందిన గడ్డం శివనారాయణ ఇటీవల ప్రమాదంలో మృతి చెందాడు, అతను పోస్ట్ ఆఫీస్ లో ప్రమాద బీమా పథకాన్ని (టాటా ఏఐజీ) తీసుకోవడంతో అతడి కుటుంబానికి బీమా కింద రూ.10 లక్షలు మంజూరైనట్లు తెలి పారు. దీనికి సంబంధించిన చెక్కును శివ నారాయణ భార్య గడ్డం సుజాతకు అందజేసినట్లు తెలిపారు. సంవత్సరానికి రూ.399 బీమా తీసుకుంటే ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి కుటుంబానికి రూ.10 లక్షలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 30 వరకు ప్రత్యేక శిబిరాల ద్వారా ప్రతి పోస్ట్ ఆఫీస్ లో ఈ బీమా చూసుకోవచ్చు అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐపీబీ చీఫ్ మేనేజర్ భాస్కర్ నాయక్, ఐపీపీబీ బ్రాంచ్ మేనేజర్ శోభ, లిదిప్, సబ్ పోస్ట్ మాస్టర్ రాజు సిద్దార్థ, పోస్ట్మాన్ శంకరప్ప, పీఏ సుధాకర్, పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఒక్క రూపాయి' కే కార్పొరేట్ వైద్య సేవలు

- మురుగన్ హాస్పిటల్ లో మరికొన్ని సేవలు
- ఆరోగ్య శ్రీ, సీజీహెచ్‌ఎస్, ఈఎస్ఐసీ, ఆయుష్మాన్ భారత్ సేవలు ప్రారంభం




నవతెలంగాణ-బంజారాహిల్స్

పేద, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గడిచిన రెండు వందల రోజుల్లో 5,000 మందికి పైగా ఒక్క రూపాయి డాక్టర్ కన్సల్టెంట్స్ ఫీజుతో వైద్య సేవలు అందిస్తున్నారు. మరింతగా ఈ సేవలను విస్తృతంగా అందించడం కోసం పంజాగుట్ట మురుగన్ హాస్పిటల్ మరో అడుగు ముందుకు వేసింది. గురువారం డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేదర్, నాంపల్లి ఎమ్మెల్యే జఫర్ హుస్సేన్ మిర్జా, పొంగేలెట్టి సుధాకర్ రెడ్డి, తీన్మార్ మల్లన్న, సుద్దాల అశోక్ తేజ, కార్పొరేటర్ విజయ రెడ్డి, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గా దయాకర్, బోయినపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ దోశేగోని శ్రీనివాస్ గౌడ్, పీర్జాదిగూడ జనరల్ సెక్రటరీ పాశం రాజుయాదవ్, సినీ ప్రముఖులు హీరో సోహెల్, సినీనటి అనుపమ స్వాతి, కమిక సింగ్ వేళ్ళ చేతుల మీదుగా ఈ సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మురుగన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఏలూరి బాలచందర్ (భాను) మాట్లాడుతూ హైదరాబాద్ లోనే హార్ట్ లాంటి ప్రదేశం పంజాగుట్ట.. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే ప్రదేశం, గ్రామాల్లో నుంచి వచ్చే వారికి కూడా ఈజీగా ఉండే ఏరియా కాబట్టి ప్రజలందరూ ఈ సేవలను వినియోగుచుకోవాలని కోరారు. మురుగన్ హస్పిటల్స్ పంజాగుట్ట 5 కిలోమీటర్ల పరిధిలో ఒక్క రుపాయకే అంబులెన్స్ సేవలను అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఏలూరి కృష్ణ, మురుగన్ హాస్పిటల్ డైరెక్టర్స్ నాగేశ్వరరావు, బిక్షపతి, పి.విజయ్ కుమార్, రాంబాబు, రఘు, డాక్టర్ శ్రావణి, సోని, భవాని, డాక్టర్ స్వాతి పాల్గొన్నారు.

కోర్టు ఉత్తర్వులను ధిక్కరించిన మేడిపల్లి పోలీసులు

- సొంత భూమిలో పనులు చేసుకుంటే అడ్డుకుంటారా?
- ఏ ఒక్కరినీ వదిలేది లేదు : తోటకూర వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ - బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబరు 85లో తమ సొంత భూమి విషయంలో కోర్టు స్పష్టంగా ఉత్తర్వులు ఇచ్చిందని, కానీ మూడు రోజుల నుండి మేడిపల్లి పోలీసులు, కొంతమంది ప్రయివేటు వ్యక్తులు దౌర్జన్యం చేస్తూ భూమి చుట్టూ ఉన్న ప్రహరీ గోడను కూల్చివేసి, గేటును ధ్వంసం చేశారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం బోడుప్పల్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. తమ భూమిలో తాము చదును చేసుకోవడం కోసం జేసీబీతో పని చేయిస్తుంటే..పోలీసులు జోక్యం చేసుకొని జేసీబీలను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. తన వద్ద పనిచేసే వ్యక్తులను బలవంతంగా లాక్కెళ్లి స్టేషన్ లో నిర్బంధించారని చెప్పారు. వాచ్ మెన్ ఎల్లయ్య అనే వృద్ధుడిపై ఎస్ఐ ప్రభాకర్ రెడ్డి దౌర్జన్యానికి దిగి పిడిగుద్దులతో దాడికి పాల్పడ్డారని, తీవ్రమైన గాయాలతో ఆస్పత్రిలో జాయిన్ చేశామని చెప్పారు.

ఆదేశాలను చింపేస్తారా?

భూమిలో తమ పనుల అవసరాల నిమిత్తం కంటేయినర్ వేయగా..పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ దానిని తీసివేయాలంటూ పదే పదే ఒత్తిడి చేశారని వజ్రేష్ అన్నారు. పోలీసులు తమ భూమిలోకి రాకూడదని ఉన్న ఆదేశాలను చూపించినా.. కనీసం దానిని పరిగణలోకి తీసుకోకుండానే మేడిపల్లి ఎస్ఐ ప్రభాకర్ రెడ్డి చించివేశాడని ఆరోపించారు. అన్ని సక్రమంగా ఉంటే.. అర్ధరాత్రి దొంగల్లా వచ్చి కంటెనర్‌ను తొలగించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. అధికార పార్టీ నేతల మాటలు విని తమ కుటుంబాన్ని ఇబ్బందుల పాలు చేస్తున్న మేడిపల్లి పోలీసులపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెప్పారు. వాచ్‌మెన్ పై దాడి చేసిన ఎస్ఐ ప్రభాకర్ రెడ్డి పై కేసు నమోదు చేయాలని, గురువారం తెల్లవారు జామున తన భార్య, కుమారుడిపై దాడికి దిగిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే



నవతెలంగాణ:కాప్రా

మల్లాపూర్ నుండి కాప్రా మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ ఎస్‌ఎఫ్‌సీ కృష్ణ నగర్ వెళ్లే దారిలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టుకున్నాయి. అటుగా వెళ్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి క్షతగాత్రులను అంబులెన్స్‌లో మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి పంపించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాక్స్ డ్రైన్ నిర్మాణంతో వరద నీటి సమస్య పరిష్కారం



నవతెలంగాణ- నేరేడ్‌మెట్

బాక్స్ డ్రైన్ నిర్మాణంతో ప్రతి సంవత్సరం ఎదుర వుతున్న వరద నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవు మతోందని మల్కాజిగిరి ఎమ్మెల్యే హనుమంతరావు అన్నారు. గురువారం ఆయన అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి, అధికారులతో కలిసి బీహెచ్‌ఎల్ గేటు వద్ద బాక్స్ డ్రైన్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సునీల్, మల్లికార్జున్, సాంబయ్య, డీఈ ప్రశాంతి, ఏఈ మమత, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

- ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు అన్నారు. గురువారం ఆయన నేరేడ్ మెట్ డివిజన్ పరిధిలోని రేణుక నగర్ పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షానికి డ్రయినేజీ నీరు ఓవర్ ఫ్లో అవుతుందని, రోడ్డు, స్ట్రీట్ లైట్స్ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యే ను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..కాలనీ వాసులు తనకు చెప్పిన సమస్యలన్నీ పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకుంటానని హమీనిచ్చారు. కార్యక్రమంలో



కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, ఉపేందర్ రెడ్డి, పిట్ల శ్రీనివాస్, జీఎస్ వీ. సతీష్‌కుమార్, రాముయాదవ్, చెన్నారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్, శివ,చికెన్ సెంటర్ రాజు, సూరి, బాలకృష్ణ గుప్తా, ఆగమయ్య, బాల రాజు, బజార్ సాయి గౌడ్,పార్థు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు

- జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ అమోయ్ కుమార్

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులతో పాటు ఆయా కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులతో పాటు ఇతర కేసుల్లో సైతం బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా పూర్తి ఆధారాలతో చార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. గ్రామాల్లో కుల బహిష్కరణలు, సామాజిక బహిష్కరణలు చేసే వారిపూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకొనే వారిపై కేసులు నమోదు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్ ట్రయల్ కేసుల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. అట్రాసిటీ కేసుల్లో నిందితులు తప్పించుకోకుండా శిక్షపడేలా పూర్తి ఆధారాలు సేకరించి న్యాయస్థానంలో సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను తప్పకుండా అమలయ్యేలా చూడాలని కమిటీలోని సభ్యులు సైతం క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. అట్రాసిటీ అంశాలతో ముడిపడి ఉన్న వివరాలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, డీసీపీ జానకి, జిల్లా రెవెన్యూ అధికారిణి (ఎఫ్ఏసీ) చంద్రావతి, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి వినోద్, బాలాజీ , ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాజు వస్తాద్ ధనరాజ్ నాయక్, సఫాయి కర్మ చారి సభ్యులు వెంకటేశ్వర్లు , సఫాయి కర్మ చారి సభ్యులు, జిలా స్థాయా అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.



కీసర నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా జూపల్లి మోహన్



- ప్రధాన కార్యదర్శి గా బందెల యాదగిరి

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

కీసర మండల నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా జూపల్లి మోహన్, ప్రధాన కార్యదర్శిగా బందెల యాదగిరి (నవతెలంగాణ పత్రిక)లు ఏకగ్రీవ ఎన్నిక అయ్యారు. గురువారం కీసర మండల కేంద్రంలో ప్రింట్ మీడియా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు ఆవుల శ్రీనివాస్ రావు, గుజ్జుక పరశురాం, కోశాధికారిగా తంగెళ్లపల్లి వెంకటేశ్, సంయుక్త కార్యదర్శి గా చెట్టి బాలరాజు యాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శి గా పన్నాల బాల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా ఇందు ప్రి యాల ప్రభాకరరావు, సలహాదారులు గామడూరి రవీం దర్, మొరుగు యాదగిరి, బలిజె అంజిరెడ్డి. కార్యవర్గ సభ్యులుగా అవిరినేని ఆది నారాయణ, నాయకపు నాగ రాజు, పండుగ రామకృష్ణ, కర్రె గణేష్, ఆవుల భాస్కర రావు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. జర్నలిస్టుల సమస్యల సాధన కోసం నూతన ప్రెస్ క్లబ్ కృషి చేస్తుందని అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శిలు తెలిపారు.

శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాలకు కిషన్ రెడ్డికి ఆహ్వానం



నవతెలంగాణ-బేగంపేట

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయం బోనాల జాతరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి హాజరు కావాలని ఆలయ ఈవో మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు పాలకమండలి సభ్యులు ఆహ్వాన పత్రికను గురువారం అందజేశారు.

అర్హులైన వారందరికీ రేషన్ కార్డులివ్వాలి



- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కృపాసాగర్

నవతెలంగాణ-మల్కాజిగిరి

అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ముస్తాల కృపా సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో, సివిల్ సప్లయీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నా నుద్దేశించి కృపాసాగర్ మాట్లాడారు. గతంలో అనేకమంది పేదలు తెల్ల రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. కానీ ఇప్పటి వరకు ఎవ్వరికీ ఇవ్వలేదన్నారు. రేషన్ కార్డులు కోసం నాయకుల, అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. పేదల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కుటుంబంలో సంఖ్య పెరిగి రేషన్ కార్డులో నమోదు చేసుకోవాలంటే తెలియక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. ఏ సంక్షేమ పథకాలు అమలు జరగాలన్నా రేషన్ కార్డు తప్పకుండా అడుగు తున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రజల సమస్యలు పరిష్కరించడం లో నిర్లక్ష్యం చేయడం దారుణమని వాపోయారు. ప్రభుత్వం తన విధానాలను మార్చుకో వాలని విజయ కుమార్ , సుమిత్ర హెచ్చరించారు. లేని ఎడల ఉద్యమాలు చేస్తామన్నారు. అంతకుముందు ధర్నా నిర్వహించి ఏఎస్‌వో శ్రీనివాస్‌కు వినతిపత్రం అంద జేశారు. సమస్యను పరిష్కరిస్తామని ఏఎస్‌వో సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో అరుణ, ధనలక్ష్మీ, దుర్గా, దీప, మమత, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

'అన్నపూర్ణ క్యాంటీన్' ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఓల్డ్ అల్వాల్‌లోని ప్రభుత్వ లైబ్రరీ సఖి సెంటర్ వద్ద అక్రమంగా నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను తొలగించి ఆ స్థలంలో అన్నపూర్ణ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సబితాఅనిల్ కిశోర్ గౌడ్, జితేంద్రనాథ్ లు స్థానికులతో కలిసి అల్వాల్ సర్కిల్ ఉప కమిషనర్ నాగమణికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం కార్పొరేటర్లు మాట్లా డుతూ.. లేబర్ అడ్డా ఇందిరాగాంధీ విగ్రహం సమీపంలోని (ఆహార్ రెస్టారెంట్ ఓల్డ్ అల్వాల్‌కు ఎదురుగా) అక్రమంగా నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను తొలగించాలని కోరారు. 50 ఏండ్ల నుంచి ఈ స్థలంలో దసరా ఉత్సవాల్లో రావణ దహనంతో పాటు, అన్ని కార్మిక సంఘాలు మే డే వేడుకలు నిర్వహిస్తుంటారని తెలిపారు. ప్రతి బుధవారం వారంతపు సంత నిర్వహిస్తుం టారని తెలిపారు. స్పందించిన డీసీ నాగమణి అన్నపూర్ణ క్యాంటీన్' ఏర్పాటు కు ఉత్తర్వులు జారీ చేయడంతో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అనిల్ కిశోర్ గౌడ్ ,బల్వంత్ రెడ్డి, కవిత, శ్రీనివాస్, నాగేశ్వరరావు, భాస్కర్ గౌడ్, నారాయణ, సాయి రాంగౌడ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన మర్రి రాజశేఖర్



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని బొల్లారం తిరుమలగిరి, బోయిన్‌పల్లి, రసూల్ పురా మట్కోర్ట్ ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలను బీఆర్ఎస్ కంటోన్మెంట్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి విద్య శాఖ అధికారులు, మాజీ బోర్డు సభ్యులతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. అనంతరం మర్రి రాజశేఖర్ రెడ్డి పాఠశాలలు మౌలిక వసతుల లోపలు, భవనాల మరమ్మత్తులు, మరుగుదొడ్ల, తాగునీటి సరఫరా, శిథిలమైన గదుల స్థానంలో కొత్త క్లాస్ రూములు ఆధునీకరణ వంటి అంశాలపై అధికారులకు చెప్పారు. నాణ్యమైన విద్యను అందించే దిశగా సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డీఈఈ సంజీవ్, ఈఈ శ్రవణ్ , మాజీ బోర్డ్ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు శ్యామ్ కుమార్, లోకనదం, నళిని కిరణ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్, పెద్దల నరసింహా, సాయికిరణ్, నాయీమ్, ప్రవీణ్ యాదవ్, శ్రీకాంత్, సురేష్, గంగారాం, సోమయ్య నర్సింగ్, భిక్షపతి, యాకుబ్, యాదగిరి, నగేష్, బాబులు, యూసఫ్, సజిత్, బంటీ, అనిల్, కనకయ్య భాస్కర్, శేఖర్ , రాజు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ వర్ధంతి

నవతెలంగాణ-కాప్రా

బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ ప్రధాన కూడలిలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వ ర్యంలో బాబు జగ్జీజీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా కమలానగర్ ఆఫీసులో నిర్వహించారు. కార్యక్రమంలో కోమటి రవి, శ్రీనివాస్, పి.బి చారి, జి. శివరామకృష్ణ,



సునీల్, గౌసియా, శోభ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ కలెక్టరేట్ :

మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా చీర్యాల లో ని ఆయన విగ్రహానికి కీసర మండల్ ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మల్కాజిగిరి :

గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఐఎన్ నగర్‌లో బాబు జగ్గివన్ రామ్ వర్ధంతి సందర్భంగా కార్పొరేటర్ మేకల సునీత రామూయాదవ్ పూల మాల వేసి నివాళు అర్పించారు.







జీపుజాత వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కాప్రా

కార్మికుల చట్టాలను అమలు చేయాలని కోరుతూ చేపడుతున్న జీపుజాత కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీపుజాత వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జె చంద్రశేఖర్ మాట్లాడారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. కార్మిక చట్టాలను అమలు చేసి కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సహాయ కార్య దర్శిలు జి. శ్రీనివాసులు, పి.గణేష్ కోశాధికారి కే .ఉన్నికృష్ణ కమిటీ సభ్యులు ఎం. చంద్రశేఖర్, కే కృష్ణ నాయక్, సీఐటీయూ సీనియర్ నాయకులు సిహెచ్ దేవి రెడ్డి, శోభ ,గౌసీయ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత : ఎమ్మెల్యే మైనంపల్లి



నవతెలంగాణ- నేరేడ్‌మెట్

అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. గురువారం ఆయన నేరేడ్ మెట్ డివిజన్ పరిధిలోని బ్యాంక్ కాలనీలో రూ. 20 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఆర్‌సీసీ పైప్‌లైన్ పనులు, అంతయ్య కాలనీ మధురా నగర్‌లో రూ. 45 లక్షలతో సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మధుర నగర్ పార్క్‌లో స్కూల్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మానవాళి మనుగడకు మొక్కలను నాటి పచ్చదనం పెంపొందించడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ,మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, డీఈ మహేష్,ఏఈ సృజన, నాయకులు ఉపేందర్ రెడ్డి,ఎస్ ఆర్ ప్రసాద్, కుమార్,పిట్ల శ్రీనివాస్, చెన్నా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,శివ,రాజు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మరకత శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అల్వాల్ పట్టణ పరిధిలోని కానాజీగూడలోని మరకత శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో గురువారం సంకటహర చతుర్థి పురస్కరించుకొని స్వామివారికి ఆలయ నిర్వాహకులు వ్యవస్థాపకులు మోత్కూరు సత్యనా రాయణ శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాత సేవ, 32 ఔషధీకృత ద్రవ్యాలతో విశేష అభిషేకము, మోదకంలో తేనే, మల్లె తామర పువ్వులతో లక్ష్మీ గణపతి మూల మంత్రము, శ్రీ మహాలక్ష్మి హెూమము తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులకు ప్రసాదాలు అందజేశారు. తదనంతరం



అన్నప్రసాద వితరణ గావించారు.ఈ కార్యక్రమంలో ఆరంజ్యోతి గీతా, ప్రియా తదితరులు పాల్గొన్నారు

సంక్షేమంలో రాష్ట్రం ముందు వరుసలో ఉంది



నవతెలంగాణ-మల్కాజిగిరి

సంక్షేమంలో రాష్ట్రం ముందు వరుసలో ఉందని స్థానిక శాసన సభ్యులు మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ పరిధిలోని అనంత సరస్వతి నగర్‌లో రూ.96 లక్షలతో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, డివిజన్ అధ్యక్షుడు సత్యమూర్తి, సతీష్ కుమార్, పిట్ల శ్రీనివాస్, బాబు, సత్యనారాయణ,సంపత్ రావు, ఉమపతి, బ్రమ్మయ్య సంతోష్ రాందాస్, మోహన్ రెడ్డి,రఘు యాదవ్, కిషోర్, కాలనీ అధ్యక్షుడు సిక్క ప్రభాకర్ గౌడ్, జనరల్ సెక్రటరీ యాదగిరి,ఇంద్రసేన రెడ్డి,సత్తయ్య గౌడ్,ఐనార్ కుమార్, హరీష్, పెంటయ్య డివిజన్ అధ్యక్షుడు సత్యమూర్తి ,ఉమాపతి, చేగురి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం సీఈవోను కలిసిన రాజశేఖర్ రెడ్డి



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వార్డుల్లోని సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ కంటోన్మెంట్ అసెంబ్లీ, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్‌ను కలిశారు. బోర్డ్ మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వరరెడ్డి, మాజీ సభ్యులు లోకనదం, నళినీ కిరణ్‌లతో కలిసి కంటోన్మెంట్ పరిధిలోని చిన్నకామెల, సెంట్రల్ బ్యాటరీ, రసూలుపుర, బలంరాయి, రిసాల బజార్, ప్రోగ్రాసివ్ కాలనీ, నాలా, డ్రయినేజీ, పాఠశాలలు రోడ్ మరమ్మతులు చేయాలని కోరారు. సమస్యలపై చర్చించి సత్వర పరిష్కారాకి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పెద్దల నరసింహా, శ్రీకాంత్, సురేష్, పాల్గొన్నారు.

డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

నవతెలంగాణ-జవహర్‌నగర్



జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోనే 9వ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ శారదా మనోధర్ రెడ్డి అన్నారు. గురువారం 9వ డివిజన్‌లో సీసీ రోడ్డు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రా క్టర్‌కు సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు ఉన్నారు.

వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్

నవతెలంగాణ: కాప్రా

వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ సూచించారు. కాప్రా డివిజన్ పరిధిలో గురువారం కాప్రా శ్రీ శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో చిన్నపాటి వర్షానికి రోడ్లు అధ్వాన్నంగా మారుతున్నాయని సమస్యలను కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి, చంద్రమౌళి , భాస్కర్‌రెడ్డి కార్పొరేటర్ స్వర్ణరాజ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సమస్యలు వెంటనే పరిష్కారించాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీ నేతలు శంకర్రావు, ఇంద్రారెడ్డి ,సుభాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహాకాళి దేవస్థానం సందర్భంగా ఆషాడ బోనాల జాతర సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేస్తున్న క్యూలైన్ల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ శ్రీనివాస్ గౌడ్. క్యూ లైన్ పరిశీలించారు.

-నవతెలంగాణ బేగంపేట

బాలుర ఉన్నత పాఠశాల నిర్మించాలని వినతి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల కోసం, పాఠశాలల అభివృద్ధి కోసం, నియోజకవర్గ కార్పొరేటర్లతో కలిసి, జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మూసాపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు (బాలుర) నూతన భవనాన్ని నిర్మించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్‌కు మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ వినతిపత్రం సమర్పించారు. మూసాపేట్ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉందని, ప్రస్తుతం ఉన్న పాఠశాల భవనం ఏ మాత్రం సరిపోవడం లేదని, ఇరుకు గదుల్లో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నరన్నారు. దాని వల్ల విద్యార్థులు చదువు మీద దృష్టి కేంద్రీకరించలేక పోతున్నారని వివరించారు.

మదర్సా సంస్థ అనాధలకు ఉచిత క్షవర సేవలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సనత్ నగర్‌లోని " మదర్సా అనాథాశ్రమం " లో గురువారం బంగారు తెలంగాణ సంకల్ప శక్తి సేవాసమితి స్థాపకులు షాపూర్ నగర్ పంబి శ్రీనివాస్ సేవా దక్పథంతో, ఆయన ఆధ్వర్యంలో 64వ సేవా కార్యక్రమంలో భాగంగా 30 మందికి అనాధలకు ఉచిత క్షవర సేవలు చేయడం జరిగింది. ముఖ్య అతిథిగా సనత్ నగర్ సీఐ బాలరాజు విచ్చేసి మాట్లాడుతూ మానవతా ధృక్పథంతో అనాధలకు సేవ చేయడం సాక్షాత్తు భగవంతునికి సేవ చేయడం లాంటిదని, సంస్థ స్థాపకులు పంబి శ్రీనివాస్ ఆయన కుమారులు నవీన్ , గణేష్, విష్ణు, ప్రవీణ్‌లు తమ విలువైన సమయాన్ని అనాధలకు సేవ చేయడానికి వెచ్చించడం సంతోషంగా ఉందని వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐతో పాటు ఇతర సిబ్బంది, సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

ధ్రువ పత్రాల జారీలో అధికారుల నిర్లక్ష్యం..!

- రేపు రా ఎల్లుండి రా అంటూ సిబ్బంది నిర్లక్ష్యపు సమాధానం
- నెలల తరబడి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- అసహనం వ్యక్తం చేస్తున్న దరఖాస్తుదారులు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలు దళారులకు అడ్డాలుగా మారాయి. కొన్ని కార్యాలయాల్లో కాసుల వర్షం కురిపిస్తుండడంతో అధికారులు, సిబ్బంది, దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని సర్వత్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. దరఖాస్తుదారులు కార్యాలయానికి వెళ్తే ఏదో ఒక కుంటి సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ (తహసిల్దార్) కార్యాలయంలో అధికారుల, సిబ్బంది పనితీరు పై దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మీసేవ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తరువాత వారం రోజుల్లో ధ్రువపత్రాలు వస్తాయని ఆశగా ఎదురు చూస్తున్న వారికి నిరాశే ఎదురవుతుంది. దరఖాస్తు చేసుకున్న తర్వాత మండల కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు కొట్టినా నిర్లక్ష్యంతో సమాధానం ఇస్తున్నారని పలువురు దరఖాస్తుదారులు నవ తెలంగాణతో వాపోయారు. కుల, నివాస, ఆదాయ ఇతరత్రా ధ్రువ పత్రా లు దరఖాస్తులు చేసుకొని నెలలు గడుస్తున్నా ఏ ఒక్కరు పట్టించుకున్న పాపాన పోవడం లేదని దరఖాస్తు దారుడు, విద్యార్థులు అధికారుల, సిబ్బంది పని తీరుపై మండిపడుతున్నారు. ఇక దళారుల విషయమైతే ఆడింది ఆటగా పాడింది పాటగా మారిందని.. వారి మాటే శాసనంగా భావిస్తూ చేతివాటానికి అలవాటు పడ్డ సిబ్బంది రేపు రా.. ఎల్లుండి రా.. సార్ లేడు.. సంతకాలు కాలేదు అంటూ విసుక్కుంటూ సమాధానమిస్తారని పలువురు అసహనం వ్యక్తం చేశారు. చదువుల కోసం విద్యార్థులు ధ్రువపత్రాలు సరైన సమయంలో అందకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని కళాశాలలో, పాఠశాలల్లో ఒత్తిడి చేస్తున్నారని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు పాల కులు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల, సిబ్బంది, పనితీరు ఎంతో మెరుగుపడ్డదని స్టేజీల మీద నేతలు ఉపన్యాసాలు ఇవ్వడం విడ్డూరంగా, హాస్యస్పదంగా ఉందని పెదవి విరుస్తున్నారు. ధ్రువపత్రాల విషయమై దరఖాస్తుదారుడు ఓ అధికారిని అడగగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని దరఖాస్తుదారుడు వాపోయారు. ఎమ్మార్వో కార్యాలయంలో గంటల తరబడి వేచి చూస్తున్న తర్వాత రేపు రండి.. సార్ లేడు.. కాలేదు అని సిబ్బంది విసుక్కుంటున్నారని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికా రుల, సిబ్బంది పనితీరు మెరుగుపడాలని భావిస్తున్నారు. అప్పుడే ప్రభుత్వ కార్యాలయాల పై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందన్నారు.

దరఖాస్తుదారులకు మెరుగైన సేవలు అందిస్తాం



ఆదాయ, నివాస, కుల ధ్రువపత్రాల దరఖాస్తుదారులకు దరఖాస్తు చేసుకున్న వారం, పది రోజుల్లోపు ధ్రువపత్రాలు మీ సేవ లో తీసుకునే విధంగా చూస్తున్నాం. ఈ నాలుగైదు నెలల కాలంలో సూరారం ప్రాంతంలో గల మండల కార్యాలయం శాశ్వత నూతన భవన సముదాయం దేవేందర్ నగర్ వేరే ప్రాంతానికి మార్చడం చేత ధ్రువ పత్రాల జారి ఆలస్యమైన విషయం వాస్తవమే. ఈ సందర్భాల్లో సాంకేతిక లోపాల తో పాటు కంప్యూటర్ సర్వర్ డౌన్ కారణంగా మాకు కూడా పని చేయడంలో కూడా ఇబ్బంది అయింది. ఇప్పుడు అలా కాకుండా ధ్రువపత్రాలు, అందజేస్తాం. దరఖాస్తు దారులకు మెరుగైన సేవలు అందిస్తాం.

\- తహసీల్దార్ సంజీవరావు

సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌తో ఎమ్మెల్యే సమావేశం



నవతెలంగాణ-కూకట్‌పల్లి/కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్‌ను కలెక్టర్ కార్యాలయంలో నియోజకవర్గ కార్పొరేటర్లుతో కలిసి నియోజకవర్గ పరిధిలోని అన్ని సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వ హించారు. ముందుగా డివిజన్‌ల వారీగా ప్రభుత్వ పాఠశా లల అభివృద్ధి, పాఠశాలలకు ప్రభుత్వ స్థలాల కేటాయింపు, భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాలపై సమీక్ష నిర్వ హించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని మూసా పేట్, అల్లాపూర్, బోయిన్‌పల్లి డివిజన్‌లలో ఖాళీ స్థలాల్లో ప్రభుత్వ పాఠశాలలకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. తన సొంత నిధులతో, సీఎస్ఆర్ నిధులతో భవనాలు నిర్మించేందుకు అనుమతులు మంజూరు చేయవలసిందిగా కలెక్టర్‌ను కోరారు. అదే విధంగా బాలాజీ నగర్ డి విజన్ సేవాలాల్ నగర్‌కు చెందిన నిరుపేదల ఇండ్ల క్రమబ ద్ధీకరణ విషయమై చర్చించారు. అలాగే బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్ పేటలోని కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించవలసిందిగా ఈ సమావేశంలో తెలిపారు. కూకట్‌పల్లిలోని భూదాన్ భూములలో ఇండ్ల పట్టాలిస్తామని నిరుపేదలను మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సుమారు 2గం॥ పాటూ సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో కూకట్‌పల్లి ని యోజకవర్గంకు సంబంధించి అన్ని పెండింగ్ పనులు వివ రాలపై చర్చించారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డిఈఓ. విజయకుమారి, ఎం ఈఓ ఆంజనేయులు, ఎం ఆర్ఓ. గోవర్ధన్, నియోజకవర్గ కార్పొరేటర్లు, ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ, సబి యా గౌసుద్దీన్, పగుడాల శిరీష బాబురావు, పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్ర పటానికి ఎమ్మెల్యే పాలాభిషేకం

- వైద్య కళాశాల మంజూరు చేయడం పట్ల సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరు చేసినందుకు గురువారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్ చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పెద్ద ఎత్తున సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో దేశ వైద్య రంగంలో తెలంగాణ రాష్ట్రం చరిత్ర సృష్టించనుందని అన్నారు. విజనరీ లీడర్ కేసీఆర్ ముందుచూపుతో అన్ని జిల్లాల్లో, ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉన్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలువబోతున్నదని స్పష్టం చేశారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు సంబంధించిన వైద్య కళాశాలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్నందుకు ప్రజల తరపున సీఎం కేసీఆర్‌కి ఎమ్మెల్యే హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైద్య కళాశాల ఏర్పాటుతో జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు ఎంతో సౌకర్యవంతంగా ఉండనుందని అన్నారు. ప్రత్యేక జీవో నెంబర్ 87 ద్వారా 100 ఎంబీబీఎస్ సీట్ల సామర్థ్యం గల వైద్య కళాశాలను మంజూరు చేసినందుకు ఈ ప్రాంత ప్రజలంతా సీఎం కేసీఆర్‌కి రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మున్సిపాలిటీల అధ్యక్షులు, కార్యదర్శులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలను సవరించాలి



- సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్

నవతెలంగాణ-బాలానగర్

షెడ్యూల్డ్ ఎంప్లా యిమెంట్స్‌లో కనీస వేతనాలను సవరించాలని ఈ నెల 4 నుండి 13 వరకు తలపెట్టిన జీపు జాతా పోస్టర్లను గురువారం బాలానగర్ పారిశ్రామిక ప్రాంత కార్మికులు ఆవిష్కరిం చారు. సీఐటీయు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 73 షెడ్యూల్డ్ ఎంప్లాయి మెంట్స్‌లో కనీస వేతనాలను వెంటనే సవరించాలని, కనీస వేతనం రూపాయలు రూ. 26000లు నిర్ణయించాలని అ న్నారు. రోజుకు 8 గంటలు వారానికి 5 రోజులు పని దినా లు ఉండాలని, కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ధ సౌకర్యాలైన పీఎఫ్, ఈఎస్ఐ సెలవులు, బోనస్, గ్రాడ్యుటీ వంటి సౌక ర్యాలను అమలు చేయాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను ఉపసంహరిం చుకోవాలని డిమాండ్‌లతో జీపు జాతా నడుస్తోందని, ఈనెల 12న బాలానగర్ పారిశ్రామిక ప్రాంతానికి చేరుకుంటు దని, కార్మికులందరూ జీపు జాతా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులను కట్టు బానిసలుగా చూస్తూ కార్మిక చట్టాలను పట్టించుకోవడం లేదన్నారు. నేటికీ కొన్ని పరిశ్రమలలో కార్మికులకు ఈఎస్ఐ కూడా లేనివి అనేకంగా ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు ఏమి పట్టనట్లు వ్యవరిస్తున్నారని, తక్షణమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలన్నారు. కార్మిక చట్టాలను అమలు చేయాలని కరపత్రాలు ఇస్తే, యాజమాన్యాలు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని లేబర్ కమిషనర్‌ను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమిత్ కేపాసీటర్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మల్లేష్, కార్మికులు శ్రీనివాస్, లక్ష్మీ, వనిత, సబిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రజలకు హామీ ఇచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ని తన నివాసం వద్ద కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతి పత్రాలు, ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకొస్తే, నిత్యం అందుబాటులో ఉంటూ పరిష్కారం కోసం పని చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అధికారులు వెనువెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచనలు ఇచ్చారు.

డా.బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

డా.బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపి వివేకానంద్ గురువారం చింతల్‌లోని తన కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా, సమతావాదిగా, తన పాలనా దక్షతతో దేశానికి విశేష సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు

దేశంలో కులవృత్తులను ప్రోత్సహిస్తున్న నెంబర్ వన్ సీఎం కేసీఆర్



- మంత్రి చామకూర మల్లారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్

దేశంలో కుల వృత్తులను ప్రోత్సహిస్తున్న నెంబర్ వన్ సీఎం కేసిఆర్ అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వ ర్యంలో మేడ్చల్ మండలంలోని గౌడవెల్లి గ్రామంలో 15 మంది లబ్ధిదారులకు 15యూనిట్ల గొర్రెపిల్లలను మంత్రి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టారని అన్నారు.కులవత్తులను ప్రోత్సహించి ఆర్థిక స్వలంబన జరిగే విధంగా కృషి చేస్తున్నారని తెలిపారు. పొరుగు రాష్ట్రాల నుంచి గొర్రెల మేకల దిగుమతిని తగ్గించే చర్యలో భాగంగానే గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని చెప్పారు. అనంతరం యాదవులు గొంగడి కప్పి సన్మానించి గొర్రె పిల్లను అందజేశారు. ఈ సందర్భంగా కొద్దిసేపు మంత్రి గొర్రెలను మేకలను కాసి గ్రామస్తులను హుషారు ఎత్తించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మహేందర్ రెడ్డి, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మెన్ భాస్కర్ యాదవ్, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు నందరెడ్డి, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జడ్పీటీసీ శైలజ విజయానందా రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేష్, మాజీ ఎంపీపీ జగన్ రెడ్డి, గొర్రెలు మేకల పెంపకదార్ల సంఘం జిల్లా కార్యదర్శి కొమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల గొంతుక, ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్

- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.



నవతెలంగాణ-బాలానగర్

స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్త, దేశంలో సామాజిక న్యాయ సాధనకు గొప్ప కృషి చేసిన మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 37 వ వర్ధంతి సందర్భంగా గురువారం బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, పీసీసీ సభ్యులు గొట్టిముక్కల వెంగళ్ రావు. పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాటాడుతూ నిమ్న వర్గాల నుండి ఉన్నత స్థానాలను అధిరోహించిన డా. బాబు జగ్జీవన్ రామ్ ఎంతో మందికి ఆదర్శ ప్రాయులని, జగ్జీవన్ రామ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాల న్నారు. బీహార్‌లో వెనుక బడిన వర్గాల నుంచి వచ్చిన ఆయన బాబూజీగా పేరు పొందారన్నారు. సర్గీయ బాబు జగ్జీవన్ రామ్ సేవలు భారత దేశంలోని బడుగు బలహీన వర్గాలు ఎన్నటికీ మరువలేవన్నారు. అతను భారత జాతీయ కాంగ్రెస్ సభ్యుడిగా 40సం॥ పైగా వివిధ శాఖల్లో క్యాబినెట్ మంత్రిగా పనిచేశారని, భారత దేశంలో సుదీర్ఘకాలం క్యాబినెట్ మంత్రిగా ఉన్న రికార్డు అతని సొంతమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు పి. నాగిరెడ్డి, శామ్యూల్, గోపిశెట్టి రాఘవేందర్, బండారి నవీన్ గౌడ్, బాలానగర్ డివిజన్ అధ్యక్షులు మధు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట

- కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు

నవతెలంగాణ- కేపీహెచ్‌బీ



హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీనివాస కాలనీలో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో, కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. నాణ్యత విషయంలో ఎకడా రాజీ పడకూడదని, ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు డీఈ గోవర్ధన్, ఏఈ రాజీవ్, వర్క్ ఇన్స్పెక్టర్ మహాదేవ్, డివిజన్ గౌరవ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీ వాసులు రమేష్, నవీన్, ధర్మారెడ్డి, దీలిప్, తదితరులు పాల్గొన్నారు

సీసీ, బీటి రోడ్లకు ప్రభుత్వ విప్ శంకుస్థాపన



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో రూ.3 కోట్ల, 48 లక్షలతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్లు, బ్లాక్ టాప్ రోడ్ల నిర్మాణం పనులకు అరికెపూడి గాంధీ, శంకుస్థాపన చేశారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని విజయ నగర్ కాలనీ, హెచ్‌ఎమ్‌టీ, శాతవాహన నగర్, మహంకాళి నగర్, పీజేఆర్ నగర్, దత్తాత్రేయ కాలనీ, మొగులమ్మ బస్తీ, భూదేవి హిల్స్ కాలనీలలో రూ.3 కోట్ల 48 లక్షల అంచనావ్యయంతో, చెపట్టబోతున్నారు. సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, బీటి రోడ్ల నిర్మాణం పనులకు, కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగరావులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రభుత్వ విప్, ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృదికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ మార్గదర్శకంలో, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో, శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానని పేర్కొన్నారు. అదేవిధంగా ఆల్విన్ కాలనీ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, బీటి రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాల సంతోషకరం అని తెలిపారు. సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదన్నారు. అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గాంధీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డ్ మెంబర్లు, ఏరియా కమిటీ మెంబర్లు, ఉద్యమకారులు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కాలనీ వాసులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జీఓ 58 కింద భూమి క్రమబద్ధీకరించాలని కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, అధ్యక్షతన జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్‌తో గురువారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కార్పొరేటర్లు పాల్గొని స్థానికంగా ఉన్న సమస్యలను కలెక్టర్‌కు వివరించి, వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ స్థానికంగా ఉన్న పలువురు పేదలు ప్రభుత్వం ఇచ్చిన జీఓ 58 కింద లబ్దిదారులుగా దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ కు వివరించారు. గతంలో ఉన్న కలెక్టర్ హరీష్‌కు ఆ స్థలాలు ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆధీనంలో ఉన్నందున క్రమబద్ధీకరణకు బ్రేక్ పడిందని తెలిపారు. ప్రస్తుతం ఎయిర్ పోర్ట్ అథారిటీ వారు తమ హద్దులను క్షుణ్ణంగా నిర్ధారించారని, ఆ భూమి ఎయిర్ పోర్ట్ అథారిటీకి సంబంధించింది కానందున, జీఓ 58 ప్రకారం లబ్దిదారులకు భూమిని క్రమబద్ధీక రణ చేసి కన్వేయన్స్ డీడ్ జారీ చేయాలని కలెక్టర్ ను కార్పొరేటర్ సతీష్ గౌడ్ కోరారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ వెంటనే స్థానిక ఎమ్మార్వోకు సర్వే చేసి నివేదిక సమర్పించాలని ఆదేశాలను జారీ చేశారని కార్పొరేటర్ తెలిపారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలచే ఎన్నుకోబడి, పేదల కొరకు పనిచేసే ప్రభుత్వమని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నిరంతరం పేదల అభ్యునతికై అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

- సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్

నవతెలంగాణ-మేడ్చల్



గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30ఏండ్ల నుండి గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులు రూ. 8 వేల వేతనంతో ఎట్లా బతకాలని ప్రశ్నించారు. అత్యంత నిరుపేదలు అట్టడుగు కులాలకు చెందిన వారు కాబట్టే ప్రభుత్వాలు వీరిని మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ఏండ్ల నుండి వెట్టిచాకిరి చేయిస్తూ జీతాలు పెంచడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే ఉద్యోగం నుంచి తీసేస్తామని సర్పంచులు, అధికారులు బెదిరించడం సరికాదని చెప్పారు. తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా రోడ్లను శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాలను కాపాడే మొదటి వైద్యులు వీరేనని కొనియాడారు. 11వ పీఆర్సీ ప్రకారం రూ.19,500 వారాంతపు సెలవు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీసీ జిల్లా నాయకులు జయచంద్ర, కార్మికులు సుధాకర్, రామ చందర్, లక్ష్మణ్, రాజు, బాబు, లీలమ్మ, పద్మ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కో ఆప్షన్ సభ్యులతో మేయర్ సమీక్ష



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి అధ్యక్షతన గురువారం కమిషనర్ రామకృష్ణ రావు, ఎస్ఈ. సత్యనారాయణ, అధికారులతో కలిసి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మీటింగ్ హాల్‌లో, బాచుపల్లి ప్రాంత కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారి వారి డివిజన్ల పరిధిలో పలు కాలనీలు, బస్తీలు, రెసిడెన్షియల్ పరిసర ప్రాంతాలలో నెల కొన్న పలు సమస్యలు వాటి పరిష్కారం, కావాల్సిన మౌలిక సదుపాయాలు, వర్షా కాలం దృష్ట్యా ప్రజలు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. బోనాల నిర్వహణ, వంటి పలు కీలక ప్రధాన అంశాలపై గౌరవ ప్రజాప్రతినిధుల సలహాలు సూచనలతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో బాచుపల్లి ప్రాంత గౌరవ కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఎస్ఎంసీ ఆయా విభాగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైపు తెలంగాణ ప్రజానీకం : భీమిడి జైపాల్ రెడ్డి

- తూంకుంట మున్సిపల్ 3,4వార్డుల్లో కాంగ్రెస్ నూతన కమిటీల ఎన్నిక



నవతెలంగాణ-శామీర్‌పేట

తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ప్రజానీకం కాంగ్రెస్ వైపు చూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ తూంకుంట మున్సిపాలిటీ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి అన్నారు. తుంకుంట మున్సిపాలిటీ కేంద్రంలోని పరిధిలోని 3, 4 వార్డులలో బుధవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డులలో కమిటీలను ఎన్నుకున్నారు. తూంకుంట 3 వ వార్డు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా పారంది మధు, ఉపాధ్యక్షులుగా మంచాల గణేష్, ప్రధాన కార్యదర్శిగా పారంది మనోజ్, కార్యదర్శిగా పారంది:నర్సింగ్, కోశాధికారిగా:కొరివి బాలరాజ్, 3 వ వార్డు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా కుత్బుల్లాపూర్ మహేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా కత్తి ఎల్లేష్, తూంకుంట 4 వ వార్డు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా కత్తి మహేష్, ఉపాధ్యక్షులుగా చీరాల రాజేష్, ప్రధాన కార్యదర్శిగా కత్తి దుర్గ ప్రసాద్, కార్యదర్శిగా కామాటి పోచయ్య, కోశాధికారిగా చీరాల సాయికుమార్, 4 వ వార్డు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా కత్తి శంకర్, ఓబీసీ సెల్ అధ్యక్షులుగా పాముల ఆగేష్ యాదవ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా చీరాల సత్యమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ ఉపాధ్యక్షుడు చీరాల యాదగిరి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాణాల జనార్ధన్ రెడ్డి, అల్వాల్ సొసైటీ మాజీ డైరెక్టర్ మొగుళ్ళ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వలందాస్ మురళి గౌడ్, కార్యదర్శి తిగుళ్ల మురళి గౌడ్, కిసాన్ సెల్ అధ్యక్షులు పిన్నింటి ధర్మారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు నానిగళ్ళ హరిగోపాల్, ఉప్పరపల్లి 2 వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గురిజాల బాబు, హకీంపేట్ 9 వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తలగామ జగన్, ప్రధాన కార్యదర్శి నక్క మల్లేష్ గౌడ్, కార్యదర్శి పాండు,యూత్ కాంగ్రెస్ నాయకులు చింతల మణిదీప్ రెడ్డి, ఎల్లెంకి గౌతమ్ గౌడ్, దండోత్కర్ మహేష్, గార్లు తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ముఖ్యమంత్రి, కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరు కావడంతో గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ నేతృత్వంలో నిర్వహించిన ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం కార్యక్రమానికి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి , సుధాకర్ . కిరణ్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-దుండిగల్

హైదరాబాద్‌ను విశ్వ నగరంగా అందించేందుకు సీఎం కృషి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ- కేపీహెచ్‌బీ

భవిష్యత్తులో మంచి నీరు, వరద నీరుకు సంబంధించి ఎక్కడా ఇబ్బందులు కలగకుండా పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేశామని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం బాలాజీ నగర్ డివిజన్ పరిధిలోని రూ.80 లక్షలతో వాటర్ పైపులైన్ నిర్మాణం కోసం ఆయ నతో పాటు స్థానిక కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు లు పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూగర్భ పైప్లైన్లు నిర్మిస్తూ వస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ భవిష్యత్ తరాలకు హైదరాబాద్ మహా నగరాన్ని విశ్వ నగరంగా అందించేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు హైదరాబాద్ మహా నగరాన్ని ఎంచుకోవడం మనకు గర్వకారణం అని అన్నారు. నేడు భాగ్యనగరంలో మౌలిక సదుపాయాలకు సంబంధించి ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేవని అందుకే ప్రపంచం చూపు భాగ్యనగరం పై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, ఈఈ సత్యనారాయణ, డిఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణ తరగతులు ప్రారంభం

నవతెలంగాణ-బంజారాహిల్స్



ఖైరతాబాద్ నియోజకవర్గంలోని రామకృష్ణ నగర్ (ఎర్ర మంజిల్)లో నూతన సామాజిక భవనాన్ని, అందులో తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ వారు ఏర్పాటు చేసిన టైలరింగ్, బ్యూటీషియన్ తదితర శిక్షణ తరగతులను స్థానిక మహిళలతో కలిసి కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి విజయ రెడ్డి గురువారం ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మురళి, శ్యాం కుమార్, శ్రీధర్, ఇమామ్, అర్జున్, ఫజల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వీసీని బెదిరించిన వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వీసీని బెదిరించిన ఓ వ్యక్తిని సుల్తాన్ బజార్ పోలీసులు అరెస్టు చేశారు గురువారం ఎస్సై మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం..జులై 1వ తేదీన తనకు తాను సేవా కార్యక్రమాలు ఉచిత విద్య, స్కాలర్ షిప్ లను అందిస్తున్నట్టు వీసీ విజ్జులతకు గడ్డం శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. అనంతరం ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో తాను ఓ పార్టీ ఎమ్మెల్యే గా పోటీ చేస్తున్నానంటూ హెచ్చరించాడు. దీంతో గడ్డం శ్రీనివాస్ యాదవ్ పై వీసీ విజ్జులత తన విధులకు ఆటంకం కలిగించారంటూ సుల్తాన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు .దీంతో విచారణ అనంతరం పోలీసులు శ్రీనివాస్ యాదవ్ ను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపర్చారు.



తెలంగాణలో రవాణా విధానాలు విన్నూతం

- ఆన్‌లైన్ సర్వీసులు, క్యాష్‌లెస్ సేవలు ఆచరణీయం
- ఖైరతాబాద్, నాగోల్ ట్రాక్‌ను పరిశీలించిన బీహార్ ఎంవీఐ బృందం

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో అమల్లో ఉన్న ఆన్‌లైన్ సర్వీసులు, క్యాష్‌లెస్ విధానాలు విన్నూతంగా ఉన్నాయని బీహార్ రాష్ట్ర రవాణాశాఖకు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ల(ఎంవీఐల) బృందం అభిప్రాయపడింది. తెలంగాణ రాష్ట్ర పర్యటనలో ఉన్న 70 మంది యువ రవాణశాఖ అధికారులు గురువారం ఖైరతాబాద్‌లో రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్, ఆర్టీవో కార్యాలయాన్ని సందర్శించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆన్‌లైన్ సేవలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం రవాణా సేవలను ప్రజలకు సులభతరం చేయడంతో పాటు పూర్తి పారదర్శకంగా అందిస్తోందని ఖైరతాబాద్ ఆర్టీవో ఎల్.రాంచందర్ అధికారులకు వివరించారు.

నాగోల్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ సందర్శన

తెలంగాణ రాష్ట్ర పర్యటనలో ఉన్న బీహార్ రవాణాశాఖకు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ అధికారులు తమ పర్యటనలో భాగంగా నాగోల్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ విభాగాన్ని పరిశీలించారు. డ్రైవింగ్ టెస్ట్‌లు ఎలా నిర్వహిస్తారు. ట్రాక్‌ల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ విధానాలను ఎలా పరిశీలించి.. లైసెన్స్‌లు జారీ చేయాలని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు జారీ, వాటికి గల ప్రమాణాలు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల్ జారీకి కచ్చితమైన విధానాలు అమలులో ఉన్నాయని ఈ సందర్భంగా నాగోల్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ ఆర్టీవో జి.సురేష్ రెడ్డి వారికి చెప్పారు. ఇక్కడ వివిధ రకాల లైసెన్స్‌ల జారీకి చేపడుతున్న కార్యక్రమాలనూ వారికి వివరించారు. డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్డీ సంస్థ సౌజన్యంతో అధికారులు రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా డాక్టర్ పెదబోయిన శ్రీనివాస్, శ్రీనివాస్ వడ్ల వ్యవహరించారు.



అక్షర సముద్రంలో ఇనాక్ సాహిత్యం పర్వతం

- గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ ఆయాచితం శ్రీధర్

నవతెలంగాణ-కల్చరల్

అక్షర సముద్రంలో ఇనాక్ సాహిత్యం పర్వతంలా నిలుస్తుందని గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ ఆయాచితం శ్రీధర్ అన్నారు. ఆయన సాహిత్యాన్ని అర్థం చేసుకొనేందుకు లోతైన అధ్యాయనం తో పాటు సామాజిక పరిస్థితులు పట్ల అవగాహన కావాలని పేర్కొన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణ లో జరుగుతున్న శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహం లోభాగంగా ఆయన రచించిన పోలి కథానిక సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆయాచితం శ్రీధర్ పాల్గొని సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. ఇనాక్ సాహిత్య ప్రక్రియలన్నీ వేదన ఆవేదన లోంచి వచ్చినవేనన్నారు. తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నలేశ్వరం శంకరం మాట్లాడుతూ దళిత ఉద్యమానికి సాహిత్యం లో తొలి బాటలు వేసిన ఇనాక్ తాను దళితుడిని అన్న ఆత్మన్యూనతా భావం వద్దు అంటారని, పరిస్థితులను అనుకూలం గా మార్చు కోవాలని అంటారని వివ రించారు. పిల్లలమర్రి రాం,ఆచార్య గొనా నాయక్ లు ఇనాక్ తమ గురువుగా విశ్వవిద్యాలయం లో ఆయన బోధన విన్నామని తెలిపారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో టి. ఎస్. బి సి.ఎల్ పూర్వ చైర్మెన్ దేవీప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమానికి తొలుత సంగీత గురువు శివ పార్వతి శిష్యులు సాధన, నిరీక్ష, శివ కేశవ్,నితిన్ తదితరులు అన్నమయ్య కీర్తనలను మధురం గా అలపించారు

ఐబీపీఎస్‌లో సిబిల్ స్కోర్ విధానాన్ని తొలగించాలి : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇన్సిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్) పరీక్షల్లో పాసై.. ఉద్యోగాల భర్తీ చేసే సమయంలో సీబీల్ స్కోర్ తప్పనిసరని ఐబీపీఎస్ జులై 1న బ్యాంకు క్లర్క్ రిక్రూట్‌మెంట్ కోసం కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్‌లో పలు నిబంధనలను విధించింది. పర్సనల్ సీబీల్ స్కోర్ 650 కనీసం ఉండాలని షరతు విధించింది. ఈ నిబంధనలను భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డీవైఎఫ్ఐ) తీవ్రంగా వ్యతిరేకిస్తుందని రాష్ట్ర ఉపాధ్యక్షులు జావిద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిర్ణయంతో గ్రామీణ పేద, మధ్య తరగతి అభ్యర్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని వివరించారు. సాధారణంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు లావాదేవీలతో సంబంధాలు తక్కువ ఉంటాయని, సీబీల్ స్కోర్ సైతం తక్కువ ఉండే అవకాశం ఉందని చెప్పారు. ఎక్కువ సంఖ్యలో పేద గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఐబీపీఎస్ పరీక్ష రాస్తుంటారని, ఆ అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు దూరం చేకూర్చే నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. కేవలం ధనిక, వ్యాపార, మధ్యతరగతి లాంటి అభ్యర్థులకు లాభం చేకూర్చే విధంగా ఐబీపీఎస్ నిర్ణయం ఉందని అన్నారు. వెంటనే సీబీల్ స్కోర్, విద్యా రుణాలు విధానాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో డీవైఎఫ్ఐ ఆందోళన కార్యక్రమాలు చేస్తుందని హెచ్చరించారు.

'మలబార్‌లో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువెలరీ షో'

నవతెలంగాణ-హిమాయత్ నగర్



మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ హిమాయత్ నగర్ షోరూంలో గురువారం 'ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువెలరీ షో'ను ప్రముఖ మోడల్స్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హిమాయత్ నగర్ స్టోర్ హెడ్ మహమ్మద్ నయీమ్ మాట్లాడుతూ..ఈ జ్యువెలరీ షోలో భాగంగా బంగారం, వజ్రాభరణాలు, జాతి రత్నభరణాలను ప్రదర్శిస్తుందన్నారు. ఈ ఆభరణాలు అద్వితీయమైన కళా నైపుణ్యతతో అంతులేని హుందాతనంతో కూడినవని చెప్పారు. వివాహం, పార్టీ సంబరాల కోసం, చిన్నారుల కోసం, పిల్లల ఆభర ణాల సమహారం వంటివి ఈ ప్రదర్శన సమకూర్చబడ్డాయని తెలిపారు.22 కారెట్ల పాత బంగారం మార్పిడిపై జీరో శాతం తగ్గింపు పొందవచ్చు.ఈ ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువెలరీ షో నేటి నుంచి ఈనెల 10వ తేదీ వరకు నిర్వహించ డమవుతుందన్నారు. అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగించుకోవాలన్నారు.



గోల్నాక చౌరస్తాలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అంబర్ పేట నియోజకవర్గం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పులిజాల గెలవయ్య , అర్కే బాబు శంకర్, రెడ్డపాక రాము , భూపతి లక్ష్మణ్ , మేడి ప్రసాద్ గాజుల గోపాల్,నిరంజన్ పూలే, శ్రీహరి బాలరాజ్, నరేందర్, నిమ్మల యాదగిరి, కొమ్ము వీర స్వామి, మహేష్, ముద్దం బాలరాజ్ తదితరులు. నవతెలంగాణ-అంబర్‌పేట

IN THE COURT OF PRINCIPAL DISTRICT JUDGE: MEDCHAL-MALKAJGIRI DISTRICT: AT: MALKAJGIRI.
G.W.O.P. No. 45 OF 2023

Between:
Smt.Gannu Ambika
@ Mashetty Ambika ---PETITIONER
Vs.
All Concerned. ---RESPONDENTS
To,
1. All Concerned. ---RESPONDENTS
***

Please take notice that the above named petitioner has filed the above Petition under section 8 (2) of Hindu Minority and Guardianship Act, 1956 read with section 29 of guardians and wards act seeking permission of the court to permit her to dispose off petition Schedule described Property(in which petitioner minor daughter namely Kumari Mashetty Aditi is having 1/3 share). The said G.W.O.P is posted to 25.07.2023 for your appearance.

PETITION SCHEDULE PROPERTY

All that part and parcel of premises Plot No. 28 western part and 29 Eastern Part, ad, 150 Sq. Yards, or 125.4 Sq Mtrs. In Sy.Nos.5 and 143 situated at Chengi cherla Village, Under Boduppal Muncipal corporation, Medipalli Mandal, Medchal-Malkajgiri District and bounded on:
NORTH : Plot Nos.22 &23;
SOUTH : 25 Wide Road;
EAST : Plot No.28 Eastern part;
WEST : Plot No,29 Western Part.

Therefore, make it convenient to present yourself either in person or through authorized agent before the above mentioned court at 10-30 A.M on 25.07.2023. Other wise, the matter will be decided in exparte.

(BY ORDER OF THE COURT)
P.VENKATESH
Advocates,
Plat No. 20. Road No.3,
Raji Reddy Nagar,
Hasthinapuram,
Hyderabad-500070.

IN THE COURT OF THE HON'BLE XI ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD
I.A.No. 2685 OF 2022 IN
O.S.No. 598 OF 2022

Between:
ఇంజనీరింగ్ చదివేటపుడే పావని ఎకో క్లబ్ పేరుతో స్టూడెంట్స్ ఫోరంను ఏర్పాటు చేసుకుంది. తరగతి గదిలో డస్ట్ బిన్స్ వాడాలని యాజమాన్యాన్ని కూడా అప్రమత్తం చేసింది. కాలేజీ చుట్టుపక్కల ఉన్న గ్రామాలన్నీ తిరిగి ప్లాస్టిక్, చెత్త, ఇతర వ్యర్థాల వల్ల వచ్చే నష్టాలపై అవగాహన కల్పించేది. గ్రామాలలో తన స్నేహితుల సహకారంతో అవగాహన శిబిరాలు కూడా ఏర్పరిచింది. చెత్త బుట్టలు పంపిణీ చేసింది. అయినా ప్రజల్లో చైతన్యం రాలేదు. చెత్త బుట్టల వినియోగం కూడా జరగలేదు.

చెత్తను ఎరువుగా మార్చాలని

అప్పుడు పావనిలో ఆలోచన మొదలైంది. చెత్తను సేకరించడం కన్నా చెత్తని ఎరువుగా మారిస్తే తిరిగి అది ఉపయుక్తమౌతుంది కదా! అన్న ఆలోచన తల్లితో పంచుకుంది. తల్లి ప్రోత్సహించింది. వ్యర్థాలను ఎరువుగా మార్చే యంత్రాలపై అవగాహన పెంచుకుంది. తనే స్వయంగా కంపోస్టు తయారు చేసే యూనిట్లను తయారు చేసి తోట పని చేసే వారికి ఉచితంగా అందించింది. వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకొని తిరిగి మెరుగైన యంత్ర నిర్మాణానికి పూనుకుంది. ఇంజనీరింగ్ తర్వాత ఎంబీఏ చేస్తూనే "వప్రా"





కంపోస్ట్ ఎరువులు తయారు చేసే యంత్రానికి పురుడు పోసింది. ఇది వారం రోజుల్లోనే ఆహార వ్యర్థాలను కంపోస్ట్‌గా తయారు చేస్తుంది. దీనికి స్నేహితుడు సిద్ధిష్ సహకారం తీసుకుంది. "ఫ్యూచర్ స్టెప్" ఎంటర్‌ప్రైజెస్ అనే పేరుతో కంపెనీని ప్రారంభించింది.



పాఠాలు నేర్చుకుంది

వాప్రా పేరుతో చెత్తని ఎరువుగా మార్చే యంత్రం, ఆర్గానిక్ మైక్రోబియా లిక్విడ్స్, గ్రీన్ మిక్స్ పౌడర్ తయారు చేసి మార్కెటింగ్ చేసింది. దీనిపై ప్రజల్లో అవగాహన కలిగించింది. మెల్లిమెల్లిగా వ్యాపారం ఊపందుకుంది. అయితే అనేక సంక్షోభాలు కూడా ఎదుర్కొంది. వ్యర్థాలకు సరైన జవాబు చూపకపోతే తన చదువు వృథా అనుకున్నది. అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్నది. మరింత ప్రొఫెషనలిజం కోసం వి హబ్‌ను సంప్రదించింది. ఆమె ఆలోచనలు నచ్చి ఇంక్యుబేషన్ కార్యక్రమానికి ఎంపిక చేశారు వారు. వి హబ్ ఒక మెంటర్‌ను కూడా కేటాయించింది. వారి సహకారంతో మార్కెటింగ్, సోషల్ మీడియా తదితర అంశాలపై పట్టు సాధించింది. దాంతో వ్యాపారం 14 రాష్ట్రాలకు విస్తరించింది.

మహిళలే ఎక్కువ

కంపెనీలో అత్యధిక శాతం మహిళలే పనిచేస్తున్నారు. ప్రతి మహిళ ఎంతో కొంత ఆర్థిక పరిస్థితులు కలిగి ఉండి తన కాళ్ళపై నిలబడాలన్నది పావని ఆలోచన. భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించాలన్నది ఆమె లక్ష్యం. ప్రతి ఇంటిలోని వ్యర్థపదార్థాలను రీసైకిలింగ్ చేసి కంపోస్ట్‌గా మార్చాలన్నది ఆమె కల. వాప్రాను ప్లాస్టిక్‌తో రూపొందించాలన్నది వీరి ఆశయం. ప్రతి ఒక్కరూ చెత్త బయట వేయకండి. ఆ చెత్తను రీసైకిల్ చేసి కంపోస్ట్‌గా మార్చడానికి ప్రయత్నించండి. కంపోస్టు సులువుగా చేసే ప్రక్రియ కోసం www.vapracomposting.in ని సంప్రదించండని పావని కోరుకుంటుంది.

- డాక్టర్. శారదా హన్మాండ్లు

sharadahanmandlu@gmail.com

పర్యావరణానికి మేలు చేసేవే

పావని కంపెనీ ద్వారా ఉత్పత్తి చేయబడే ప్రొడక్ట్స్ అన్ని కూడా పర్యావరణానికి మేలు కలిగించేవే. పంట చేతికొచ్చాక మిగిలిన కర్రను కాల్చకుండా నేరుగా ఎరువుగా మార్చేందుకు వాప్రా బ్రౌన్ లిక్విడ్‌ను ప్రవేశపెట్టింది. వంటింటి చెత్తను వారం రోజుల్లో కంపోస్టుగా మార్చేందుకు వాప్రా హోమ్ కంపోస్టింగ్ కిట్‌ను అందుబాటులోకి తెచ్చింది. గేటెడ్ కమ్యూనిటీ కోసం సొసైటీ కంపోస్టు మిషన్, డస్ట్ బిన్‌లోని చెత్తను ఎరువుగా మార్చే గ్రీన్ మిక్స్ పౌడర్, ఆర్గానిక్ వ్యర్థాల నుంచి తయారుచేసిన ప్లాంట్ ఫీట్ కంపోస్ట్‌ను విక్రయిస్తున్నది.



ఇవి తీసుకుంటే...

వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రుతుపవనాల రాక కాస్త ఆలస్యమవ్వడంతో నిన్న మొన్నటి వరకు వేసవి తాపం ప్రభావం చూపించింది. ప్రస్తుతం వాతావరణం కాస్త చల్లగానే ఉంది. అయితే వేడి నుండి చల్లదనానికి వాతావరణం మారడంతో శరీరంలోనూ కొన్ని మార్పులు చోటుచేసుకుంటాయి. చిన్న చిన్న ఇన్‌ఫెక్షన్‌లు శరీరంపై ప్రభావం చూపిస్తాయి. వాటి నుంచి ఉపశమనం పొందాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి. అవేంటో చూద్దాం.



- పసుపు పాలు చక్కని ఔషధం. ఇది యాంటీ బాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్‌గా పని చేస్తుంది. పసుపు పాలను తీసుకుంటే జలుబు వంటి సమస్యలు దరిచేరవు.
- ఉసిరికాయ కొందరు నేరుగా తింటే మరికొందరు జ్యూస్ చేసుకొని తాగుతారు. ఉసిరిని ఎలా తిన్నా ఆరోగ్యానికి మంచిదే. యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండడం వల్ల శీతాకాలంలో ఉసిరి ఎంతో మేలు చేస్తుంది.
- నెయ్యి తక్షణ శక్తిని అందిస్తుంది. క్రమం తప్పకుండా ఆహారంలో నెయ్యి తీసుకుంటే ఎంతో మంచిది. అయితే కొందరికి ఇందులో మినహాయింపు ఉంటుంది.
- బెల్లంలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. బెల్లం తినడం వల్ల దగ్గు, జలుబు సమస్యలు దరిచేరవు.
- చల్లని వాతావరణంలో నువ్వులు తింటే శరీరానికి లోపలి నుంచి వేడి అందుతుంది. రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది.

ఇలా చేయొద్దు...



యుక్త వయసు అమ్మాయిలంటే ఎప్పుడూ ఎంతో సంతోషంగా వుంటారు. ఈ మధ్య కాలంలో ఏదో టెన్షన్ ఫీలవుతూ, ఆందోళనగా కనిపిస్తున్నారని మానసిక నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అందుకు ముఖ్య కారణం ప్రతి చిన్న విషయాన్ని ఆలోచించడమేనని, దీని వల్ల తీవ్ర ఒత్తిడి, మానసిక ఆందోళన చెందుతున్నారని వారు స్పష్టం చేశారు. అటువంటి వారు ఆనందం, ఉత్సాహం, బాధ.. ఏది కలిగినా దాన్ని పట్టలేరని భావోద్వేగాల్ని అదుపులో ఉంచుకోలేనప్పుడు ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుందంటున్నారు.

- జీవితమన్నాక మంచీ చెడూ, ఆనందం, విషాదం వంటివి సహజమే కదా అనుకుని, వాటిని అదుపులో ఉంచుకునేందుకు ప్రయత్నం చేయాలని సూచిస్తున్నారు. సమస్య చిన్నది కావచ్చు, పెద్దది కావచ్చు, ఎవరికి వారే తీవ్రంగా ఆలోచించి, భయపడటం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదంటున్నారు. ఆందోళనతో నిర్ణయాలు తీసుకోవడం వల్ల మరిన్ని చిక్కుల్లో పడే అవకాశం ఉందని, ఆ విషయాన్ని అమ్మకో, నాన్నకో, స్నేహితురాలికో చెప్తే ఓ మంచి మార్గం దొరుకుతుందని సలహా ఇస్తున్నారు.
- కొన్ని సందర్భాలలో తెలియని ఆందోళన, ఒత్తిడి ఏర్పడుతుంది. అటువంటి సమయాల్లో మిమ్మల్ని ఎవరూ అర్థం చేసుకోవడం లేదు అనిపిస్తుంది. అయితే అది సహజమేనని గుర్తించండి. అసలు ఏం కావాలీ, ఏం కోరుకుంటున్నారన్న విషయంపై స్పష్టత తెచ్చుకోండి. అవతలి వారు మీ మాటను పట్టించుకోవడం లేదనుకోవడం కంటే మీరు ఆ విషయాన్ని వాళ్లకి అర్థమయ్యేంత బాగా చెప్పలేకపోయారని అనుకోండి. మీ మాటల్ని ఎవరూ సమర్థించకపోవడానికి ఇతర కారణాలేమైనా ఉన్నాయా అని సానుకూల దృక్పథంతో ఆలోచించండి.
- ఏ విషయంలోనైనా పోటీతత్వం ఉండాలి. కానీ అది ఆరోగ్యకరంగా ఉండాలన్న ప్రాథమిక నియమాన్ని మరిచిపోవద్దు. అవతలి వారి విజయాలను చూసినప్పుడు, వారి నుంచి ఏం నేర్చుకోవాలా అని ఆలోచించాలి. అప్పుడే ముందడుగు వేయగలుగుతారు.

జల్.. జంగల్.. జమీన్ కల సాకారం

(మొదటిపేజీ తరువాయి)

సంక్షేమంలో దేశంలోనే ముందు వరుసలో ఉందన్నారు. కొమురం భీమ్ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఆయన పేరుతో కొమురం భీమ్ జిల్లాను ఏర్పాటు చేసుకున్నామన్నారు. అదే స్ఫూర్తితో గిరిజనులకు 6శాతం ఉన్న రిజర్వేషన్లను 10శాతానికి పెంచినట్టు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలను మెరుగుపరచడంతోపాటు ఇంటింటికీ సాగునీరు, విద్య, వైద్యం చేరువ చేశామన్నారు. రాష్ట్రంలో లక్ష 50మంది గిరిజనులకు 44.6లక్షల ఎకరాలపై భూమి హక్కు పత్రాలు ఇచ్చామని, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1,614మంది రైతులకు 2,850ఎకరాలపై యాజమాన్య హక్కు పత్రాలను అందిస్తున్నట్టు వివరించారు. ఎస్సీ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. గిరిజనుల గడప గడపకూ సంక్షేమ ఫలాలను తీసుకెళ్లి అన్ని రంగాల్లో వారు ఎదిగేందుకు దోహదం చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు, పవర్‌లూమ్ టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ గూడూరి ప్రవీణ్, కలెక్టర్ అనురాగ్ జయంతి, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ చైర్మెన్ చిక్కాల రామారావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

త్వరలో ధరణి ఫైల్స్

15 తర్వాత బయటపెడతామని వెల్లడించారు.

కాంగ్రెస్ భూమి డిక్లరేషన్‌లోని కీలక అంశాలివే...

- లక్షల మంది రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ధరణిని రద్దు చేసి దీని స్థానంలో భూమి వాస్తవ పరిస్థితికి అద్దంపట్టి, తప్పులు లేని, అందరికీ అందుబాటులో ఉండే కొత్త కంప్యూటర్ రికార్డును రూపొందిస్తాం.
- ఇప్పుడున్న రికార్డు సమస్యలను అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి పరిష్కరిస్తాం.
- నిషేధిత జాబితా లో చేర్చిన పట్టా భూములను కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిన 100 రోజుల్లోగా తొలగిస్తాం.
- అన్ని రకాల భూముల సమగ్ర సర్వే చేసి కొత్త రికార్డులు రూపొందిస్తాం. వ్యవసాయ భూములకు, ఇంటి స్థలాలకు కొత్త పట్టాలు ఇస్తాం. భద్రమైన హక్కులు కల్పిస్తాం.
- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత జరిగే తొలి శాసన సభా సమావేశంలోనే కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా మేరకు టైటిల్ గ్యారంటీ చట్టం చేసి ప్రభుత్వమే భూమి హక్కులకు పూర్తి హామీ ఇచ్చే వ్యవస్థను తెస్తాం.
- వందకు పైగా ఉన్న భూచట్టాల స్థానంలో ఒకే భూమి చట్టం తెస్తాం.
- కౌలుదారులకు రుణ అర్హత కార్డులు ఇచ్చేందుకు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన అధీకత సాగుదారుల చట్టాన్ని అమలు చేస్తాం.
- కాంగ్రెస్ తెచ్చిన భూ సంస్కరణల ద్వారా ఇప్పటి వరకు పేదలకు పంచిన పాతిక లక్షల ఎకరాల భూములపై సంపూర్ణ హక్కులు కల్పిస్తాం.
- 2006లో కాంగ్రెస్ తెచ్చిన అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేసి అర్హులందరికీ పోడు భూములకు పట్టాలు ఇస్తాం.
- కేంద్రం లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తెచ్చిన భూసేకరణ చట్టాన్ని యథాతథంగా అమలు చేస్తాం. రైతుల అనుమతి లేకుండా భూములు సేకరించం. అసైన్డ్ భూములకు, పోడు భూములకు కూడా పట్టా భూములతో సమానంగా నష్ట పరిహారం చెల్లిస్తాం. ఇప్పటి వరకు అలా నష్ట పరిహారం రాని వారికి న్యాయం చేయడానికి రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యం లో కమిషన్ ఏర్పాటు చేస్తాం.
- భూపరిపాలన వ్యవస్థను బలోపేతం చేస్తాం. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు సిబ్బందిని నియమించి రైతులకు హక్కుల చిక్కులు లేకుండా చేస్తాం.
- భూ సమస్యల పరిష్కారానికి జిల్లాకొక భూమి ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తాం.

తెలంగాణ హైకోర్టు సీజేగా అలోక్ అరదే

(మొదటిపేజీ తరువాయి)

న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ , జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన కొలీజియం ఆమోదించిన తీర్మానాలను బుధవారం రాత్రి అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరదే తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ,బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ధీరాజ్ సింగ్ ఠాకూర్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియామకానికి సిఫారసు చేసింది. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్‌ను గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, గుజరాత్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆశిష్ జె దేశాయ్‌ను కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, ఒడిశా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుభాసిస్ తలపాత్రను అదే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిద్ధార్థ్ మృదుల్‌ను మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయను బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించేందుకు సిఫారసు చేశారు. వీరి నియామకానికి సంబంధించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపాల్సి ఉంది

జస్టిస్ అలోక్ అరదే నేపథ్యం

జస్టిస్ అలోక్ అరదే 1964లో అప్పటి మధ్యప్రదేశ్‌లోని రాయ్‌పూర్‌లో జన్మించారు. 1988లో జబల్‌పూర్‌లోని మధ్యప్రదేశ్ హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. 2007లో సీనియర్ న్యాయవాదిగా నియమితులయ్యారు. 2009లో అక్కడి హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

2016 సెప్టెంబర్ 16 జమ్మూకాశ్మీర్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2018 మే 11న జమ్మూ కాశ్మీర్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. 2018 నవంబర్ 17 నుంచి కర్నాటక హైకోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు. కర్నాటక హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా కూడా పనిచేశారు. తాజాగా తెలంగాణ హైకోర్టు సిజెగా జస్టిస్ అలోక్ అరదేను కొలీజియం సిఫారసు చేసింది.

జస్టిస్ ధీరజ్ సింగ్ నేపథ్యం

జమ్మూకాశ్మీర్‌కు చెందిన జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ 1964 ఏప్రిల్ 25న జన్మించారు. 1989 అక్టోబర్ 18న ఆయన బార్ కౌన్సిల్ ఆఫ్ ఢిల్లీలో, తరువాత బార్ కౌన్సిల్ ఆఫ్ జమ్ము కాశ్మీర్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 2011లో సీనియర్ న్యాయవాదిగా పదోన్నతి పొందారు. 2013 మార్చి8న జమ్మూకశ్మీర్ హైకోర్టుకు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన 2022 జూన్ 10 నుంచి ముంబాయి హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 9న జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. అయితే ఆ సిఫార్సు కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉండటంతో, దాన్ని కొలీజియం రద్దు చేసింది. తాజాగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సీజేగా జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను సిఫారసు చేసింది.

కమ్యూనిస్టులతో కయ్యం వద్దు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న భూ కబ్జాకోరులను వదిలిపెట్టి పేదలు తలదా చుకునేందుకు సర్కార్ భూముల్లో గుడిసెలేసుకుంటే...వారి పై కేసులు పెడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. పేదల పక్షాన పోరాడుతున్న కమ్యూనిస్టులతో కయ్యం వద్దనీ, అవసరమైతే పేదల కోసం మీరో మేమో తెల్చుకునేందుకు సిద్ధమని సర్కారుకు హెచ్చరించారు. హైదరాబాద్ నగరంలో 14వందల మురికి వాడలున్నాయనీ, వాటిని 'స్లమ్స్' అంటూ ఉచ్చరించటానికి ఈ సర్కారుకు సిగ్గు అనిపించటం లేదా? అని ప్రశ్నించారు. ఇండ్లు లేని వారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. 'భూదాన్ భూముల్లో గుడిసేలుసుకున్న పేదలకు పట్టాలు' ఇవ్వాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ 75ఏండ్ల స్వతంత్ర దేశంలో కోట్లాది మందికి కనీసం తలదాచుకునేందుకు చోటు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరోక్షంగా పన్నుల రూపంలో పేదలనుంచి వసూలు చేసిన డబ్బునంతా సంపన్నులకు ఖర్చు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనూ అదే పరిస్థితి ఉందని చెప్పారు. ప్రభుత్వం వాగ్దానాలు చేయటం కాదనీ, వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదల బాధలు పట్టని ప్రభుత్వం ఉంటే ఎంత?చస్తే ఎంతని మండిపడ్డారు. మునుగోడు ఉప ఎన్నికల్లో తమ మద్దతు వల్లనే ప్రభుత్వం నిలబడిందని గుర్తుచేశారు. భూదాన్ బోర్డ్ భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించే వారికి పోలీసులు మద్దతుగా నిలుస్తున్నారని, పేదలు గుడిసెలు వేసుకుంటే మాత్రం కేసులు పెడుతున్నారన్నారు. ఈ పద్ధతి మార్చుకోకపోతే.. 'మీరో మేమో తేల్చుకుంటామ'ని హెచ్చరించారు. 58 జీవో ప్రకారం ప్రతి గుడిసెకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎర్రజెండాను తక్కువ చెయ్యొద్దని సూచించారు. ప్రభుత్వం చేసే వాగ్దానాలను జీవో రూపంలో ఇవ్వాలనీ, అప్పుడే ప్రజలు విశ్వసిస్తారని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా తెలిపారు. అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామంటూ చెబుతున్న ప్రభుత్వం, మురికివాడలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మురికివాడల్లో మాత్రమే డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించారనీ, పేదల దగ్గర దళారులు డబ్బులు తీసుకొని ఇళ్లను కేటాయించారని విమర్శించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పరోక్ష పన్నుల ద్వారా ప్రజల రక్తాన్ని జలగల్లాగా పీలుస్తున్నాయన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న తమపై కేసులు పెడుతున్నారనీ, కేసులు కమ్యూనిస్టులకు కొత్త కాదన్నారు. పాలకులు మారినా ప్రజల బతుకుల్లో మార్పుల రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి.నరసింహ అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, పశ్య పద్మ, ఎన్.బాలమల్లేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

19న అఖిలపక్ష సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

జరిగే అవకాశం కనిపిస్తోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ నెల 20 నుంచి ఆగస్టు 11 వరకు జరుగుతాయి. ఈ సమావేశాల్లో యూసీసీతోపాటు మరికొన్ని కీలక బిల్లులను ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు, దేశ రాజధాని నగరం ఢిల్లీ ప్రభుత్వ సవరణ ఆర్డినెన్స్‌లను ప్రవేశపెట్టవచ్చు. యూసీసీపై జులై 3న జరిగిన పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశంలో కాంగ్రెస్, డీఎంకే పార్టీలు.. ఉమ్మడి పౌర స్మృతికి వ్యతిరేకంగా స్పష్టమైన వైఖరిని ప్రదర్శించాయి. బీజేపీ నేత, పార్లమెంటరీ ప్యానెల్ చైర్మెన్ సుశీల్ కుమార్ మోడీ మాట్లాడుతూ ఈశాన్య రాష్ట్రాలు, గిరిజన ప్రాంతాలకు దీని నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. రాజ్యాంగంలోని 6వ షెడ్యూలు, అధికరణ 371 ప్రకారం వీరికి రక్షణ ఉందని తెలిపారు. యూసీసీపై లీగల్ అఫైర్స్ డిపార్ట్‌మెంట్, లెజిస్లేటివ్ డిపార్ట్‌మెంట్, లా కమిషన్ అభిప్రాయాలను ఈ ప్యానెల్ స్వీకరించింది.

అందరూ థెరపిస్టులే

(మొదటిపేజీ తరువాయి)

సదరు మహిళకు ఒక సందేశం రావటం గమనార్హం.

మానసిక ఆరోగ్యం గురించి బహిరంగ చర్చలకు దూరంగా ఉన్న సమాజంలో థెరపీ కీలకంగా మారింది. అయితే, ఇలాంటి తరుణంలో ఆన్‌లైన్ సెషన్‌లు అతిపెద్ద వద్దిని సాధించాయి. అనేక ఫోన్ యాప్‌లు, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్, వ్యక్తిగత వెబ్‌సైట్లు, క్లినిక్‌లు వంటి వేదికలు కౌన్సెలింగ్ సేవలను అందిస్తున్నాయని నిపుణులు చెప్పారు. ప్రభావశీలురు కూడా చికిత్సకులుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇది సమాజంలోని ప్రజల ఆరోగ్యంపై దుష్పరిణామాలను చూపే అవకాశమున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

థెరపిస్టులుగా వ్యవహరిస్తున్న వ్యక్తుల టాక్ సెషన్‌లు, లిజనింగ్ లేదా లైఫ్ కోచింగ్ వంటి పదాలను ఉపయోగించే కౌన్సెలింగ్ వ్యాపారం విస్తరిస్తున్నది. మానసిక వ్యాధుల పట్ల అవగాహన పెరగడం వల్ల ఈ సేవలకు డిమాండ్ పెరిగింది. కానీ వైద్య వృత్తికి భిన్నంగా, కౌన్సెలింగ్ ఫీల్డ్ ప్రస్తుతం తాత్కాలిక ప్రమాదకరమైన దశలో ఉన్నదనీ, దీనిపై సరైన నియంత్రణ లేదని ఆరోగ్య నిపుణులు, విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. " కేవలం మాస్టర్స్ డిగ్రీ లేదా షార్ట్ బ్రిడ్జ్ కోర్సు ఉన్న దాదాపు ఎవరైనా థెరపిస్ట్‌గా మారవచ్చు. ఇది తమను తాము కౌన్సెలర్లుగా చెప్పుకునే అర్హత లేని వ్యక్తుల ప్రవేశానికి దారి తీస్తుంది" అని చెపుతున్నారు. "వ్యవస్థ చాలా విచ్ఛిన్నమైంది. సోషల్ మీడియా కారణంగా, ప్రతి వ్యక్తి థెరపిస్ట్ అని చెప్పుకుంటున్నారు. అది మరింత దారుణం. అర్హత లేని, అసమర్థ థెరపిస్ట్‌ల వద్దకు వెళ్లి ఇప్పుడు తిరిగి థెరపీకి వెళ్లాలని కోరుకోని వ్యక్తులు ఉన్నారు "అని నోయిడా, ఢిల్లీలో కేంద్రాలను నిర్వహిస్తున్న 'ఐ యామ్ వెల్‌బీయింగ్ ఆర్గనైజేషన్' వ్యవస్థాపకురాలు ఆకాంక్ష చండేలే చెప్పారు.

జీపీ కార్మికుల వల్లే అవార్డులు

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జీపీ కార్మికులు గురువారం సమ్మెలోకెళ్లారు. విధులను బహిష్కరించి ఎంపీడీవో కార్యాలయాల ఎదుట దీక్షలు ప్రారంభించారు. ఖమ్మం జిల్లా బోనకల్, ఎర్రుపాలెం మండల ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికుల దీక్షలను పాలడుగు భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల కృషి వల్లే రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక అవార్డులు పొందగలిగిందని చెప్పారు. అటువంటి కార్మికులను పర్మినెంట్ చేయకుండా.. వేతనాలు పెంచకుండా సీఎం కేసీఆర్ తీవ్రం నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. మల్టీ పర్పస్ విధానం రద్దు చేసి.. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. జీవో 60 ప్రకారం పంచాయతీ సిబ్బందికి రూ.19,500 కనీస వేతనం అమలు పరచాలని డిమాండ్ చేశారు. చింతకానిలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎర్ర శ్రీకాంత్ జీపీ కార్మికులకు పూలమాలలేసి దీక్షలను ప్రారంభించారు. కొణిజర్లలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు వై.విక్రమ్ దీక్షలను ప్రారంభించారు. ముదిగొండలో కార్మికులు భారీ ర్యాలీ చేపట్టారు. మధిరలో టీడీపీ రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి రామనాథం సంఘీభావం తెలిపారు. తల్లాడలో సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు దీక్షలను ప్రారంభించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట జేఏసీ జిల్లా కన్వీనర్ ఏజే రమేష్, సీఐటీయూ జిల్లా నాయకులు ఎంబి నర్సారెడ్డి దీక్షను ప్రారంభించారు. మణుగూరులో ఐఎఫ్‌టీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. చర్లలో కేవీపీఎస్, మహిళా సంఘం, ఆటో యూనియన్ సంఘీభావం తెలిపాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సమ్మెలో భాగంగా తొలి రోజు కలెక్టరేట్ల వద్ద నిరసన చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లాలోని కలెక్టరేట్ వద్ద చేపట్టిన సమ్మెలో తెలంగాణ గ్రామ పంచాయతీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్ మాట్లాడారు. కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లా కేంద్రాల్లోనూ పంచాయతీ కార్మికులు విధులు బహిష్కరించారు.మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండల కేంద్రంలో గ్రామ పంచాయితీ కార్మికులు సమ్మెచేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లే గోపాల్ మాట్లాడుతూ.. నెల నెలా జీతాలు చెల్లించాలని, మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలంలో శ్రీశైలం ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. చేవెళ్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. శంకర్‌పలిలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. షాబాద్‌లో బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళి అర్పించారు. మంచాల, యాచారం మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట పంచాయతీ కార్మికుల దీక్షల్లో రంగారెడ్డి జిల్లా జేఏసీ చైర్మెన్ గ్యార పాండు పాల్గొని మాట్లాడారు. తాండూర్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టారు.యాదాద్రిభువనగిరి జిల్లా పోచంపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు చలమల్ల కృష్ణారెడ్డి సమ్మెకు మద్దతు తెలిపారు. నల్లగొండ జిల్లా కేతెపల్లి మండలం కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. నల్లగొండ ఎంపీడీవో ఆఫీస్ ముందు కార్మికుల నిరవధిక సమ్మె ప్రారంభించారు. పెద్దవూరలో గ్రామపంచాయతీ కార్మికులు స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. జనగామ జిల్లా పరిషత్, ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ సిబ్బంది, కార్మికులు నిరసన తెలిపారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమ్మె ప్రారంభించారు. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోని మండల కేంద్రాల్లో కార్మికులు టెంట్ వేసుకుని సమ్మె చేశారు. వీరికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు.

నవచిత్రం



చిరంజీవి



మెప్పించే ఫైర్ మాస్ ఎంటర్‌టైనర్


చిరంజీవి, మెహర్ రమేష్ కాంబినేషన్‌లో రూపొందుతున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్', ఇటీవలే ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా చిరంజీవి తన డబ్బింగ్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా డబ్బింగ్ స్టూడియోలో దిగిన కొన్ని ఫోటోలను చిరు తన అభిమానులతో షేర్ చేసుకున్నారు.'సినిమా రూపుదిద్దుకున్న తీరు చాలా ఆనందంగా ఉంది. ఈ ఫైర్ మాస్ ఎంటర్‌టైనర్ ఖచ్చితంగా ప్రేక్షకులందరినీ ఆకట్టు కుంటుంది. మీ క్యాలెండర్‌లను మార్క్ చేసుకోండి. థియేటర్స్‌లో కలుద్దాం. భోళాశంకర్ ఆగస్టు 11' అని ట్వీట్ కూడా చేశారు మెగాస్టార్. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం టీజర్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. సినిమాలోని ఫస్ట్ సింగిల్ చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. మిగిలిన పాటలు ఒకదాని తర్వాత ఒకటి విడుదలౌతాయి. మహతి స్వర సాగర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని రామబ్రహ్మం సుంకర అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఆగస్టు 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ చిత్రంలో తమన్నా, కీర్తి సురేష్, సుశాంత్, రఘు బాబు, మురళీ శర్మ, రవిశంకర్, వెన్నెల కిషోర్, తులసి, సురేఖా వాణి, శ్రీ ముఖి, హైపర్ ఆది, వైవా హర్ష, ప్రదీప్, అనీ, బిత్తిరి సత్తి, సత్య, గెటప్ శ్రీను, వేణు టిల్లు, తాగుబోతు రమేష్, రష్మీ గౌతమ్, ఉత్తేజ్, వీర్, షావర్ అలీ, తరుణ్ అరోరా తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి డీవోపీ: డడ్లీ, ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేష్, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, కథా పర్యవేక్షణ: సత్యానంద్, డైలాగ్స్: తిరుపతి మామిడాల, ఫైట్ మాస్టర్స్: రామ్-లక్ష్మణ్, దిలీప్ సుబ్బరాయన్, కాచే కంపాక్టీ.



సరైన మార్పుకి నాంది

మైత్రి.. ది ఫీమేల్ ఫస్ట్ కలెక్టివ్ పేరుతో ప్రైమ్ వీడియో చెన్నైలో తొలి సెషన్‌ని రిలీజ్ చేసింది. ఐశ్వర్య రాజేష్, మాళవిక మోహనన్, మధుబాల వంటి నాయికలతోపాటు రేష్మ ఘటల, స్వాతి రఘురామన్, యామిని యజ్ఞమూర్తి, అపర్ణ పురోహిత్, స్మృతి కిరణ్ వంటి తదితర సాంకేతిక నిపుణులు ముఖ్యంగా వినోద పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వీళ్ళంతా నటించారు. గురువారం 'మైత్రి: ఫీమేల్ ఫస్ట్ కలెక్టివ్' తాజా సెషన్‌ను విడుదల చేశారు. ఈ సెషన్‌లో అందరూ తమ వ్యక్తిగత కథనాలతోపాటు చిత్ర పరిశ్రమలో ఉన్న లింగ వివేధాల గురించి, స్టీరియోటైపింగ్, వర్ణవాదం, వయోవివక్ష మొదలైన వాటితో సహా, మహిళా వృత్తినిపుణులు ఎదుర్కొంటున్న సవాళ్లు, రంగాలు వేరు అయినప్పటికీ అన్ని సమస్యలు ఒకే విధంగా ఉన్నాయని వీరందని అభిప్రాయాలతో వ్యక్తమైంది. మైత్రి సరైన దిశలో మార్పుని తెచ్చింది. మహిళలకు, యువతులకు సమాన ప్రాధాన్యత ఇస్తే వీళ్ళు సృష్టించే సరికొత్త ప్రపంచంతో చాలా మందికి ఉపాధి దొరికే అవకాశం ఉందన్నారు.

అంచనాలు పెంచిన టీజర్



ప్రభాస్

ప్రభాస్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో హెూంబలే ఫిలింస్ బ్యానర్‌పై రూపొందుతోన్న పాన్ ఇండియా మూవీ 'సలార్ పార్ట్ 1: సీస్ ఫైర్'. ఈ సినిమా గురించి ప్రకటన వెలువడిన రోజు నుంచి ప్రభాస్ ఫ్యాన్స్, ప్రేక్షకులు ఎంతో ఎగ్జైట్‌మెంట్‌తో వెయిట్ చేస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను గురువారం ఉదయం 5 గంటల 12 నిమిషాలకు విడుదల చేస్తామని ప్రకటించి, ఈ ఎగ్జైట్‌మెంట్‌ని మేకర్స్ మరింతగా పెంచారు. అందరూ ఊహించినట్లే దర్శకుడు ప్రశాంత్ నీల్ తన యూనివర్స్ నుంచి థ్రిల్లింగ్ యాక్షన్ టీజర్‌ను రిలీజ్ చేశారు. పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో ఉన్న టీజర్‌ను చూస్తుంటే ఈ భారీ బడ్జెట్ సినిమా పాన్ ఇండియా రేంజ్‌లో బాక్సాఫీస్ రికార్డులను తిరగ రాయడం ఖాయమని చిత్ర బృందం నమ్మకాన్ని వ్యక్తం చేసింది. డైరెక్టర్ ప్రశాంత్ నీల్ సృష్టించిన ప్రత్యేకమైన ప్రపంచం 'సలార్'. ఈ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ సినిమాను రూపొందించిన నీల్ దానికి కొనసాగింపుగా ఎన్నో సీక్వెల్స్‌ను రూపొందించుకునేలా ప్లాన్ చేసుకున్నారు. భారీ బడ్జెట్, భారీ తారాగణంతో రూపొందిన 'సలార్' ప్రేక్షకులకు కళ్లు చెదిరే టీజర్‌ను అందించింది. ఇది సలార్ యూనివర్స్‌లోని పార్ట్ 1కు సంబంధించిన టీజర్ మాత్రమే. ఇక థియేట్రికల్ ట్రైలర్‌లో ఇంకెన్ని ఆసక్తికరమైన విషయాలుంటాయనేది అందరిలోనూ క్యూరియాసిటీని ఇది క్రియేట్ చేసింది. ప్రభాస్‌తో పాటు పృథ్వీరాజ్ సుకుమారన్, శ్రుతీహాసన్, జగపతిబాబు వంటి భారీ తారాగణంతో ప్రశాంత్ నీల్ అన్ కాంప్రమైజ్డ్‌గా రూపొందిస్తున్నారు. సెప్టెంబర్ 28న తెలుగు, కన్నడ, హిందీ, మలయాళ, తమిళ భాషల్లో ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా భారీ రేంజ్‌లో విడుదల కానుంది.





ఎస్‌కెఎన్

సొంత కథలా ఫీల్ అవుతారు

ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'బేబీ'. 'కలర్ ఫోటో'ని ప్రొడ్యూస్ చేసిన సాయి రాజేష్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫీల్ గుడ్ లవ్ స్టోరీ ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తన పుట్టిన రోజు సందర్భంగా నిర్మాత ఎస్‌కేఎన్ మీడియాతో మాట్లాడుతూ, 'ఈ సినిమా హై ఇంటెన్స్ ఎమోషనల్ ప్రేమ కథ. సంగీతం కూడా చాలా బాగుంటుంది. ఈ మధ్య కాలంలో ఈ స్థాయి చిత్రాలలో బెస్ట్ మ్యూజిక్ అని చెప్పొచ్చు. సీన్స్, డైలాగ్స్ చాలా కొత్తగా ఉంటాయి. ప్రతి ఒక్కరు.. ప్రతి ప్రెస్‌మీట్‌లో కొత్తదనం అనే పదం వాడి చాలా పాతది చేశారు. కానీ నేను గర్వంగా చెబుతున్నా. ఈ సినిమాలో ఇది వరకు చూడని సీన్లు.. చూడని పరిస్థితులు ఉన్నాయి. ఆ పరిస్థితులను దర్శకుడు తీర్చిదిద్దిన విధానం నచ్చింది. ప్రధాన పాత్రలైన ముగ్గురు మధ్య జరిగే సీన్లలో కొత్త అప్రోచ్ ఉంటుంది. ఇంటర్వెల్ ముందు పెద్ద షాక్ ఉంటుంది. ఈ షాక్ నచ్చే సినిమాను నేను సోలోగా ప్రొడ్యూస్ చేయాలని ఫిక్స్ అయ్యా. డైరెక్టర్ మారుతి కూడా ఈ సినిమాలో ఓ పార్ట్‌నర్. ఈ సినిమాను నా స్టోరీ అని చాలా మంది ఆడియన్స్ కనెక్ట్ అవుతారు. సినిమా నుంచి బయటకు వెళ్లేటప్పుడు నా కథ అనుకుని బరువెక్కిన గుండెతో వెళతారు. ఈ సినిమా నటుడిగా ఆనంద్‌కు ఓ మైలురాయిగా మిగిలిపోతుంది. రానున్న రోజుల్లో సాయి రాజేష్‌తో రెండు సినిమాలు, కలర్ ఫోటో డైరెక్టర్‌తో రెండు సినిమాలు, వీఏ ఆనంద్‌తో ఒక సినిమా, శ్యామ్ సింగరాయ్ దర్శకుడు రాహుల్‌తో మరో సినిమా చేస్తా. ట్యాక్సీవాలా సీక్వెల్ ప్లాన్ ఏం లేదు' అని తెలిపారు.

ఆటలు



2011 రిపీట్ కావాలి!

ఐసీసీ 2023 వన్డే వరల్డ్ కప్ ట్రోఫీ టూర్ కోల్‌కతకు చేరుకుంది. జులై 14 వరకు భారత్‌లో ప్రపంచకప్ ట్రోఫీ టూర్ సాగనుండగా గురువారం కోల్‌కతలోని మోడ్రన్ హైస్కూల్‌లో జరిగిన ట్రోఫీ టూర్ కార్యక్రమానికి భారత క్రికెట్ దిగ్గజం జులన్ గోస్వామి హాజరయ్యారు. రోహిత్‌సేన 2023లో 2011 ధోనీసేన ప్రదర్శన పునరావృతం చేయాలని స్కూల్ విద్యార్థులతో కలిసి ఆకాంక్షించారు. 'గెలుపు, ఓటమి ఆటలో భాగం. కానీ ప్రపంచకప్ క్రికెటర్లు ఎప్పటికీ మనకు హీరోలు. ప్రపంచకప్ జట్టుకు మద్దతుగా నిలిచి.. గెలుపులో భాగమవ్వండి' అని జులన్ గోస్వామి అన్నారు. ప్రపంచకప్ ట్రోఫీ టూర్ తర్వాత తిరువనంతపురం, కోచి నగరాలకు చేరనుంది.

విరాట్.. మళ్లీ అదే తప్పు!

- బలహీనతగా ఆఫ్ సైడ్ ఆవల బంతి
- రాణించిన యశస్వి జైస్వాల్
- విండీస్‌లో భారత్ ప్రాక్టీస్ గేమ్

ఐసీసీ 2025 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ వేటను మొదలుపెట్టే వేళ టీమ్ ఇండియా స్టార్ బ్యాటర్ ఫామ్ ఆందోళనకు గురి చేస్తోంది. టెస్టు క్రికెట్‌లో విరాట్ కోహ్లి నిష్క్రమణలు ఇటీవల ఒకే తరహాలో ఉంటున్నాయి. తాజాగా టీమ్ ఇండియా అంతర్గత ప్రాక్టీస్ గేమ్‌లోనూ విరాట్ కోహ్లి పాత బలహీనతను బయటపెట్టుకున్నాడు. యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ సాధికారిక ఇన్నింగ్స్‌తో అరంగేట్రానికి రంగం సిద్ధం చేసుకున్నాడు.

నవతెలంగాణ-బ్రిడ్జ్‌టౌన్



ఆఫ్ సైడ్ ఆవల బంతిని ఎదుర్కొవటంలో విరాట్ కోహ్లి వైఫల్యం కొనసాగుతుంది. వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌కు ముందు భారత జట్టు బ్రిడ్జ్‌టౌన్‌లో (బార్బడోస్) రెండు రోజుల అంతర్గత వార్మప్ మ్యాచ్ ఆడుతోంది. 16 మంది భారత ఆటగాళ్లు, కొందరు స్థానిక క్రికెట్ క్లబ్ క్రికెటర్లతో కలిసి టీమ్ ఇండియా రెండు బృందాలుగా విడిపోయి ప్రాక్టీస్ గేమ్ ఆడుతుంది. ప్రాక్టీస్ గేమ్‌లో జైదేవ్ ఉనద్కత్ ఆఫ్ సైడ్‌కు ఆవలగా సంధించిన బంతిని ఆడేందుకు ప్రయత్నించిన విరాట్ కోహ్లి తొలి స్లిప్స్‌లో క్యాచౌట్‌గా దొరికిపోయాడు. ఆఫ్ స్టంప్‌కు దూరంగా వెళ్తోన్న బంతిని వెంటాడి కోహ్లి వికెట్ కోల్పోవటం ఇది తొలిసారి కాదు. విరాట్ కోహ్లి ట్రేడ్ మార్క్ షాట్ కవర్ డ్రైవ్. నాలో, ఐదో స్టంప్ మీదుగా వెళ్తోన్న బంతులను విరాట్ కోహ్లి కవర్ డ్రైవ్‌లు కొడితే చూడముచ్చటగా ఉంటుంది. ఆ బలహీనతే కోహ్లిని ఆఫ్ సైడ్‌కు ఆవలగా వెళ్తోన్న బంతులను ఆడేందుకు ఉసి గొల్పుతుంది. ఇష్టమైన షాట్‌కు కొట్టే ప్రయత్నంలో.. విరాట్ కోహ్లి పదేపదే ఒకే తరహాలో వికెట్ పారేసుకుంటున్నాడు. ప్రాక్టీస్ గేమ్‌లో ఉనద్కత్ వేసిన బంతిని కోహ్లి సరైన ఫుట్‌వర్క్ లేకుండా ఆడాడు. అందుకు మూల్యం చెల్లించాడు. లోకల్ ఫీల్డర్ చేతికి చిక్కి నిష్క్రమించాడు. విరాట్ కోహ్లి బలహీనత తెలిసిన జైదేవ్ ఉనద్కత్ పక్కా లైన్, లెంగ్త్‌తో బంతిని సంధించాడు. విరాట్ కోహ్లి వికెట్‌ను పడగొట్టిన ఘనతను సొంతం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో టెస్టుల్లో విరాట్ కోహ్లి కవర్ డ్రైవ్ షాట్ ఆచితూచి ఆడతాడా? లేదా ఆఫ్ సైడ్ ఆవల బంతులను వెంటాడి పెవిలియన్ బాట పడతాడా? అనేది ఆసక్తికరం.

జైస్వాల్ జోరు : యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ (20) ప్రాక్టీస్ గేమ్‌లో మెరిశాడు. టీమ్ ఇండియా టాప్ ఆర్డర్ బ్యాటర్లు అందరూ ఓ జట్టులో ఉండగా.. ప్రధాన బౌలర్లు అందరూ మరో జట్టులో నిలిచారు. కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి ఓపెనర్‌గా బ్యాటింగ్‌కు వచ్చిన యశస్వి జైస్వాల్ ఆకట్టుకునే ఇన్నింగ్స్ నమోదు చేశాడు. మహ్మద్ సిరాజ్ ఓవర్లో ఆన్ డ్రైవ్, జైదేవ్ ఉనద్కత్‌పై స్కేర్ కట్‌తో కదం తొక్కిన యశస్వి జైస్వాల్ 76 బంతుల్లో అజేయంగా 54 పరుగులు చేశాడు. అజేయ అర్థ శతక ఇన్నింగ్స్‌లో స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసిన జైస్వాల్.. ఎటువంటి అసౌకర్యానికి గురి కాలేదు. కెప్టెన్ రోహిత్ శర్మ 67 బంతులు ఎదుర్కొన్న అనంతరం రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగగా.. జైస్వాల్ 76 బంతుల తర్వాత విరామం తీసుకున్నాడు. బ్యాటర్లు అందరూ 50-70 బంతులు ఆడిన అనంతరం ఇతరులకు అవకాశం ఇచ్చేందుకు వెనుదిరిగారు.

నం.3గా గిల్? : భారత టెస్టు జట్టులో నం.3 స్థానంలో సుదీర్ఘ కాలం రాణించిన బ్యాటర్ చతేశ్వర్ పుజార. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ అనంతరం సెలక్టర్లు పుజారాపై వేటు వేశారు. దీంతో నం.3 స్థానంలో యువ క్రికెటర్ అరంగేట్రానికి రంగం సిద్ధమైంది. యశస్వి జైస్వాల్ సహజంగా ఓపెనింగ్ బ్యాటర్. దీంతో అతడిని ఆ స్థానంలోనే ఆడించేందుకు జట్టు మేనేజ్‌మెంట్ సిద్ధమవుతోంది. ఇదే సమయంలో అండర్-19 క్రికెట్, భారత్-ఏ తరఫున శుభ్‌మన్ గిల్ నం.3 బ్యాటర్‌గా, మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా ఆడాడు. దీంతో శుభ్‌మన్ గిల్‌ను మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా ప్రయోగించేందుకు చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ ప్రణాళికలు సిద్ధం చేశారు. అందుకే ప్రాక్టీస్ గేమ్‌లో జైస్వాల్‌ను ఓపెనర్‌గా, గిల్‌ను మిడిల్ ఆర్డర్‌లో పంపించారు. దీర్ఘకాలిక ప్రణాళికలను దృష్టిలో ఉంచుకుని జట్టు మేనేజ్‌మెంట్ ఈ ప్రయోగానికి సిద్ధమవుతోంది.

ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో శుభ్‌మన్ గిల్ ఓపెనర్‌గా బరిలోకి దిగాడు. విరాట్ కోహ్లి నం.4, అజింక్య రహానె నం.5, రవీంద్ర జడేజా నం.6, కె.ఎస్ భరత్ నం.7 స్థానాల్లో బ్యాటింగ్‌కు రావటం లాంఛనమే. దీంతో బ్యాటింగ్ ఆర్డర్‌లో నం.3, ఓపెనింగ్ స్థానంపైనే స్పష్టత రావాల్సి ఉంది.

ఆ ఒక్క స్థానమే : బ్యాటింగ్ విభాగంలో తుది జట్టులో నిలిచే ఆటగాళ్ల ఖాయం. ఏ స్థానంలో ఆడతారనేది కొంత సస్పెన్స్ ఉంది. కానీ బౌలింగ్ విభాగంలో ఓ స్థానంపై ఉత్కంఠ కొనసాగుతుంది. రెండో స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ నిలువనుండగా.. పేస్ ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్ చోటు సాధించనున్నాడు. హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ నూతన పేస్ దళపతి. సిరాజ్, శార్దుల్‌కు తోడుగా పేస్ బాధ్యతలు పంచుకునే రెండో సీమర్ ఎవరనేది ప్రశ్నార్థకం. ముకేశ్ కుమార్ సీమ్ బౌలింగ్, నవదీప్ సైని అదనపు పేస్‌తో రేసులో నిలువగా.. జైదేవ్ ఉనద్కత్ లెఫ్ట్ ఆర్మ్ పేస్ వైవిధ్యంతో రెండో స్థానం కోసం పోటీపడుతున్నాడు.

మెరిసిన మయాంక్, తిలక్

- సౌత్ జోన్ 195 ఆలౌట్
- దులీప్ ట్రోఫీ సెమీఫైనల్



బెంగళూర్ : భారత సీనియర్ జట్టుకు ఎంపికైన ఉత్సాహంలో ఉన్న హైదరాబాదీ కుర్రాడు తిలక్ వర్మ.. దులీప్ ట్రోఫీలో కదం తొక్కాడు. బుధవారం ప్రకటించిన భారత టీ20 జట్టులో తిలక్ వర్మ చోటు సాధించాడు. మిడిల్ లోయర్ ఆర్డర్‌లో ఫినీషర్ స్థానం కోసం రింకూ సింగ్‌తో గట్టి పోటీ చవిచూసిన తిలక్ వర్మ.. తొలిసారి జాతీయ జట్టులోకి అడుగుపెట్టాడు. ఇక బెంగళూర్‌లో నార్త్‌జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ సెమీఫైనల్ మ్యాచ్‌లో తిలక్ వర్మ (46, 101 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. మయాంక్ అగర్వాల్ (76, 115 బంతుల్లో 10 ఫోర్లు) అర్థ సెంచరీతో మెరిశాడు. కెప్టెన్ హనుమ విహారి (0) సున్నా పరుగులకే నిష్క్రమించాడు. మయాంక్ అగర్వాల్, తిలక్ వర్మ రాణించటంతో సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 195 పరుగులకు ఆలౌటైంది. నార్త్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 3 పరుగుల స్వల్ప ఆధిక్యం దక్కించుకుంది. నార్త్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 51/2తో ఆడుతుంది. ప్రస్తుతం నార్త్ జోన్ 54 పరుగుల ముందంజలో నిలిచింది. మరో సెమీఫైనల్లో సెంట్రల్ జోన్ 128 పరుగులకే కుప్పకూలింది. వెస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 220 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 149/3తో ఆడుతోంది. వెస్ట్ జోన్ 241 పరుగుల భారీ ఆధిక్యంలో కొనసాగుతుంది.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు

- కెటిఆర్ జన్మదినం సందర్భంగా నిర్వహణ
- శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ వెల్లడి



నవతెలంగాణ-హైదరాబాద్ : రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించనున్నట్టు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ వెల్లడించారు. 'తెలంగాణ అభివృద్ధి, హైదరాబాద్ విశ్వనగర ఖ్యాతి మరింత ఇనుమడింప చేయడానికి నిరంతరం కృషి చేస్తున్న యూత్ ఐకాన్ కెటిఆర్. ఆయన పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు పలు క్రీడా సంఘాలు ముందుకు రావటం అభినందనీయం. క్రీడా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలకు శాట్స్ సంపూర్ణ సహకారం ఉంటుందని' ఆంజేయ గౌడ్ అన్నారు. జులై 24న కెటిఆర్ పుట్టిన రోజు రాష్ట్ర క్రీడా పోటీలు ఫైనల్స్ నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు గురువారం ఎల్బీ స్టేడియంలోని శాట్స్ చైర్మెన్ కార్యాలయంలో తెలంగాణ సైక్లింగ్, రోలర్ స్కేటింగ్, రెజ్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులు ఆంజనేయ గౌడ్‌తో సమావేశమయ్యారు. సైక్లింగ్, స్కేటింగ్, రెజ్లింగ్ (మహిళలు) పోటీల నిర్వహణపై అసోసియేషన్ ప్రతినిధులతో శాట్స్ చైర్మెన్ చర్చించారు. క్రీడా పోటీల షెడ్యూల్‌ను త్వరలో విడుదల చేయనున్నారు.

ప్రపంచకప్‌కు నెదర్లాండ్స్

- పదో జట్టుగా అర్హత సాధించిన డచ్ జట్టు



న్యూఢిల్లీ : ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌కు నెదర్లాండ్స్ అర్హత సాధించింది. ఐసీసీ వరల్డ్‌కప్ క్వాలిఫయర్ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై నాలుగు వికెట్ల తేడాతో గెలుపొందిన నెదర్లాండ్స్.. 2023 వరల్డ్‌కప్‌కు టికెట్ బుక్ చేసుకుంది. చివరగా 2011 వన్డే వరల్డ్‌కప్‌లో కనిపించిన డచ్ జట్టు.. 1996, 2003, 2007 ప్రపంచకప్‌లలో సైతం మెరిసింది. రెండు సార్లు చాంపియన్ వెస్టిండీస్ ప్రపంచకప్ పోటీకి దూరం కాగా.. అర్హత టోర్నీలో ఆకట్టుకున్న శ్రీలంక, నెదర్లాండ్స్‌లు చివరి రెండు బెర్త్‌లు దక్కించుకున్నాయి. స్కాట్లాండ్ నిర్దేశించిన 278 పరుగుల లక్ష్యాన్ని 43 ఓవర్లలోనే ఊదేసిన నెదర్లాండ్స్.. మెగా ఈవెంట్‌కు సిద్ధమవుతోంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

అతివకు అభయమివ్వని నిర్భయ ఫండ్

- భారతీయ మహిళల్లో భద్రతా భావాన్ని పెంపొందించటంలో విఫలం
- పర్యవేక్షణ లేమితో లోపించిన జవాబుదారీతనం



న్యూఢిల్లీ : దేశరాజధాని ఢిల్లీలో కదులుతున్న ఒక బస్సులో 2012 ఒక యువతిపై అతి దారుణంగా జరిగిన సామూహిక లైంగికదాడి, ఆ తర్వాత ఆమె మరణం దేశాన్ని కుదిపేసింది. 'నిర్భయ కేసు'గా పిలవబడే ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలకు దారి తీసింది. దేశంలోని మహిళలకు మెరుగైన భద్రతా చర్యల కోసం డిమాండ్‌లు వెల్లువెత్తాయి. ఇందులో భాగంగా కేంద్రంలోని అప్పటి యూపీఏ-2 ప్రభుత్వం 'నిర్భయ ఫండ్' అని పిలవబడే నాన్-లాప్సెబుల్ కార్పస్‌ను రూపొందించింది.

అయితే, ఈ నిర్భయ నిధులు భారతీయ మహిళలకు మాత్రం భద్రతా భావాన్ని కలిగించలేకపోతున్నాయి. నిర్భయ ఫండ్‌లో ఇప్పటి వరకు దాదాపు 70 శాతం వినియోగించబడింది. ఏడు రాష్ట్రాలు 60 శాతం నిధులను తమ జేబులో పెట్టుకోవటంతో రాష్ట్రాల మధ్య నిధుల పంపిణీ అటకెక్కిందని గణాంకాలను బట్టి చూస్తే తెలుస్తున్నది. కేవలం ఎనిమిది మెట్రోపాలిటన్ ప్రాంతాలను కవర్ చేసే సేఫ్ సిటీ ఇనిషియేటివ్.. రూ. 2,290 కోట్లతో నిధుల్లో సింహభాగాన్ని పొందటం గమనార్హం. అయితే, ఫండ్ తప్పుడు ప్రాధాన్యతలు, పేలవమైన అమలుపై అసంతృప్తులు వెల్లువెత్తుతున్నాయి. నిర్భయ ఫండ్ మహిళల్లో భద్రతా భావాన్ని పెంపొందించటంలో విఫలమైందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 32 శాతం మంది భారతీయ మహిళలు బహిరంగ ప్రదేశాల్లో సురక్షితంగా లేరని 2019 సర్వే ఒకటి వెల్లడించింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపం, సుదీర్ఘ ఆమోద ప్రక్రియలు ప్రాజెక్టుల అమలుకు ఆటంకం కలిగిస్తున్నాయని నిపుణులు తెలిపారు. పటిష్టమైన పర్యవేక్షణ, మూల్యాంకణ యంత్రాంగం లేకపోవటంతో నిధుల పేలవమైన వినియోగానికి దారి తీసిందన్నారు. నిర్భయ ఫండ్ ద్వారా జరిగే కార్యక్రమాల అమలుపై ఏ ఒక్క ఏజెన్సీ పర్యవేక్షించనందున జవాబుదారీతనం లోపించిందని ఆందోళన వ్యక్తం చేశారు.

నిర్భయ నిధులను ఖర్చు చేసే విషయంలోనూ కొన్ని రాష్ట్రాలు వెనకబడి ఉంటున్నాయి.

బీహార్, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, ఏపీ వంటి రాష్ట్రాలు, లఢక్ వంటి కేంద్రపాలిత ప్రాంతాలు దారుణ ప్రదర్శన కనబర్చిన జాబితాలో ఉన్నాయి. ఇక తెలంగాణతో పాటు ఢిల్లీ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, లక్షద్వీప్‌లు నిర్భయ నిధులను చక్కగా ఖర్చు చేసిన రాష్ట్రాలు, యూటీల జాబితాలో ఉన్నాయి.

119 స్థానాల్లో పోటీ చేస్తాం

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్



నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణలో తెలుగుదేశం పార్టీ రోజురోజుకూ బలోపేతమవుతున్నదని తెలుగుదేశం అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. ఇందుకు ఎన్నికలే నిర్శమని చెప్పారు.ఎన్నికల నోటిఫికేషన్ నాటికి టీడీపీలోకి వలసలు మరింత ఊపందుకుంటాయని చెప్పారు. గురువారం ఎన్టీఆర్ భవన్‌లో పెద్దపల్లి జిల్లా వైఎస్సార్టీపీ యువజన అధ్యక్షుడు పలకల చంద్రారెడ్డి, వొదేల మండల యూత్ ప్రెసిడెంట్ కొలిపాక రాజు ముదిరాజ్‌కు కాసాని జ్ఞానేశ్వర్ తెలుగుదేశం కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. వీరు తెలంగాణ ఐటీడీపీ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు మంచి జరగాలని టీడీపీలో చేరిన వైఎస్సార్టీపి నాయకులను అభినందించారు. తెలంగాణలో టీడీపీ రోజుకు రోజు బలపడుతున్నదనీ, రాష్ట్రంలో అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తామన్నారు. గెలుపు దిశగా నాయకులు, కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. వేగంగా మారుతున్న తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ కీలకపాత్ర పోషించడం ఖాయమన్నారు. అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీల విధానాలపై ప్రజలు విసిగెత్తి ఉన్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య, అజ్మీరా రాజు నాయక్, రాష్ట్ర అధికార ప్రతినిధి ముప్పిడి గోపాల్, ఐటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొలంపల్లి అశోక్, చేవెళ్ల పార్లమెంటు అధ్యక్షుడు సుభాష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శులు వెంకట్ రెడ్డి, జగదీశ్‌రెడ్డి, మీర్ పేట్‌కార్పోరేటర్ మల్లేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో ఇంజనీరింగ్‌కాలేజీల యాజమాన్యాన్నిచారించాలి : ఏఐఎస్‌ఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీలో అరెస్టయిన వారిని ఇంజనీరింగ్ కాలేజీల సిబ్బందిపై కాకుండా యాజమాన్యాన్ని విచారించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారి ఇంజనీరింగ్ కళాశాల పేరు ఎందుకు బహిర్గతం చేయడం లేదని గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఆ కళాశాలలో కేవలం టీఎస్‌పీఎస్సీ లీకేజే జరిగిందా జేఎన్టీయూ ప్రశ్నాపత్రం లీకేజీలు కూడా జరిగాయా?అని తెలిపారు. టీఎస్‌పీఎస్సీలో పేపర్ లీకేజీ వ్యవహారంలో ఏఈఈ, డీఏవో పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీకి సహకరించి మాల్ ప్రాక్టీస్ కి పాల్పడినందుకు సిట్ అధికారులు అరెస్ట్ చేసిన కరీంనగర్ జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాల హెచ్‌ఓడీ, ఫిజికల్ డైరెక్టర్లను పూర్తి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వారి వెనుక ఆ కళాశాల యాజమాన్యం ఉందా? కేవలం సిబ్బంది మాత్రమే చేశారా?అని దానిపై కూడా విచారణ జరపాలి కోరారు. ప్రశ్నాపత్రం లీకేజీ జరిగిన కళాశాలకు బీఆర్ఎస్ నాయకులు, ప్రభుత్వ పెద్దలతో స్నేహ సంబంధాలు ఉండటం వల్లే ఆ కళాశాల పేరు బయట పెట్టకుండా అధికారులు భయపడుతున్నారని విమర్శించారు. సిట్ అధికారులు ఎవరికి లొంగకుండా పూర్తి స్థాయి విచారణ జరిపాలని డిమాండ్ చేశారు.

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ హాల్‌టికెట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి ఈనెల 13,14 తేదీల్లో రాతపరీక్షలను నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో ఆ పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల హాల్‌టికెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష (సీబీఆర్టీ) విధానంలో ఈనెల 13న ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పేపర్-2, 14న ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రాతపరీక్షలుంటాయని వివరించారు. హాల్‌టికెట్‌లో పొందుపరిచిన మార్గదర్శకాలను అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

జి 20 సదస్సుకు పుతిన్ హాజరు?

- రష్యా రాయబారి వ్యాఖ్యలు
- భారత్, రష్యా సహకారాన్ని ఎవరూ దెబ్బ తీయలేరు !

న్యూఢిల్లీ: భారత్‌లో జి 20 సదస్సు నిర్వహణ, రష్యాకి సంబంధించినంతవరకు అతి ముఖ్యమైన కార్యక్రమాల్లో ఒకటని, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ సమావేశానికి హాజరయ్యే అవకాశాలు వున్నాయని సీనియర్ రష్యన్ దౌత్యవేత్త ఒకరు సూచనప్రాయంగా తెలిపారు. ఉక్రెయిన్‌లో యుద్ధం ప్రారంభమైన తర్వాత పశ్చిమ దేశాల నాయకులను పుతిన్ మొదటిసారిగా ముఖాముఖి కలుసుకునే అవకాశం దీంతో ఏర్పడనుంది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతి వారం నిర్వహించే పత్రికా సమావేశంలో అడిగిన ప్రశ్నలకు విదేశాంగ శాఖ ప్రతినిధి సమాధానమిస్తూ, సెప్టెంబరు 9, 10 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న జి 20సదస్సుకు పుతిన్‌ను స్వాగతించేందుకు మోడీ ప్రభుత్వం ఎదురుచూస్తోందని చెప్పారు. ఈ ఏడాది కీలక కార్యక్రమాల్లో ఈ సదస్సు ఒకటిగా భారత్ భావిస్తోందన్నారు. సదస్సు నిర్వహణకు అన్ని సన్నాహక చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలోనే పుతిన్ పర్యటనా వివరాలు తెలుస్తాయని రష్యన్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ రోమన్ బాబుషికిన్ హిందూకు ఇచ్చిన రాతపూర్వక ఇంటర్వ్యూలో తెలిపారు. జి20 సదస్సు విజయవంతం కావడానికి భారత్ అధ్యక్ష వర్గానికి మద్దతిచ్చేందుకు రష్యా కృత నిశ్చయంతో వుందని చెప్పారు. గతేడాది బాలిలో జరిగిన జి20 సదస్సులో ఉక్రెయిన్ గురించి వున్న పేరాగ్రాఫ్‌లపై సంతకం చేసిన విషయాన్ని గమనంలోకి తీసుకుంటే ఢిల్లీ ప్రకటనపై రష్యా, చైనాలు ఎందుకు ఏకాభిప్రాయాన్ని కలిగివున్నాయని ప్రశ్నించగా, ఆర్థికాంశాలను చర్చించేందుకు ఉద్దేశించిన జి20 సదస్సును రాజకీయం చేయడం ద్వారా భారత్ అధ్యక్షవర్గ బాధ్యతలను పశ్చిమ దేశాలు దెబ్బతీస్తున్నాయని రష్యా రాయబారి వ్యాఖ్యానించారు.

గంజికీ కష్టమే...
పెరుగుతున్న బియ్యం ధరలు

- ధరల సూచికలో 11 ఏండ్ల గరిష్ట స్థాయికి...
- దిగుబడులపై ఎల్‌నినో ప్రభావం

ముంబయి : గడచిన 11 సంవత్సరాలతో పోలిస్తే అంతర్జాతీయంగా బియ్యం ధరలు ఈ ఏడాది బాగా పెరిగాయి. ఎల్‌నినో ప్రభావంతో కొన్ని దేశాలలో ధాన్యం దిగుబడి తగ్గడంతో ధరలపై ప్రభావం పడుతోంది. బియ్యం ఎగుమతులు మన దేశం నుండే 40% వరకూ జరుగుతున్నాయి. గత సంవత్సరం మన దేశం నుంచి 56 మిలియన్ టన్నుల బియ్యం ఎగుమతి అయింది. భారతదేశం బియ్యాన్ని అతి తక్కువ ధరకు సరవరా చేస్తోందని బియ్యం ఎగుమతిదారుల సంఘం (ఆర్ఈఏ) అధ్యక్షుడు బీవీ కృష్ణారావు తెలిపారు.

ఆసియాలో 300 కోట్ల మంది ప్రజలు వరి అన్నమే తింటారు. సుమారు 90% పంటను నీటి పారుదల సౌకర్యం పైనే ఆధారపడి వేస్తున్నారు. అయితే ఎల్‌నినో ప్రభావంతో ఆసియాలో వర్షపాతం తగ్గింది.

అననుకూల వాతావరణం కారణంగా ఉత్పత్తి తగ్గడానికి ముందే అంతర్జాతీయ బియ్యం ధరల సూచిక 11 సంవత్సరాల గరిష్ట స్థాయిని చేరింది. థాయిలాండ్, వియత్నాంలలో మాత్రం ప్రభుత్వాలు రైతులకు ప్రోత్సాహకాలు అందించడంతో ఉత్పత్తి కొంత పెరిగింది. పరిమిత సరఫరాల కారణంగా బియ్యం ధరలు ఇప్పటికే పెరిగాయని, ఉత్పత్తి తగ్గితే అవి మరింత పెరుగుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు

దాదాపు అన్ని ఆసియా దేశాలలో ఎల్‌నినో ప్రభావం రెండో పంటపై పడుతుందని, దీంతో సాధారణ స్థాయి కంటే తక్కువగానే పంట దిగుబడి వస్తుందని, ఆ పరిస్థితుల్లో ధరలు మరింతగ పెరుగుతాయని ఢిల్లీకి చెందిన ఒక వ్యాపారి తెలిపారు. వర్షపాతం తక్కువగా ఉన్నందున ఒకే పంట వేయాల్సిందిగా థాయిలాండ్ ప్రభుత్వం రైతులను కోరింది. మన దేశంలో కూడా వేసవి పంట విస్తీర్ణం తగ్గింది. సాధారణం కంటే వర్షపాతం 8% తగ్గడమే దీనికి కారణం.

మన దేశంలో పాలక పక్షానికి ఆహార ద్రవ్యోల్బణం ఆందోళన కలిగిస్తోంది. ధరలను అదుపులో ఉంచేందుకు గత సంవత్సరం గోధుమల ఎగుమతులపై నిషేధం విధించింది. బియ్యం, చక్కెర ఎగుమతులపై కూడా ఆంక్షలు పెట్టింది. ఈ సంవత్సరం చివరలో ఐదు రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే సంవత్సరం ప్రారంభంలో లోక్‌సభ ఎన్నికలు జరగాల్సి ఉంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా విత్తనాలు వేసుకోవడం ఆలస్యం కావడం, మరోవైపు దేశంలో ధరలు పెరగడం ప్రధాని నరేంద్ర మోడీని, బీజేపీని కలవరపెడుతోంది. ఈ నేపథ్యంలో ఎగుమతులపై మరిన్ని ఆంక్షలు విధించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. మన దేశం ఆంక్షలు విధిస్తే ఇతర దేశాల సరఫరాలపై ప్రభావం పడుతుంది. సరఫరాలు సరిగా లేకపోవడం, భారత్ నుండి ఎగుమతులు తగ్గడం వల్ల అంతర్జాతీయంగా ధరలు పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల ధాన్యాన్ని కొని నిల్వ చేయడం కష్టమవుతుంది.

ఉపాధి హామీ పథకంలో టెక్నాలజీ

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో పురోగతిని పరిశీలించేందుకు, నిధుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని కేంద్రం భావిస్తోంది. పనుల అంచనాలు మరింత పారదర్శకంగా ఉండేందుకు, పథకానికి సంబంధించిన ప్రాజెక్టులను మెరుగ్గా పర్యవేక్షించేందుకు టెక్నాలజీని వినియోగిస్తారు. అంచనాలు మరింత కచ్చితత్వంతో ఉండేందుకు, పని పురోగతిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు టెక్నాలజీ సాయం తీసుకుంటామని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది. గతంలో అంచనాలను రూపొందించడం, పనుల పురోగతిని పర్యవేక్షించడం వంటి పనుల్ని ఇంజినీర్లు చేసే వారు. అయితే వారు భౌతికంగా వేసే అంచనాలలో కచ్చితత్వం లోపిస్తోంది. ఈ నేపథ్యంలో సాంకేతిక సాయం తీసుకునే దిశగా మంత్రిత్వ శాఖ ఇప్పటికే ప్రైవేటు కంపెనీలను, ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు వంటి సాంకేతిక సంస్థలను పలు దఫాలుగా సంప్రదించింది. అయితే చర్చలు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. డ్రోన్లు, ఉపగ్రహ ఛాయాచిత్రాలు, మొబైల్ పరికరాలు వంటి వాటిని ఉపయోగించే అవకాశాలను పరిశీలిస్తున్నారు. పని ప్రదేశంలో 3డీ ల్యాండ్ ప్రొఫైల్‌ను చేపట్టే అంశం కూడా పరిశీలనలో ఉంది.

ఉపాధి పథకంలో కార్మికుల హాజరు నమోదు కోసం ఇప్పటికే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్)ను ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే. వేతనాలు చెల్లించేందుకు ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ (ఏబీపీఎస్)ను తప్పనిసరి చేశారు. అయితే ఈ రెండు నిర్ణయాలను కార్మికులు వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఏబీపీఎస్ అమలును ఆగస్టు 31వ తేదీ వరకూ వాయిదా వేశారు.

కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే

- బీఆర్ఎస్ పాత్ర అత్యంత కీలకం కాబోతోంది
- కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధించి తీరుతాం
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే. అందులో బీఆర్ఎస్‌ది కీలక పాత్ర కాబోతుంది. కేంద్రం మెడలు ఎలా వంచాలో తెలంగాణకు తెలుసు. కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సాధించి తీరుతాం. సాధించేదాకా వదిలిపెట్టే ప్రసక్తేలేదు. దశాబ్దాలుగా కాజీపేటకు జరుగుతున్న అన్యాయాన్ని ఇక సహించేది లేదు. దేశంలో కోచ్‌ఫ్యాక్టరీలకు డిమాండ్ లేదని చెప్పిన కేంద్ర ప్రభుత్వం మహారాష్ట్ర, గుజరాత్‌లలో ఎలా ఏర్పాటు చేస్తున్నారు? ఈ ప్రశ్నకు తెలంగాణ బీజేపీ నేతలు కూడా సూటిగా సమాధానం చెప్పాలి. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపర్చిన కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీ అంశాన్ని తప్పుదోవపట్టించి, కేవలం పీవోహెచ్ వర్క్‌షాపు అని, ఆ తర్వాత వ్యాగన్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ అంటూ కాజీపేటకు వస్తున్న ప్రధాని మోడీ మోసాన్ని ఓరుగల్లు ప్రజలు గమనిస్తున్నారు.

తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధమవుతున్నారు' అని మాజీ ఎంపీ, తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఈనెల 8న కాజీపేటకు ప్రధాని నరేంద్ర మోడీ వస్తున్న నేపథ్యంలో గురువారం దక్షిణ కొరియా పర్యటన నుంచి వినోద్‌కుమార్ పత్రికా ప్రకటనను గురువారం విడుదల చేశారు. దశాబ్దాలుగా కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటు విషయంలో తెలంగాణ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ఇక సహించేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. ఓరుగల్లు ప్రజలు పోరుబిడ్డలని, కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేదాకా కేంద్ర ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తేలేదని వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీ కావాలని చెప్పి ఉద్యమించారని గుర్తుచేశారు. కాజీపేటలో ఆనాడు సీపీఐ నేతలు భగవాన్‌దాస్, కాళీదాస్‌తోపాటు అనేక మంది నాయకులతో కలిసి వరంగల్ ప్రాంత ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు ఉద్యమించారని, ఉద్యమిస్తూనే ఉన్నారని తెలిపారు. కాజీపేటకు కావాల్సింది కోచ్‌ఫ్యాక్టరీ మాత్రమేనని, కోచ్‌ఫ్యాక్టరీతోనే ఈ ప్రాంత ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. వేలాదిమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ విషయాన్ని కేంద్రంలోని బీజేపీ గమనించాలని, లేనిపక్షంలో తెలంగాణ ప్రజల చేతిలో బీజేపీ చావుదెబ్బతింటుందని వినోద్‌కుమార్ హెచ్చరించారు.

బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు

- ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సమావేశంలో జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్‌ఓంకార్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని ఎంసీపీఐ(యూ) జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్‌ఓంకార్ అన్నారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాలు ఈనెల 4,5,6 తేదీలలో హైదరాబాద్‌లోని ఓంకార్‌భవన్‌లో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాపురావు అధ్యక్షతన జరిగాయి. ఈ సమావేశంలో అశోక్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రానున్న సాధారణ ఎన్నికల్లో లబ్ధి కోసం దేశంలో రాజకీయ విచ్చిన్నతలు, అప్రజాస్వామిక పద్ధతుల్లో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటున్నదని అన్నారు. బీజేపీ అసహనం, అహంభావం స్పష్టంగా బయట పడుతున్నాయని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తి విరుద్ధమన్నారు. మణిపూర్ రావణకాష్టంలాగా కాలుతున్న ఆ శవాలపై తన రాజకీయ భవిష్యత్తు నిర్మాణం చేస్తున్నదని విమర్శించారు. దేశంలో రాజకీయ పార్టీలు అన్నింటినీ విచ్చిన్నం చేస్తూ ఆ పార్టీలు నేతలపై ఈడీ, సీబీఐలతో దాడులతో అవినీతి పరులనే ముద్రలేస్తూ లొంగదీసుకుంటున్నదన్నారు. అవినీతి పరులంతా బీజేపీలో చేరగానే పవిత్రులు ఎలా అవుతున్నారని ప్రశ్నించారు. మహారాష్ట్రలో జరిగిన పరిణామాలు ప్రమాదకరమని చెప్పారు. తెలంగాణలో కేసీఆర్ కూతురు కవితపై లిక్కర్ కేసు రాగానే బీజేపీ ముందు బీఆర్ఎస్ సాగిలపడిందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ పార్టీ ప్రజా సంఘాల నిర్మాణం బలోపేతం చేయడానికి ఈనెల 15,16 తేదీలలో నాగార్జునసాగర్‌లో రాష్ట్ర స్థాయి విస్తత సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, వి.తుకారాం నాయక్, కుంభంసుకన్య మందరవి, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెటా థ్రెడ్స్ వచ్చేసింది..

- ఏడు గంటల్లో కోటి మంది చేరిక



వాషింగ్టన్ : సోషల్ మీడియా దిగ్గజం ట్విట్టర్‌కు పోటీగా మెటా తన థ్రెడ్స్‌ను తీసుకువచ్చింది. దీన్ని విడుదల చేసిన ఏడు గంటల్లోనే కోటి మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. మెటా థ్రెడ్స్ యాప్ యూరోపియన్ యూనియన్‌లోని కొన్ని దేశాల్లో తప్ప ప్రపంచంలోని దాదాపు 100కి పైగా దేశాల్లో గురువారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ఈ యాప్‌లో 500 అక్షరాల వరకు పోస్ట్ చేయవచ్చు. ట్విటర్ తరహా ఫీచర్లతో అదనంగా కొన్ని జోడించింది. ఇన్‌స్టాలో అనుసరిస్తున్న ఖాతాలను, కొత్త యాప్‌పైనా అనుసరించే సౌలభ్యం ఉంది. ఇందులో ట్విట్టర్‌లో లేని కొన్ని అదనపు ఫీచర్స్ కూడా ఉన్నాయి. ఈ యాప్ వినియోగించాలనుకునే వారు ఇప్పటికే ఉన్న ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా లాగిన్ అవ్వొచ్చు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలో అవుతున్న అందరూ ఇందులో కూడా ఫాలో అయ్యే అవకాశం ఉంది.

అదాని గ్రూప్‌లో తగ్గనున్న ప్రమోటర్ల వాటాలు

న్యూఢిల్లీ : నగదు లభ్యతను పెంచుకోవడానికి అదాని గ్రూప్ ప్రమోటర్లు తమ వాటాలను తగ్గించుకోవాలని భావిస్తున్నారు. ప్రస్తుతం అదానీ గ్రూప్ లిస్టెడ్ సంస్థల్లో అదానీ గ్రీన్ ఎనర్జీ, ఏసీసీ లిమిటెడ్ మినహా మిగిలిన కంపెనీల్లో అదానీ కుటుంబానికి 60 శాతానికి పైగా వాటా ఉంది. వాటిలోని వాటాలను తగ్గించుకోవాలని యోచిస్తున్నారని రిపోర్టులు వస్తోన్నాయి. హిండెన్‌బర్గ్ రిపోర్ట్ తర్వాత అదాని కుటుంబం పలు కంపెనీల్లోని తమ వాటాలను తగ్గించుకున్న విషయం తెలిసిందే. మరోమారు వాటాల తగ్గింపునపై దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. వచ్చే నిధులతో కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని యోచిస్తోన్నారు. గడిచిన కొన్ని నెలల్లో అమెరికాకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ జీక్యూజీ పార్ట్‌నర్స్‌కు పలు మార్లు 3 బిలియన్ డాలర్ల విలువైన వాటాలను విక్రయించిన విషయం తెలిసిందే.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనం

న్యూఢిల్లీ : ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనం అయ్యింది. ఇందుకు రెండు సంస్థల బోర్డులు ఆమోదం తెలిపాయి. విలీన ప్రతిపాదన ప్రకారం ఐడీఎఫ్‌సీ వాటాదారులకు తమ వద్ద గల ప్రతీ 100 షేర్లకుగాను 155 ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు షేర్లు పొందనున్నారు. మౌలిక వసతుల రంగానికి మద్దతును అందించడానికి 1997లో ఐడీఎఫ్‌సీని ఏర్పాటు చేయగా.. ఆ సంస్థ తన అనుబంధంగా 2014 ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌ను ఏర్పాటు చేసింది. కాగా.. మాతృసంస్థనే తాను నెలకొల్పిన సబ్సిడరీలో విలీనం కావడం విశేషం. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌కు 2023 మార్చి నాటికి 809 శాఖలు, 925 ఏటీఎంలు ఉన్నాయి.

ఫోన్‌పే వనస్టాప్ పీఓఎస్ సొల్యూషన్



న్యూఢిల్లీ : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక ఫోన్‌పే వ్యాపార భాగస్వాముల కోసం వన్‌స్టాప్ పీఓఎస్ సొల్యూషన్‌ను ప్రారంభించినట్టు తెలిపింది. దీంతో ఒకే పరికరంతో యూపీఐ, డెబిట్, క్రెడిట్ కార్డ్ చెల్లింపులను సమ్మతించడానికి అవకాశాన్ని కల్పిస్తోన్నట్టు వెల్లడించింది. ఈ పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) పరికరం ఆండ్రాయిడ్ ప్లాట్‌ఫామ్‌పై తీసుకొచ్చినట్టు పేర్కొంది. దేశమంతటా దీన్ని విస్తరించాలని.. వచ్చే ఏడాది కల్లా 1.5 లక్షల పరికరాలను వ్యాపారులకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఫోన్‌పే ఆఫ్‌లైన్ బిజినెస్ హెడ్ వివేక్ లోహేచెబ్ పేర్కొన్నారు.

దక్షిణాదిలో టీకేఎం 'మాన్‌సూన్ క్యాంపెయిన్'

బెంగళూరు : తమ వినియోగదారులకు ఇబ్బంది లేని ప్రయాణాన్ని కల్పించడానికి మాన్‌సూన్ క్యాంపెయిన్‌ను చేపడుతున్నట్టు టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) తెలిపింది. ఈ వర్షాకాలంలో 20పాయింట్ల సమగ్ర వాహన ఫిట్‌నెస్ తనిఖీ నుంచి ఇంటి వద్దనే సేవలు అందించటం వరకూ విస్తృత శ్రేణీ సేవలు అందించనున్నట్టు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఇతర దక్షిణాది రాష్ట్రాల్లోని తమ సర్వీసు సెంటర్లలో ఆకర్షణీయ సర్వీసింగ్ ప్యాకేజిలు అందిస్తున్నట్టు పేర్కొంది.

హైదరాబాద్‌లో జీహెచ్‌ఆర్ ఇన్‌ఫ్రా విస్తరణ

హైదరాబాద్ : నగర మార్కెట్‌పై జీహెచ్‌ఆర్ ఇన్‌ఫ్రా దృష్టి సారించినట్టు వెల్లడించింది. ఇందుకోసం హైదరాబాద్‌లో కొత్త ప్రాజెక్టులను ప్రకటించింది. ఇటీవల తుక్కుగూడలోని అల్మాస్‌గూడలో ప్రత్యేకమైన స్మార్ట్ విల్లా గేటెడ్ కమ్యూనిటీ కోసం జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్‌ను కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్ట్ స్మార్ట్ హోమ్‌ల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీరుస్తుందని పేర్కొంది. ఫేజ్-2లో కొత్త టవర్‌ను ప్రారంభిస్తున్నామని జిహెచ్‌ఆర్ ఇన్‌ఫ్రా సిఇఒ కార్తీష్ రెడ్డి మాద్దుల తెలిపారు. తమ ఖాతాదారులకు రాజీలేని, విలాసవంతమైన జీవనశైలినీ అందించడానికి రూపొందించబడ్డాయన్నారు. ఫేజ్-1 ప్రాజెక్ట్ డిసెంబర్ 2025 నాటికి పూర్తి కావడానికి తగిన మార్గంలో ఉందన్నారు.

కిచెన్ ఉత్పత్తుల విభాగంలో 25% వృద్ధి లక్ష్యం

- హింద్‌వేర్ స్మార్ట్ అప్లయిన్సెస్ వెల్లడి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో కిచెన్ ఉపకరణాల విభాగంలో 25 శాతం పైగా వృద్ధి అంచనా వేస్తున్నామని హింద్‌వేర్ స్మార్ట్ అప్లయిన్సెస్ తెలిపింది. ఇందుకోసం వినూత్న ఉత్పత్తులతో వంటగది ఉపకరణాల శ్రేణీని విస్తరిస్తున్నట్లు పేర్కొంది. కిచెన్ చిమ్నీ, బిల్ట్ ఇన్ హాబ్స్, ఇండక్షన్ కుక్‌టాప్‌ల కేటగిరీల్లో కొత్త ఉత్పత్తులను విడుదల చేసినట్టు తెలిపింది. ఈ విభాగంలో మార్కెట్ ఉనికిని పెంచుకోవడం, కిచెన్ ఉపకరణాల విభాగంలో ఎక్కువ వాటాను దక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపింది.

60 ఏండ్లు పైబడిన 50 శాతం మందిలో...

- మూత్రవిసర్జన సమస్యలు:డాక్టర్ అర్జున్ సోమిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారతదేశంలో 60 ఏండ్లు పైబడిన వారిలో 50 శాతం మంది మూత్రవిసర్జన సమస్యతో బాధపడుతున్నారని అపోలో హాస్పిటల్స్ (జూబ్లిహిల్స్) ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ అర్జున్ సోమిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మూత్రవిసర్జన సమయంలో మూత్రాశయం పూర్తిగా ఖాళీ కాకపోవడం, ఎక్కువసార్లు మూత్రవిసర్జనకు వెళ్లాల్సి రావడం, రెస్ట్ రూంలు అందుబాటులో లేని సమయంలో ద్రవాలను తక్కువగా తీసుకోవాల్సి రావడం వంటి లక్షణాలు వారిలో కనిపిస్తుంటాయని చెప్పారు. మూత్రప్రవాహం తక్కువగా ఉండటం, పరిమాణం తక్కువగా ఉండటం, మూత్రవిసర్జన చివర్లో చుక్కలుగా పడటం వంటి సంకేతాలను గమనించాలని సూచించారు.

ఈ సమస్యకు కచ్చితమైన కారణం తెలియనప్పటికీ హార్మోన్లు, ప్రోస్టేట్ గ్రంధి వ్యాకోచం, అసాధారణ ప్రోస్టాటిక్ కండరాల కణజాల సంకోచాల మార్పులుంటాయని వివరించారు. ఈ సమస్య ఎక్కువగా మధుమేహం, ఊబకాయంతో బాధపడే పురుషుల్లో ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వ్యాధికి ఆధునిక ప్రోస్టాటిక్ అర్టరీ ఎంబొలైజేషన్ (పీఏఈ) అనే మినిమల్లీ ఇన్వేసివ్ పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని డాక్టర్ అర్జున్ సోమిరెడ్డి తెలిపారు. ఈ విధానంలో ప్రోస్టాట్ గ్రంధికి రక్తాన్ని సరఫరా చేసే ధమనులలోకి చిన్న చిన్న అణువులను ఇంజెక్ట్ చేస్తారు. దీంతో గ్రంధి కుంచించుకుపోయి ఆ లక్షణాల నుంచి ఉపశమనం కలుగుతుందని చెప్పారు.

దేశం వెలుపల తొలిసారిగా టాంజానియాలో ఐఐటి కేంపస్

న్యూఢిల్లీ : భారత్‌కు వెలుపలగా మొట్టమొదటి ఐఐటి కేంపస్‌ను టాంజానియాలోని జంజిబార్‌లో ఏర్పాటు చేయనున్నారు. అక్టోబరులో ఇక్కడ విద్యా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని భావిస్తున్నట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ గురువారం తెలిపింది. ఇదొక చారిత్రక చర్యగా ప్రస్తుతం టాంజానియాలో పర్యటిస్తున్న విదేశాంగ మంత్రి జై శంకర్ వ్యాఖ్యానించారు. పేద దేశాల పట్ల భారత్‌కు గల నిబద్ధత ఇందులో ప్రతిఫలిస్తోందని అన్నారు. జంజిబార్‌లో ఐఐటి-మద్రాసు కేంపస్‌ను ఏర్పాటు చేయడానికి అవగాహనా ఒప్పందం(ఎంఓయు)పై సంతకాలు జరిగాయి. అంతర్జాతీయంగా ఆవిర్భవిస్తున్న అవసరాలకు తగినట్లుగా పోటీతత్వాన్ని పెంపొందించేందుకు విస్తృత ఉద్దేశ్యంతో చేపట్టిన చర్య ఇదని విదేశాంగ శాఖ పేర్కొంది. భారతీయ ఉన్నత విద్య ఆకాంక్షలకు, ఆవిష్కరణలకు సంబంధించి ప్రపంచానికి ఇదొక ఉదాహరణగా నిలుస్తుందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. జంజిబార్ అధ్యక్షుడు హుస్సేన్ అలీ, జై శంకర్‌లు బుధవారం ఈ ఎంఓయుపై సంతకాలు చేశారు. దీనితో భారతదేశ పేరు ప్రతిష్టలు అంతర్జాతీయంగా పెరుగుతాయని ఆ ప్రకటన పేర్కొంది. ఇరు దేశాల మధ్య గల సుదీర్ఘ స్నేహ సంబంధాలకు ఈ కేంపస్ ఒక ఉదాహరణగా నిలుస్తుందని వ్యాఖ్యానించింది.

ద్వైపాక్షిక, రక్షణ సహకారంపై చర్చ

ఐఎన్‌ఎస్ త్రిశూల్‌లో జాంజిబార్ అధ్యక్షుడితో జై శంకర్

జాంజిబార్ సిటీ : ప్రస్తుతం టాంజానియాలో పర్యటిస్తున్న భారత విదేశాంగ మంత్రి జై శంకర్ ఐఎన్‌ఎస్ త్రిశూల్‌లో జాంజిబార్ అధ్యక్షుడు డాక్టర్ హుస్సేన్ అలీ మివిన్యితో కలిసి విందులో పాల్గొన్నారు. తూర్పు ఆఫ్రికా తీరంలో టాంజానియా ద్వీప సమూహమే జాంజిబార్, ఈ ప్రాంతంలో శాంతి, సంపదలు విలసిల్లేలా చూడాలన్న భారత్ నిబద్ధతకు ఈనాడు ఈ నౌక ఇక్కడుండడం ఒక తార్కాణమని ఆయన వ్యాఖ్యానించారు. భారత నావికాదళానికి చెందిన త్రిశూల్ నౌక టాంజానియాలో పర్యటిస్తోంది. జాంజిబార్‌లో రెండు రోజుల అధికార పర్యటన నిమిత్తం బుధవారం జై శంకర్ ఇక్కడకు వచ్చారు. అధ్యక్షుడు మివిన్యితో ఆయన ద్వైపాక్షిక సంబంధాలపై, రక్షణ సహకారంపై చర్చలు జరిపారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో శాంతి సుస్థిరతలు, సంపద, సంక్షేమాలకు హామీ కల్పించే సముద్ర జలాల చొరవే సాగర్ (ఈ ప్రాంతంలో అందరికీ భద్రత, అభివృద్ధి). సాగర్ పట్ల నిబద్ధత ఈనాటి తమ పర్యటన, విందు సమావేశంలో ప్రతిఫలిస్తున్నాయని జై శంకర్ ట్వీట్ చేశారు. ఈ రిసెప్షన్‌లో జై శంకర్ మాట్లాడుతూ, భారత పశ్చిమ తీరం, ఆఫ్రికా తూర్పు తీరం మధ్య గల సంబంధాలు చాలా చారిత్రకమైనవని భావిస్తున్నట్లు చెప్పారు. మన అభివృద్ధి భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే సమయం కూడా ఇదేనని ఆయన వ్యాఖ్యానించారు. జలవనరుల అభివృద్ధి రంగంలో భారత్‌కు గల అవకాశాలను జాంజిబార్‌తో పంచుకోవడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. జి 20లో ఆఫ్రికన్ యూనియన్ శాశ్వత సభ్యత్వం గురించి ప్రతిపాదించబడిందని, దీన్ని సభ్య దేశాలు పరిశీలించాలన్నారు.

నడ్డాతో పురందేశ్వరి భేటీ

న్యూఢిల్లీ : బీజేపీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డాను ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షులు పురందేశ్వరి కలిశారు. అధ్యక్షురాలిగా నియమించడంపై నడ్డాకు పురంధేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకానికి నడ్డాకు కతజ్ఞతలు తెలిపినట్లు పురందేశ్వరి వెల్లడించారు. నిబద్ధతతో పని చేస్తానని జెపి నడ్డాకు తెలిపినట్టు చెప్పారు. ఏపీలో బీజేపీనిబలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆంధ్రుల ప్రయోజనాలు కాపాడేందుకు కృషి చేస్తానని పురందేశ్వరి తెలిపారు.

నిందితులకు జీవిత ఖైదు విధించాలి

- జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించనున్న మూకదాడి బాధితుడు తబ్రేజ్ అన్సారీ భార్య

న్యూఢిల్లీ : దాదాపు నాలుగేండ్ల క్రితం మూకదాడిలో హత్యకు గురైన తాబ్రేజ్ అన్సారీ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో పది మంది నిందితులకు శిక్షా కాలాన్ని పెంచాలని తబ్రేజ్ అన్సారీ భార్య జార్ఖండ్ హైకోర్టులో అప్పీలు చేయనున్నారు. బుధవారం సెరైకెలాలోని అదనపు జిల్లా కోర్టు జడ్జి-1 అమిత్ శేఖర్ దోషులకు పదేండ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చిచ్చారు. భారతీయ శిక్షాస్మతిలోని సెక్షన్ 304 కింద పది మంది నిందితులను దోషులుగా నిర్ధారించారు. అంతేకాకుండా, నిందితులం దరికీ ప్రత్యేకంగా రూ.15,000 జరిమానాగా డిపాజిట్ చేయాలని ఆదేశిం చారు. అయితే, ఈ తీర్పుపై తబ్రేజ్ అన్సారీ తరఫు న్యాయవాది అసంతృప్తిని వ్యక్తం చేశారు. "మేము సెక్షన్ 302 (హత్యకు సమానమైన నేరపూరిత నర హత్య) కింద శిక్ష విధించాలని డిమాండ్ చేశాం. అయితే కోర్టు దానిని తోసి పుచ్చింది. గాయపడిన బాధితుడు నాలుగు రోజుల తర్వాత మరణిం చాడని చేసిన అభ్యర్థనపై ఐపీసీలోని సెక్షన్ 304కు మార్చింది. హత్య చేయాలనే ఉద్దేశ్యంతో రాత్రంతా నిర్దాక్షిణ్యంగా కొట్టినందున మేము దానిపై హైకోర్టులో అప్పీల్ చేస్తాం. శిక్ష మొత్తాన్ని జీవిత ఖైదుకు పెంచాలని కోరుకుం టున్నాము" అని తబ్రేజ్ భార్య శైష్టా పర్వీన్ తరఫు న్యాయవాది అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. ఈ కేసులో మొత్తం 36 మంది సాక్ష్యం చెప్పారని తెలిపారు. ఈ కేసులో ఇద్దరు నిందితులు (సుమంత్ ప్రధాన్, సత్యనారాయణ నాయక్) సాక్ష్యాధారాలు లేని కారణంగా నిర్దోషులుగా విడుదలయ్యారు. నిందితులలో ఒకరైన కుశాల్ మహాలీ విచారణ సమయంలో మరణించారు. 2019, జూన్‌లో తెల్లవారుజామున బైక్‌లను దొంగిలించారనే ఆరోపణపై సెరైకెలా-ఖర్సవాన్ జిల్లాలోని ధాత్కిడిహ్‌లో తబ్రేజ్‌ను ఒక గుంపు కొట్టి చంపిన విషయం విదితమే. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి జూన్ 22న ప్రాణాలు కోల్పోయాడు.

ఖండాంతరాలు దాటిన తెలంగాణ సంస్కృతి

- సింగపూర్ బోనాలకు మంత్రులకు ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఖండాంతరాలు దాటిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మెన్ వినోద్‌కుమార్ అన్నారు. సింగపూర్ పర్యటనలో తెలంగాణ సింగపూర్ కల్చరల్ సొసైటీ ప్రతినిదులు మర్యాద పూర్వకంగా కలసి సింగపూర్‌లో నిర్వహించనున్న లష్కర్ బోనాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి కోసం తెలంగాణ నుంచి ఇతర దేశాలకు వలస వచ్చిన తమ సంస్కతి, సాంప్రదాయాలను కొనసాగిస్తున్న సింగపూర్‌లోని తెలంగాణ ప్రజలను, అందుకు కషి చేస్తున్న సింగపూర్ తెలుగు కల్చరల్ సొసైటీ ప్రతినిధులను అభినందించారు. రాష్ట్రం అన్ని రంగాలలో అభివద్ధి సాధించడానికి గర్వపడుతున్నామని సింగపూరు కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం గతంలోనే ఏర్పడి ఉంటే తమ భవిష్యత్తు ఎంతో బాగుండేదని, ఉద్యోగం, ఉపాధి కోసం ఇతర దేశాలకు వచ్చేవారం కాదని వారు మంత్రికి తెలిపారు. సింగపూర్ లోని తెలంగాణ ప్రజలు జరుపుకుంటున్న లష్కర్ బోనాలకు వచ్చే సంవత్సరం తెలంగాణ రాష్ట ప్రభుత్వం సాంస్కతిక శాఖ నుంచి కళాకారులను పంపిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రజలు ఖండాలు దాటినా తమ సంస్కతిని ఆచార వ్యవహారాలను కొనసాగించడాన్ని స్వాగతించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటకాభివద్ధి సంస్థ ఎండీ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

మూడు కార్పొరేషన్లకు చైర్మెన్ల నియామకం

తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్‌గా మాజీ ఎమ్మెల్సీ వి.భూపాల్‌రెడ్డిని ముఖ్యమంత్రి కేసీఆర్ నియమించారు. డైరెక్టర్లుగా హైదరాబాద్‌కు చెందిన గోసుల శ్రీనివాస్‌యాదవ్, నారాయణ్ పేట్ జిల్లా మద్దూర్ మండలం రెనెవట్లకు చెందిన మొహమ్మద్ సలీంలను నియమించారు. తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మెన్‌గా సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం మార్వెల్లికి చెందిన మాటం బిక్షపతిని నియమించారు. తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్‌గా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన మొహమ్మద్ తన్వీర్‌ను నియమించారు.

మణిపూర్‌లో ఆగని హింసాకాండ

తాజాగా మరో మహిళ మృతి



ఇంఫాల్, న్యూఢిల్లీ : మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతోనే ఉంది. తాజాగా ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో ఒక పాఠశాల బయట ఒక మహిళను సాయుధ దుండగులు కాల్చి చంపారు. స్థానిక శిశు నిష్టా నికేతన్ పాఠశాల ఎదుట గురువారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. మృతురాలి వివరాలు ఇంకా తెలియరాలేదు. స్కూళ్లు తెరిచిన మరుసటి రోజే ఈ హత్య జరగడం గమనార్హం. సుమారు రెండు నెలల తరువాత బుధవారం నుంచి మణిపూర్‌లో పాఠశాలలు పున: ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో హింసాకాండ కారణంగా గత రెండు నెలలుగా విద్యాసంస్థలు మూతబడ్డాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలను తిరిగి తెరిచారు. హింసాకాండ భయంతో తొలి రోజు విద్యార్థులు అంతంత మాత్రంగానే హాజరయ్యారు. తాజాగా పాఠశాల బయట మహిళను చంపేయడంతో ప్రజలు మరింత భయభ్రాంతులకు గురవుతున్నారు.

అలాగే, బుధవారం థౌబల్ జిల్లాలో ఇండియన్ రిజర్వ్ బెటాలియన్(ఐఆర్‌బి)కు చెందిన ఓ జవాను ఇంటిని దుండగులు గుంపు దహనం చేసింది. పోలీసు విభాగానికి చెందిన ఆయుధశాల నుంచి తుపాకులను ఎత్తుకెళ్లడానికి చేసిన ప్రయత్నాలను తిప్పికొట్టారన్న ఆగ్రహంతో ఈ దుశ్చర్యకు పాల్పడింది.

హైకోర్టును ఆశ్రయించండి : మణిపూర్‌లో ఇంటర్‌నెట్ నిషేధంపై సుప్రీం

మణిపూర్‌లో రెండు మాసాలుగా అమల్లో వున్న ఇంటర్‌నెట్ నిషేధాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించడానికి సుప్రీం కోర్టు తిరస్కరించింది. మణిపూర్ హైకోర్టు దీన్ని ఇప్పటికే విచారించిందని పేర్కొంది. "దీనిపై డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. మీరు హైకోర్టుకు ఎందుకు వెళ్ళరు? ఎందుకంటే, మేం నోటీసులు జారీ చేసిన మరుక్షణం హైకోర్టు దీన్ని పరిశీలించడం ఆపేస్తుంది." అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ పి.ఎస్.నరసింహా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన బెంచ్ ఇద్దరు పిటిషనర్లకు చెప్పింది. మణిపూర్ హైకోర్టు న్యాయవాది చోగతమ్ విక్టర్ సింగ్, వ్యాపారవేత్త మయేంగ్బమ్ జేమ్స్‌లు ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయంలో హైకోర్టు ఇంతవరకు దామాషా సూత్రాన్ని పరిశీలించలేదని పిటిషనర్ల తరపు న్యాయవాది షాదన్ ఫరాసత్ చెప్పారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ, హైకోర్టు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిందని చెప్పారు. రాష్ట్రంలో ఇంటర్‌నెట్‌ను పునరుద్ధరించవచ్చా లేదా అనేది పరిశీలించాల్సిందిగా ఆ కమిటీని ఆదేశించిందని చెప్పారు. "షాదన్ ఫరాసత్ ఈ విషయంలో దామషా సూత్రాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం వుందని చెబుతున్నారు. పైగా 226వ అధికరణపై పిటిషన్ కూడా పెండింగ్‌లో వున్నందున, ఈ అంశాన్ని ఇక ఇక్కడితో ఉపసంహరించుకోవడానికి ఫరాసత్ అనుమతి కోరుతున్నారు. పెండింగ్‌లో వున్న అంశంలో జోక్యం చేసుకుని, హైకోర్టులో స్వతంత్ర పిటిషన్ దాఖలుచేయడానికి అనుమతి కోరుతున్నారు. అనుమతి మంజూరు చేయబడింది" అని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. తొలుత మే 3న మణిపూర్‌లో ఇంటర్‌నెట్‌ను నిషేధించారు. తర్వాత అనేకసార్లుగా దాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. నిర్దిష్ట ప్రాంతాల్లో ఇంటర్‌నెట్‌కు పరిమితంగానైనా అవకాశం కల్పించాల్సిందిగా జూన్ 16న మణిపూర్ హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జూన్ 20న ఈ మేరకు బహిరంగంగా ఉత్తర్వులు వెలువడ్డాయి.కానీ ఇప్పటివరకు ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకోలేదు.

స్టాండింగ్ కమిటీ సమావేశంలో మణిపూర్‌పై చర్చకు నిరాకరణ : ప్రతిపక్ష ఎంపీల వాకౌట్

న్యూఢిల్లీ : మణిపూర్ పరిస్థితిపై చర్చించాలన్న తమ డిమాండ్ నిరాకరించడంతో ముగ్గురు ప్రతిపక్ష పార్టీల ఎంపీలు హోం వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. గురువారం స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ బ్రిజ్‌లాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాంగ్రెస్ ఎంపీలు దిగ్విజయ సింగ్, ప్రదీప్ భట్టాచార్య, టీఎంసీ ఎంపీ డెరెక్ ఓబ్రెయిన్ ముగ్గురూ సమావేశం ప్రారంభమైన పది నిమిషాలకే నిష్క్రమించారు. జైళ్ల స్థితిగతులపై చర్చ చేపట్టేలోపు మణిపూర్ పరిస్థితిపై కమిటీ అత్యవసరంగా చర్చించాలని ఈ ముగ్గురు ఎంపిలు డిమాండ్ చేశారు. జైలు పరిస్థితులపై చర్చ తరువాత జరగవచ్చని, మణిపూర్ గురించి త్వరగా చర్చించాలని కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్ కోరారు. మణిపూర్‌లో "తీవ్రమైన సంక్షోభం"లో ఉన్న పరిస్థితిని చర్చించాల్సిన అవసరాన్ని బ్రిజ్ లాల్‌కు రాసిన లేఖలో ఓబ్రెయిన్ నొక్కి చెప్పారు. మణిపూర్‌లో హింసకు ముగింపు అవసరం అని అన్నారు. మణిపూర్‌పై చర్చించేందుకు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ గత నెలలో కొందరు ఎంపిలు చైర్మన్‌కు లేఖలు కూడా రాశారని, సమావేశ ఎజెండాను నిర్ణయించడం ఛైర్మన్‌కు ఉన్న అధికారమని నొక్కిచెప్పినట్టు లేఖలో గుర్తు చేశారు. సరిహద్దు రాష్ట్రంలో 100 మందికి పైగా మరణించిన మరియు 50,000 మందికి పైగా ప్రజలను సహాయక శిబిరాలకు తరలించాల్సిన పరిస్థితి గురించి దిగ్విజయ సింగ్ గత నెలలో బ్రిజ్ లాల్‌కు లేఖ రాశారు. మతపరమైన మలుపు తీసుకున్న ఈ హింసలో 250కి పైగా చర్చిలు, 100 దేవాలయాలు ధ్వంసమయ్యాయని, 2,000 ఇళ్లు తగలబడిపోయాయని సింగ్ లేఖలో పేర్కొన్నారు.

వ్యాగన్ తయారీ కేంద్రంతో.. 1,200 మందికి ప్రత్యక్షంగా ఉపాధి

- 2025 ఫిబ్రవరి కల్లా పూర్తి
- రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి



కాజీపేటలో వ్యాగన్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వల్ల 1,200మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఈ ఫ్యాక్టరీతో పరిసర ప్రాంతాల్లో పరోక్షంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు పెరుగుతాయని దక్షిణ మధ్య రైల్వే జోన్ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. గురువారం హన్మకొండ జిల్లా కాజీపేట రైల్వే జంక్షన్‌ను సందర్శించిన అనంతరం అయోధ్యపురంలో ఈనెల 8న ప్రధాని మోడీ శంకుస్థాపన చేయనున్న వ్యాగన్ తయారీ కేంద్రం ప్రతిపాదిత స్థలాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో జీఎం మాట్లాడుతూ.. గతంలోనే ఇక్కడ వ్యాగన్ పీరియాడిక్ ఓవర్ హాలింగ్ యూనిట్ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయన్నారు. పీఓహెచ్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ వ్యాగన్ తయారీ కేంద్రాన్ని నిర్మించాలని రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుందని తెలిపారు. పీఓహెచ్ యూనిట్‌తోపాటు వ్యాగన్ తయారీ కేంద్రం నిర్మాణంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. వ్యాగన్ తయారీ కేంద్రం కొల్‌కతాలో ఒకటుందని, దాని తరువాత ప్రభుత్వ నియంత్రణలో ఏర్పాటుచేస్తున్న రెండో వ్యాగన్ తయారీ కేంద్రమిదేనని తెలిపారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారని విలేకరులు ప్రశ్నించగా, తమ చేతుల్లో ఏమీ లేదని, ఇది రైల్వే మంత్రిత్వ శాఖ తీసుకోవాల్సిన నిర్ణయమన్నారు. ఈ పరిశ్రమ 2025 ఫిబ్రవరిలో పూర్తవుతుందని తెలిపారు. యాదాద్రి ఎంఎంటీఎస్‌కు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులివ్వలేదని, కేంద్రం ఇచ్చే నిధులతోనే వచ్చే 3 నెలల్లో మరోమారు ఎంఎంటీఎస్ నిర్మాణానికి టెండర్ పిలవనున్నట్టు చెప్పారు. రైల్వే కోచ్‌ల కంటే వ్యాగన్‌లకు అధిక డిమాండ్ ఉందన్నారు. వచ్చే నాలుగేండ్లలో వ్యాగన్‌ల డిమాండ్ పెద్ద ఎత్తున పెరగనుందని, దీన్ని దృష్టిలో ఉంచుకునే వ్యాగన్ తయారీ కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వచ్చే ఆర్డర్‌లను బట్టి వివిధ రకాల వ్యాగన్‌లను, వివిధ సైజ్‌లతో నిర్మించడం జరుగుతుందన్నారు. కాజీపేటను రైల్వే డివిజన్‌గా ప్రకటించాలన్న డిమాండ్‌పై ప్రశ్నించగా, అది విధానపరమైన నిర్ణయమని, రైల్వే మంత్రిత్వ శాఖ పరిధిలోని అంశమని సమాధానం దాటవేశారు. విలేకరుల సమావేశంలో సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ ఎకే గుప్తా, రైల్వే వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌విఎన్‌ఎల్) ప్రాజెక్టు మేనేజర్ మున్నా కుమార్, సీపీఆర్‌ఓ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

జెనిన్‌లో ఏ ఇల్లు చూసినా విధ్వంసమే!

- మిలటరీ స్థావరాలుగా మారిన ఇళ్ళు
- బీభత్సాన్ని సృష్టించిన ఇజ్రాయిల్ సైనిక బలగాలు

జెరూసలేం : ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని జెనిన్ పట్టణంలో ఏ ఇల్లు చూసినా వినాశనం, విధ్వంసమే కనిపిస్తోంది. పెద్ద తుపానులు వస్తే ఇల్లు వాకిలీ ఎలా ధ్వంసమవుతాయో ఆ రకమైన పరిస్థితి కనిపిస్తోంది. ఇళ్ళలోని ఫర్నిచర్ అంతా పగిలిపోయి, విరిగిపోయి, నేల బీటలు వారి, కరెంట్ లైన్లు కట్ అయిపోయి ఎక్కడ చూసినా బీభత్సంగా వుంది. ఇజ్రాయిల్ బలగాలు జెనిన్ నుండి వైదొలగిన తర్వాత అక్కడి పరిస్థితి ఇది. ఏది కూడా ఉపయోగించడానికి వీలుగా లేదు. పెద్ద వినాశనమే చోటు చేసుకుంది అని తమ ఇళ్ళకు తిరిగి వచ్చినవారు వ్యాఖ్యానిస్తున్నారు. ఆదివారం నుండి మూడు రోజుల పాటు సాగిన ఇజ్రాయిల్ ఆర్మీ దాడుల తర్వాత నెమ్మదిగా ఒకరొకరుగా వస్తున్నారు. "ఇంట్లో ప్రతిదీ మరమ్మత్తులు చేయించుకోవాల్సిందే, వీటికి కనీసం నెల రోజులు పట్టేలా వుంది." అని తహనెహ్ (41) వ్యాఖ్యానించారు. గత రెండు దశాబ్దాల్లోనే అత్యంత దారుణంగా జరిగిన దాడి ఇది. "కేవలం పది నిముషాల్లోగా ఇక్కడ నుండి వెళ్ళిపోవాలి. లేనిపక్షంలో మీ ఇళ్ళపై బాంబు దాడులు చేస్తాం." అని సైనిక బలగాలు మైకుల్లో గట్టిగా కేకలు వేసారని తహనెహ్ గుర్తు చేసుకున్నారు.

జెనిన్ పట్టణంలో అనేక ఇళ్ళు ఇజ్రాయిల్ ఆర్మీ బలగాలకు మిలటరీ స్థావరాలుగా మారాయి. అనేక ఇళ్ళకు బయటి గోడలకు పెద్ద పెద్ద రంధ్రాలు పెట్టి వాటిల్లో నుండి పాలస్తీనియన్లను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపారు. ఆ ప్రాంతాల్లో నేలపై ఎక్కడ పడితే అక్కడ ఖాళీ తూటాలు పడి వున్నాయి. ఇళ్ళలో వస్తువులను, ఆహార పదార్ధాలను చెల్లాచెదురు చేశారు. ఇళ్ళకు వచ్చి చూసుకుంటే కేవలం విధ్వంసం తప్ప మరేమీ కానరావడం లేదని వారు వాపోతున్నారు. 1948లో తమ స్వంత ఇళ్ళ నుండి వెళ్ళగొట్టబడిన దాదాపు 23,600మంది పాలస్తీనియన్లు జెనిన్ పట్టణంలో పునరావాసం ఏర్పాటు చేసుకున్నారు.

'అధికారులకు జరిమానా'

నవతెలంగాణ-హైదరాబాద్



కోర్టు ధిక్కార కేసులో పలువురు అధికారులకు హైకోర్టు రూ.10 వేలు చొప్పున జరిమానా విధించింది. నాలుగు వారాల్లోగా ఆమొత్తం చెల్లించకపోతే నెల రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని గురువారం తీర్పు చెప్పింది. ఐఏఎస్ అధికారులు నవీన్ మిట్టల్, వాకాటి కరుణ, కాలేజీ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ యాదగిరి, కల్వకుర్తి మోడల్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ స్వర్ణలతకు శిక్ష విధించింది. నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కాలేజీలో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న కె.శ్రీనివాసరావు తొలగింపు ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసిన తర్వాత కూడా విధుల్లోకి తీసుకోకుండా తొలగింపు ఉత్తర్వులు జారీ చేయడాన్ని న్యాయస్థానం కోర్టు ధిక్కరణగా పరిగణించింది. ఈ మేరకు పిటిషనర్ శ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు చెప్పింది.

తీసుకున్న చర్యలు చెప్పండి

డిండి ప్రాజెక్టు నుంచి ఇసుకను అక్రమ తరలింపులపై తీసుకున్న చర్యలు ఏమిటో చెప్పాలని అధికారులకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇరిగేషన్ అండ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శిలకు నోటీసులు ఇచ్చి విచారణను ఆగస్టు 18కి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ డివిజన్‌బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇసుక అక్రమ తవ్వకాలపై అధికారులు చర్యలు లేవంటూ అఖిల భారత్ హిందు మహా సభ అధ్యక్షుడు ఎస్ శ్రీనివాస్ వేసిన పిల్‌ను గురువారం విచారించింది.

మరుగుదొడ్లు లేవా

హైదరాబాద్ నగరంలోని నౌబత్ పహాడ్ ప్రాంతంలో మహిళలకు మరుగుదొడ్లు లేకపోవడంపై హైకోర్టు విస్మయాన్ని వ్యక్తం చేసింది. రాత్రిళ్లు మహిళలు బహిర్భూమికి వెళ్లాల్సివస్తోందంటూ పత్రికల్లో వచ్చిన వార్తను హైకోర్టు పిల్‌గా పరిగణించి విచారించింది. మున్సిపల్ శాఖ, పట్టణాభివృద్ధి, జీహెచ్‌ఎంసీలకు నోటీసులు ఇచ్చింది. విచారణను వచ్చే నెలకు వాయిదా వేస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే విచారణ నాటికి స్టేటస్ రిపోర్టు ఇవ్వాలని అధికారులను ఆదేశించింది.


మోడీ సభను విజయవంతం చేయాలి

- పార్టీ శ్రేణులకు ఈటల రాజేందర్ పిలుపు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

పైకి లేచి ఒక్కటేసారి కిందకు పడిపోవడానికి బీజేపీ సెన్సెక్స్ కాదని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మెన్ ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. హన్మకొండ జిల్లాలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో ఈ నెల 8న జరగనున్న ప్రధాని మోడీ బహిరంగసభ ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించిన ఆయన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కుటుంబ పాలనకు అంతం పలికేది బీజేపీ మాత్రమేనన్నారు. బీజేపీపై అసహనంతో బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేనని కొందరు దుష్ప్రచారం చేస్తూ విషం కక్కుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని ప్రధాని ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఒంటరి మహిళలకు ఇచ్చే ఫించన్ నాలుగేండ్లుగా నిలిచిపోయిందన్నారు. శనివారం ఉదయం 9.30 గంటలకు ప్రధాని మోడీ వరంగల్‌కు రానున్నారని, ఈ సందర్భంగా జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. విజయరామారావు, ప్రధాన కార్యదర్శి జి. ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్ రెడ్డి, హన్మకొండ జిల్లా అధ్యక్షులు రావు పద్మ, వరంగల్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యేలు ధర్మారావు, వన్నాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసమే బాబు జగ్జీవన్ రామ్ జీవితం అంకితం : కాసాని జ్ఞానేశ్వర్



నవతెలంగాణ-హైదరాబాద్

ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి దళిత ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ ఆయన సేవలు చిరస్మరణీయమని తెలుగుదేశం తెలంగాణశాఖ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని అంకితం చేసిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి దళిత ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ అన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన మార్గం ఆచరణీయమని గుర్తు చేశారు. జాతీయ నాయకుడుగా, పార్లమెంట్ సభ్యులుగా, కేంద్ర మంత్రిగా అణగారిన తరగతుల అభ్యున్నతికి ఆయన రాజకీయ జీవితంలో ఎనలేని సేవలు అందించారని అభిప్రాయపడ్డారు. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులు వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధులు ప్రేమ్ కుమార్ జైన్, టి.జ్యోత్స్న, ప్రధాన కార్యదర్శులు రాజు నాయక్, జక్కిలి ఐలయ్య, ఎస్సీ సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, అధికార ప్రతినిధులు సూర్యదేవర లత, దామర సత్యం, ముప్పిడి గోపాల్, కార్యనిర్వాహక కార్యదర్శి సంధ్య పోగు రాజశేఖర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్లోబల్ ఇన్నోవేషన్ కేంద్రంగా టీ-హబ్

ఇన్నోవేషన్ సమ్మిట్ ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్

- ఏడాది పూర్తిచేసుకున్న టీ-హబ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



టీ-హబ్ అద్భుతమైన విజయాలు సాధించిందని, గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మారడానికి తెలంగాణ నిబద్ధతకు నిదర్శనమని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను రూపొందించడంలో, తెలంగాణను పారిశ్రామికవేత్తలకు ఇష్టపడే గమ్యస్థానంగా మార్చడానికి టీ-హబ్ చేస్తున్న కషి ఎనలేనిదని చెప్పారు. టీ-హబ్ ఏర్పాటు చేసి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా గ్లోబల్ ఇన్నోవేషన్ సమ్మిట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 'గ్లాడియేటర్స్ ఆఫ్ ది మైండ్ అనే పేరుతో సైన్స్‌లో మూడు అసాధారణ పేర్లను చూశాం. వారిలో ప్రముఖ పాలియోఆంత్రోపాలజిస్ట్ లూయిస్ లీకీ, ప్రముఖ న్యూరో సైంటిస్ట్ అనిల్ సేథ్, సర్ మార్కస్ డు సౌటోయ్, గౌరవనీయ గణిత శాస్త్రజ్ఞుడు, సుప్రసిద్ధ భారతీయ రచయిత మహమూద్ ఫరూకీ ఉన్నారు. స్టార్టప్‌లను ప్రోత్సహించడంలోనూ, ఆవిష్కరణలను ప్రారంభించడంలోనూ టీ-హబ్ అద్భుతమైన విజయాలు సాధించింది. గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మారడానికి తెలంగాణ నిబద్ధతకు నిదర్శనం. స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను రూపొందించడంలో, తెలంగాణను పారిశ్రామికవేత్తలకు ఇష్టపడే గమ్యస్థానంగా మార్చడానికి టీ-హబ్ చేస్తున్న కషి ఎనలేనిది. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో తెలంగాణను ముందంజలో ఉంచడంలో టీ-హబ్ కీలక పాత్ర పోషించింది. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రారంభించడంలో దాని అద్భుతమైన విజయాల ద్వారా స్టార్టప్‌లకు ప్రపంచ గమ్యస్థానంగా హైదరాబాద్ స్థానాన్ని పటిష్టం చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ హబ్‌గా అవతరించినందుకు మేము గర్విస్తున్నాం. రాబోయే రోజుల్లో మరింత గొప్ప ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి మేము ఎదురుచూస్తున్నాం' అని అన్నారు. కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ ఐటీ రంగంలో అమెరికా తర్వాత హైదరాబాద్ నెంబర్ వన్‌గా మారిందన్నారు. కొత్త ఆలోచనలు, కొత్త ప్లానింగ్‌తో సక్సెస్ సాధ్యమని అన్నారు. జీవితంలో ఎత్తుపల్లాలు ఉంటాయని, అన్నింటిని అధిగమించినప్పుడే విజయం సాధించొచ్చన్నారు. టీ-హబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ, 'ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ హబ్‌గా మా ప్రయాణంలో టీ-ఇన్నోవేషన్ సమ్మిట్ ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. వ్యవస్థాపకత, ఆవిష్కరణలకు మద్దతు ఇవ్వడానికి గ్లోబల్ నెట్‌వర్క్‌లు, కమ్యూనిటీలను ఒకచోట చేర్చే శక్తివంతమైన ప్లాట్‌ఫారమ్‌ను సష్టించినందుకు గర్వంగా ఉంది. స్టార్టప్‌లను పెంపొందించడం, వ్యవస్థాపకులకు సాధికారత కల్పించడంలో మా నిబద్ధతగా ఉన్నాం. టీ-ఇన్నోవేషన్ సమ్మిట్‌తో పాటు, టీ-హబ్ చేస్తున్న చొరవ, రాష్ట్రం నుండి అత్యంత ఆశాజనకమైన స్టార్టప్‌లను కనుగొనడం, వేగవంతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.సిరిసిల్ల, నిర్మల్, వరంగల్, మేడ్చల్, జోగులాంబ గద్వాల్ ఐదు క్లస్టర్‌లను కలిగి ఉన్న ఈ ఈవెంట్ 33 జిల్లాల్లో 120 రోజుల పాటు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్, అధికారులు పాల్గొన్నారు.